www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

7th ANNIVERSARY 22nd October, 2025

సంపుటి 08, సంచిక: 354 | మంగళవారం | 25-11-2025 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

**కోకాపేట నియోపోలీస్‌లో ఎకరం ధర రూ.137.25 కోట్లు** 03

ప్లాట్ 17 (4.59 ఎకరాలు) ఎకరాకు రూ.136.50 కోట్లు

ప్లాట్ 18 (5.31 ఎకరాలు) ఎకరాకు రూ.137.25 కోట్లు





# నోయిడాగా కొడంగల్

● 16 నెలల్లో తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు ● రూ.5 వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మాణం ● రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్ కూడా ఇక్కడే ● 3 నెలల్లో ప్రతి గ్రామానికి కృష్ణా నీరు● లగచర్ల పారిశ్రామిక వాడకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువస్తాం ● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన● రూ.103 కోట్ల అభివృద్ధి పనులకు, అక్షయ పాత్ర ఫౌండేషన్ కిచెన్‌కు శంకుస్థాపన



ప్రజాపక్షం/హైదరాబాద్ /వికారాబాద్

జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కొడంగల్‌లో రూ.5 వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తామని రేవంత్ రెడ్డి వివరించారు. రాబోయే కొన్ని నెలల్లో నియోజకవర్గంలో రైల్వే పనులు ప్రారంభమవుతాయన్నారు. దేశానికే కొడంగల్‌ను ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందిస్తున్నామని వెల్లడించారు. దీంతో ప్రభుత్వ బడుల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ పర్యటనకు వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి అక్కడి ‘అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్’ను పరిశీలించారు. మధ్యాహ్న భోజన కిచెన్ భవన నిర్మాణానికి, రూ.103 కోట్లతో అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మైనార్టీ శాఖ ద్వారా 625 లబ్ధిదారులకు ఆర్థిక సహాయం నిమిత్తం వికారాబాద్ , నారాయణపేట్ జిల్లాలోని కొంతమంది లబ్ధిదారులకు పౌల్ట్రీ, గొర్రెల ఫామ్ ఏర్పాటుని మిత్తం ఆర్థిక సహాయం చెక్కులను ముఖ్యమంత్రి అందజేశారు. మహిళా శక్తి పథకంలో భాగంగా మద్దూర్ మండల మహిళా సమాఖ్య సౌజన్యంతో నడిపిస్తున్న ఆర్‌టిసి బస్సును ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులు కు రూ. 300 కోట్ల వడ్డీలేని రుణాలు చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. కొడంగల్, కోస్గి, మద్దూర్, బొంరస్‌పేట్, దౌల్తాబాద్, గుండుమల్, కొత్తపల్లి, దుద్యాల మండలాలో అక్షయ పాత్ర మధ్యాహ్న భోజనం అందిస్తున్న హరే కృష్ణ పౌండేషన్ కిచెన్ షెడ్‌కు శంకుస్థాపన చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గల హెచ్‌కెఎం చారిటబుల్ ఫౌండేషన్ సెంట్రలైజ్ కమ్యూనిటీ కిచెన్ షేడ్‌ను తరువాయి 2లో

# వ్యవధి ఇవ్వండి లొంగిపోతాం

● మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులకు మావోయిస్టు కమిటీ లేఖ ● మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న నిర్బంధాలతో సాయుధ పోరాటం వీడాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం



మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కూంబింగ్ ఆపరేషన్లను నిలిపేస్తే ఆయుధాలు వదిలేస్తామంటూ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసి) జోనల్ కమిటీ అనంత్ పేరిట మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. ఈ లేఖ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అభ్యర్థన చేస్తూ ఉంది. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న నిర్బంధాల కారణంగా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమింపజేయాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పోలిట్‌బ్యూరో సభ్యులు సోనూదాదా తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తున్నట్లు ఆ లేఖలో ఉంది. మావోయిస్టు పార్టీకి చెందిన పలువురు నేతలు సైతం దీనిని సమర్థించారని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు తమకు కొంతమేరా సమయం ఇవ్వాలన్నారు. మావోయిస్టులను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి 31 నాటికి గడువు విధించిందని, అయితే ఆయుధాలు వదిలేసే విషయంపై సమష్టి నిర్ణయం తీసుకునేందుకు 2026 ఫిబ్రవరి 15వ తేది వరకు సమయం ఇవ్వాలని కోరారు. అప్పటి వరకు మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. రాబోయే పిఎల్‌జిఎ వారోత్సవాల సందర్భంగా ఎలాంటి ఆపరేషన్లు నిర్వహించవద్దని ఎంఎంసి తరువాయి 2లో

# భారత ప్రధాన న్యాయమూర్తిగా సూర్యకాంత్ ప్రమాణం

● సిజెఐగా తొలి హర్యానా వాసిగా రికార్డు ● పదవిలో 15 నెలలు...



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణంచేశారు. ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్. గవాయ్ పదవీకాలం ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. దీంతో సిజెఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హర్యానా వాసిగా రికార్డు సృష్టించారు. జస్టిస్ కాంత్ అక్టోబర్ 30న తదుపరి సిజెఐగా నియమితులయ్యారు 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. జమ్ముకశ్మీర్ ప్రత్యేక హోదాను తొలగించే ఆర్టికల్ 370 రద్దు, బిహార్ ఓటర్ల జాబితాల సవరణ, పెగాసస్ స్పైవేర్ కేసు వంటి అనేక కీలక తీర్పుల్లో ఆయన భాగస్వామిగా ఉన్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక చిన్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ కాంత్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. దేవుని పేరు మీద హిందీలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ప్రమాణం చేసిన వెంటనే, జస్టిస్ కాంత్ ప్రధాని మోదీని పలకరించడానికి ఆయన వద్దకు వెళ్లారు. ఆ తర్వాత ఎక్స్‌లో మోదీ, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలను పంచుకున్నారు. రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాన మంత్రి మోదీ, సిజెఐ కాంత్, మాజీ సిజెఐ గవాయ్, న్యాయ తరువాయి 2లో

# సీనియర్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత



**ముంబయి :**బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర (89) సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబయిలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో బాలీవుడ్ సినీ ఇండస్ట్రీ దిగ్భ్రాంతికి గురైంది. ధర్మేంద్ర మృతి పట్ల ప్రముఖ నటులు, సెలబ్రిటీలు సంతాపం తెలిపారు.‘మిస్ యూ సర్’ అంటూ సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేస్తున్నారు. ఈ మేరకు తరువాయి 12లో

# పంచాయతీ ఎన్నికలకు సిద్ధం

● ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ ● వివరాల సమర్పణ

ప్రజాపక్షం/హైదరాబాద్




రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలిపింది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి వివరాలను సమర్పిస్తూ, ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని లేఖలో తెలియచేసింది. జిల్లాల కలెక్టర్లు సమర్పించిన సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎన్నికల సంఘానికి అందచేసింది. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్‌ల కేటాయించడంతో పాటు, లాటరీ పద్ధతిలో మహిళా రిజర్వేషన్‌లను ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా నోటిఫికేషన్ జారీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డులకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సన్నహాలు చేస్తోంది.

# క్లిష్ట రాజకీయ స్థితిలో భారత్

● కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాటాలతోనే హక్కులు ● ప్రచార జాతాలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ● ఖమ్మం సరిహద్దుల నుంచి ఇందిరా నగర్ వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ





ప్రజాపక్షం/ఖమ్మం

భారతదేశం ఒక సంక్లిష్ట రాజకీయ స్థితిని ఎదుర్కొంటుందని పాలక వర్గాలు సంపన్నులకు కొమ్ముకాస్తున్నాయని సంపన్న వర్గాల ప్రతినిధిగా మాత్రమే మోదీ పని చేస్తున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ తెలిపారు. ఈ దేశానికి ప్రధానిగా కాకుండా కార్పొరేట్లకు ప్రతినిధిగా మోదీ పని చేస్తుండడంతో దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయన్నారు. మతం ఎజెండాగా సాగుతున్న తరువాయి 12లో

# వంట సరుకులను ప్రభుత్వమే సరాఫరా చేయాలి

● మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి ● పలువురు కార్మిక నాయకులు డిమాండ్ ● సమస్యలకు పరిష్కారం చూపకపోతే డిసెంబర్ చివరి వారం వంటలు బంద్‌చేస్తామని హెచ్చరిక ● డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

ప్రజాపక్షం/హైదరాబాద్



మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,మొత్తం వంట సరుకులను ప్రభుత్వమే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే ప్రతి విద్యార్థికి మెనూ చార్జీల కింద రూ.25 తరువాయి 2లో

# వడ్డీలేని రుణాలు రూ.300 కోట్లు

● 3.50 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు నేడు పంపిణీ ● ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని 3.50 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ 300.40 కోట్ల వడ్డీలేని రుణాలను మంగళవారం పంపిణీ చేయనున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మూడవ విడత వడ్డీ లేని రుణాలను అన్ని శాసన సభ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమంలో పంపిణీ చేస్తామని, ఇందులో ఎంఎల్‌ఎలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తరువాయి 2లో

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో ఆవిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్




భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించనున్న ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్’ లోగో ను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ వ్యాప్తంగా ప్రతినిధులు, వివిధ దేశాల అంబాసిడర్లు కూడా పాల్గొననున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఆదివారం తరువాయి 2లో

# జెనీవా చర్చల్లో ట్రంప్ ప్రణాళిక

● మా భూభాగం ఆక్రమించి చట్టబద్ధత అడుగుతున్నారు ● ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ నిర్వేదం



**కీవ్:** ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు ఉద్దేశించిన 28 అంశాల ట్రంప్ ప్రణాళికపై జెలెన్‌స్కీని ఒప్పించేందుకు, అందరి మద్దతూ కూడగట్టేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఈ విషయంలో పూర్తిగా తలమునకలై ఉన్నారు. జెనీవాలో అమెరికా–ఉక్రేన్ మధ్య చర్చోపచర్చలు జరిగాయి. ఈ చర్చల తర్వాత కూడా ఒక ఒప్పందం కుదిరిందా? లేదా? ఏకాభిప్రాయం వచ్చిందా? అనే విషయం తెలియలేదు. కానీ మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. జెనీవా సమావేశంలో 28 అంశాల ప్రణాళికకు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## కిడ్నాపర్ల నుండి తప్పించుకున్న 50 మంది నైజీరియా విద్యార్థులు

**అబుజా :** నైజీరియాలో కిడ్నాప్‌కు గురైన విద్యార్థులు 50 మంది కిడ్నాపర్ల చెర నుండి తప్పించుకుని బయటపడ్డారు. వారంతా తల్లిదండ్రుల దగ్గరకు చేశారు. ఇంకా 250 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులు కిడ్నాపర్ల ముఠా వద్ద బందీలుగా ఉన్నారు. నైజీరియా చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా సాయుధ ముష్కరులు 315 మంది విద్యార్థులను, టీచర్లను గత శుక్రవారం కిడ్నాప్ చేశారు.నిగర్ రాష్ట్రం నార్త్-సెంట్రల్ ప్రాంతంలో ఉన్న సెయింట్ మేరీస్ క్యాథలిక్ స్కూలు నుండి 303 కిడ్నాప్‌లు జరిగాయి. ఇక అప్పటినుండి నైజీరియా ప్రభుత్వంపైవిమర్శల దాడి పెరిగింది. ప్రభుత్వ వైఫల్యమే కిడ్నాపర్లు రెచ్చిపోవడానికి కారణమని విమర్శలు వస్తున్నాయి. పాఠశాలను ప్రభుత్వం నిరవధికంగా మూసివేసింది. మరోవైపు పోప్ కూడా ఒక విజ్ఞప్తి చేస్తూ కిడ్నాప్‌కు గురైన అభం శుభం తెలియని బాలలను వదిలి పెట్టాలని కోరారు. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసి భారీ ఎత్తున ర్యాన్సమ్ ధనాన్ని సంపాదించేందుకు నైజీరియాలో ఇలా పాఠశాలలపై దాడులు చేసి ముఖ్యంగా బాలికలను కిడ్నాప్ చేసి తీసుకుపోవడం అలవాటుగా మారింది.

# స్కామ్ సెంటర్లపై మయన్మార్ ఉక్కుపాదం

**11 మంది భారతీయులు సహా 1,590 మంది అరెస్టు**

**మొత్తం 206 అక్రమ భవనాలు కూల్చివేత**



**పొంగ్యాంగ్:** మయన్మార్ సైనిక ప్రభుత్వం తమ దేశ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న ఆన్‌లైన్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, స్కామ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ గాలింపు, సోదాలు ముమ్మరం కొనసాగుతున్నాయి. గడచిన ఐదు రోజులుగా జరిపిన దాడుల్లో 11 మంది భారతీయులు,ఇరుగుపొరుగున ఉన్న పాకిస్థానీయులు సహా 1,590 మంది విదేశీయులను అరెస్టు చేసినట్లు జుంటా సైనిక ప్రభుత్వం ప్రకటించింది.100మందిచైనీయులు, 14 మంది వియత్నామీయులు, ఆరుగురు మలేసియావాసులు, 15మందిఇథియోపియన్లు, 11మంది ఉగాండా పౌరులు, ఇద్దరు నమీబియన్లతోపాటు కెన్యా, రువాండా, నేపాల్, కొరియన్,ఈజిప్టు, ఫిలిప్పీన్స్ జాతీయులు అరెస్టయినవారిలోఉన్నారు.అధికారులు ఇప్పటివరకూ 2,893 కంప్యూటర్లు, 21,750 మొబైల్ ఫోన్లు, 101 స్టార్‌లింక్ శాటిలైట్ రిసీవర్లు, 21రౌటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఫ్రాడ్ స్కామ్‌సెంటర్ భవంతులను కూడా అధికారులు ధ్వంసం చేశారు. ఈ ఫ్రాడ్ సెంటర్లు ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవనోపాధి,ప్రజలభద్రతను దెబ్బతీస్తున్నాయని పేర్కొంది. ఆన్‌లైన్ జూదం ఎక్కువగా జరుగుతున్న ష్వే కొక్కో, కె.కె.పార్క్ ప్రాంతాలలో భద్రతా సిబ్బంది, పాలనాయంత్రాంగం ఉమ్మడిగా ఈ దాడులు చేశాయి. మైవాడీ, మేథావ్ తలాయ్ ప్రాంతాలలో నిర్మించిన 10 అక్రమ భవనాలను కూల్చివేశారు. ఇప్పటివరకూ అధికారులు మొత్తం 206 అక్రమ భవనాలను కూల్చివేశారు. మొత్తం 635 భవనాలను అక్రమ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. మిగిలిన భవనాలను కూడా కూల్చివేసే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. శనివారంనాడు అధికారులు ష్వే కొక్కోలో 12 అంతస్తుల షిన్యోంగ్ ప్లాజా, కార్మికుల కోసం నిర్మించిన 14 భవనాలు, మరో రెండు అంతస్తుల భవనాలలోసోదాలు నిర్వహించారు. కానీ చాలామంది సిబ్బంది తమ కంప్యూటర్లు, మొబైల్స్‌ను కూడా తీసుకుని పారిపోయారు. సిబ్బంది 23 భవనాలలో సోదాలు చేస్తే 240 మోనిటర్లను వదిలేసి అన్ని యుపిఎస్‌లను తీసుకుని పారిపోయారని అధికారులు గ్రహించారు. ఇంటర్నెట్ వినియోగదారులను మోసం చేసి వేధింపులకు గురిచేసి ప్రతి సంవత్సరం పదుల బిలియన్ డాలర్లు అక్రమంగా వారి నుండి ఈ స్కామ్ సెంటర్లు వసూలు చేస్తున్నాయని జుంటా ప్రభుత్వం పేర్కొంది. మయన్మార్‌లో పౌర తిరుగుబాటు దళాలకు, ప్రభుత్వ సైన్యానికి మధ్య అంతర్యుద్ధం జరుగుతున్న సరిహద్దు ప్రాంతాలలో ఈ ఫ్రాడ్ ఫ్యాక్టరీలు పెద్ద సంఖ్యలో వెలిశాయని జుంటా పేర్కొంది. గతనెలలోనే ఈ దాడులు ప్రారంభమయ్యాయి. ఈనెల 18 నుండి 22వ తేదీ వరకు గ్యాంబ్లింగ్, ఫ్రాడ్ ఫ్యాక్టరీలపై దాడులు జరిగాయి. వీరంతా అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన విదేశీయులేనని, వారిని అరెస్టు చేశామని జుంటా తెలిపింది. ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరి 30 నుండి నవంబరు 24 వరకు 12,468 మంది విదేశీయులు మయన్మార్‌లోకి స్కామ్ కార్యకలాపాలకోసం ప్రవేశించారు. వీరందరిని అరెస్టు చేశారు. వీరిలో ఇప్పటి వరకూ 11,893 మంది వివరాలు సేకరించారు. వీరిలో 9,978 మందిని చట్టబద్ధంగా థాయ్‌లాండ్‌కు తరలించారు. అక్కడినుండి వారి వారి దేశాలకు తరలిస్తారు. మరో 2,490 మందిని కూడా స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## పెషావర్‌లోని పారామిలిటరీ కార్యాలయం వద్ద ఆత్మాహుతి దాడి

**పెషావర్ :** పాకిస్తాన్ పెషావర్‌లోని పారామిలిటరీ ప్రధాన కార్యాలయం (ఫ్రాంటియర్ కానిస్టేబులరీ) గేటు వద్ద ఆత్మాహుతి బాంబుదాడి జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు పాకిస్థాన్ భద్రతా సిబ్బంది మరణించారు. ఆత్మాహుతికి పాల్పడిన ఉగ్రవాది సహా మరో ఇద్దరు ఉగ్రవాదులు కూడా హతులయ్యారు. ఆ ఆత్మాహుతి దాడి ఘటనకు తామే బాధ్యులమని తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థకు చెందిన జమాతుల్ అహ్రర్ శాఖ ప్రకటించింది. ఈ ఏడాది జులైలోనే ప్రభుత్వం పారామిలిటరీ దళాలకు ఫ్రాంటియర్ కానిస్టేబులరీగా నామకరణం చేసింది. ఆత్మాహుతి బాంబుదాడికి ఆ ప్రాంతంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. తక్షణం సహాయ బృందాలు, అదనపు రక్షణ బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. పారామిలిటరీ ప్రధాన కార్యాలయంలోనికి ప్రవేశించేందుకు ఉగ్రవాదులు ప్రయత్నం చేశారు. మొదట ఒక ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఇక తర్వాత ఇద్దరు ఉగ్రవాదులు ఒక్కొక్కరుగా ఆ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకుని లోనికి ప్రవేశించే ప్రయత్నం చేశారు. ఐతే దాదాపు ఈ దాడులు ఉధృతరూపం దాల్చి తీవ్ర నష్టం కలగకుండా పాకిస్థాన్ భద్రతా బలగాలు కృషి చేశాయి. ఉగ్రవాదుల దాడి నష్టాన్ని కొంతమేరకే పరిమితం చేయగలిగాయి. వారం రోజులక్రితం ఇస్లామాబాదులో జరిగిన ఆత్మాహుతి దాడి మరువకముందే సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఈ ఘటన జరిగిందని పెషావర్ సిటీ పోలీసు ఉన్నతాధికారి డా.మియాన్ సయీద్ అహ్మద్ పాత్రికేయులకు చెప్పారు. దేశంలోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో, ఇతర ప్రాంతాలలో ఉగ్రవాదులు ఉధృతస్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న తరుణంలో భద్రతా వ్యవస్థ చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తోందని చెప్పారు.

# టీనేజర్లకు సోషల్ మీడియా నిషేధం

**కౌలాలంపూర్:** టీనేజర్లను సోషల్ మీడియా జోలికి వెళ్ళకుండా అడ్డుకునే దేశాలసంఖ్య క్రమంపెరుగుతోంది. తాజాగా మలేసియాలో కూడా 16 ఏళ్ళలోపు టీనేజర్లపై కూడా 2026 కొత్త సంవత్సరం ఆరంభం నుండీ ఈ నిషేధం అమలు కానున్నది. మలేసియా పొరుగుదేశం ఇండోనేసియాలో కూడా సోషల్ మీడియా వినియోగంపై వయోపరిమితి నిషేధం అమలు చేయనున్నారు. పిల్లల భద్రత విషయంలో తల్లి తండ్రులలో రోజు రోజకూ ఆం దోళన పెరుగుతూ ఉండటంతో సోషల్ మీడియాపై పిల్లలను మినహాయించడంపై పలు దేశాలలో మద్దతు పెరుగుతోంది. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఆర్థిక నేరాలు పేట్రేగిపోతూ ఉండటంతో అనేక దేశాల ప్రభుత్వాలు ఆందోళన చెందుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, టీనేజర్లు,వృద్ధులుఎక్కువగాసైబర్ నేరాలు, లైంగిక దోపిడీ మోసాల బారిన పడుతున్నారు. మలేసియాలో2026కొత్తసంవత్సరంఆరంభం నుండీ టీనేజర్లపై సోషల్ మీడియా నిషేధం అమలులోకితెస్తున్నట్లు ఆ దేశ కమ్యూనికేషన్స్ మంత్రి ఫాహ్మీ ఫడ్జిల్ చెప్పారు. ఇకమీదట సోషల్ మీడియావేదికలు ప్రభుత్వాలు విధించే నియంత్రణలను అమలు చేయక తప్పదని ఆయన అన్నారు. సోషల్ మీడియా చిన్న పిల్లల ఆరోగ్య మీద, చదువులమీద, వారి భద్రతమీద తీవ్ర ప్రభావం చూపిస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగాటిక్‌టాక్, స్నాప్‌చాట్, మెటా,గూగుల్ వేదికలు సహా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ఆపరేటర్లపై కోర్టు కేసుల సంఖ్య పెరుగుతోంది.

### డిసెంబరు 10 నుండి ఆస్ట్రేలియాలో నిషేధ చర్యలు

ఆస్ట్రేలియాలో 16 ఏళ్ళలోపు టీనేజర్లు సోషల్ మీడియాలోకి రాకుండా డిసెంబరు పది నుండి వివిధ ఫ్లాట్‌ఫామ్‌లు చర్యలు ప్రారంభిస్తున్నాయి. టీనేజర్ల రిజిస్ట్రేషన్లను తొలగిస్తారు. వారి అకౌంట్లను తనిఖీ చేసి ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న టీనేజర్ల అకౌంట్లను రద్దుచేస్తారు.ఇటీవల ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్వహించిన ఒక అధ్యయనంలో 96 శాతం టీనేజర్లు సోషల్ మీడియాలో ఉన్నారు. తల్లితండ్రుల నుండి కూడా ఆస్ట్రేలియాలో తీవ్రమైన ఒత్తిడి వస్తూ ఉండటంతో ప్రభుత్వం టీనేజర్లను సోషల్ మీడియా దగ్గరకురాకుండా ఉండేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ నిషేధం కింద తల్లిదండ్రులు, పిల్లకు ఎలాంటి శిక్షలూ ఉండవు, తగిన జాగ్రత్తలు పాటించని సంబంధిత కంపెనీలు,వేదికలకు భారీగా జరిమానాలు విధిస్తారు. ఉల్లంఘనలకు పాల్పడినవారికి 49.5 మిలియన్ డాలర్లనుండి జరిమానాలువిధించడం ప్రారంభించి అంతకంటే ఎక్కువ కూడా వసూలు చేస్తారు. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్స్, టిక్‌టాక్, ఎక్స్, యూట్యూబ్, రెడ్డిట్, కిక్, ట్విచ్ వంటివన్నీ ఆస్ట్రేలియా ప్రభుత్వం హిట్ లిస్టులో ఉన్నాయి.

# ప్రజానిరసన, ప్రతిపక్షాల డిమాండ్ బేఖాతరు

**సైనిక అధికారులపై ఇజ్రాయెల్ వేటు**

**జెరూసలెం:** రెండేళ్ళక్రితం గాజాలో యుద్ధానికి దారి తీసిన హమాస్ సామూహిక దాడిని అరికట్టడంలో విఫలమయ్యారని పేర్కొంటూ అనేకమంది సీనియర్‌సైనికాధికారులపైఇజ్రాయెల్ ప్రభుత్వం వేటు వేసింది. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ దాడిని అరికట్టడంలో సైన్యం, సైనిక అధికారులు ఎందుకు విఫలమయ్యారో తెలుసుకోవడానికి న్యాయవ్యవస్థ ఆధ్వర్యంలోప్రభుత్వ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఐదు జియోనిస్టు ప్రతిపక్షాల తోపాటు "అక్టోబర్ కౌన్సిల్" కలిసి వరుసగారెండోవారంకూడానిరసన ప్రదర్శనలు చేస్తున్న తరుణంలో సీనియర్ అధికారులను ప్రభుత్వం ప ద వులనుండి తొలగించింది. ప్రభుత్వ కమిషన్ ఏర్పాటు చేయాలని ఒకవైపు వామపక్షాలు సహా ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను తిరస్కరిస్తూ నెతన్యాహూ ప్రభుత్వమే ఒక స్వతంత్ర విచారణ జరిపేందుకువీలుగాచట్టసభలో ఒక తీర్మానం చేశారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ చీఫ్ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ సోమవారం అనేకమంది అధికారులను సమావేశపరిచి కొందరు సీనియర్ అధికారులను పదవుల నుండి తొలగించడమే కాకుండా, మరి కొందరిని దీనికి బాధ్యులుగా చే శారు. వారు జవాబు దారి వహించాలంటూ నిలదీశారు. మాజీ ఇంటిలిజన్స్ డైరెక్టరేట్ చీఫ్ మేజర్ జనరల్ అహరోన్ హాలిఫాను రిజర్వ్‌డ్ డ్యూటీల నుండి తొలగిస్తారు. ఇకమీదట ఆయన ఐడిఎఫ్ లోఎలాంటి బాధ్యతలూ నిర్వహించరు. ఈ ఏడాది జులైనెలలో పదవీకాలం ముగిసిన మాజీ ఆపరేషనల్ డైరెక్టరేట్ చీఫ్ మేజర్ జనరల్ ఓడెడ్ ఒసియుక్‌ను కూడా రిజర్వు డ్యూటీల నుండి తొలగిస్తారు. ఇకమీదట ఆయన కూడా ఇజ్రాయెల్ సైన్యంలో పనిచేయరు. అదేవిధంగా ఈ ఏడాది మార్చినెలలో పదవికి రాజీనామా చేసిన సదరన్ కమాండ్ చీఫ్ మేజర్ జనరల్ యూరోన్ ఫింకెల్‌మాన్‌ను కూడా రిజర్వు డ్యూటీల నుండి తొలగించారు. 2023అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు వందలమంది సామూహికంగా సరిహద్దు కంచె బద్దలుకొట్టుకుని ఇజ్రాయెల్ లోకి ప్రవేశించి విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ప్రధానంగా సరిహద్దు ప్రాంతంలో జరుగుతున్న ఒక సంగీత ఉత్సవంపై కాల్పుల దాడి చేశారు. మొత్తం ఈ దాడుల్లో1250మందిఇజ్రాయెలీ ప్రజలు హమాస్ ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించగా, మరో 250 మందిని బందీలుగా వారు గాజాకు తీసుకుపోయారు. ఇంతపెద్ద ఘటన జరగడంలో ఇంటిలిజన్స్ వైఫల్యం ఉందని పేర్కొంటూ నాటి ఇంటిలిజెన్స్ అధికారిపై కూఆ ఇజ్రాయెల్ సర్వ సైన్యాధినేత ఇయాల జమీర్ వేటు వేశారు. నాటి దాడిని నియంత్రించడంలో సైనికాధికారుల వైఫల్యాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బాహ్య నిపుణులు నిర్వహించిన దర్యాప్తు ఆధారంగా సైనికాధికారులపై చర్యలు తీసుకుంటామని ఈనెలారంభంలోనే ఇయాల్ జమీర్ ఒక ఫీలర్ వదిలారు. దానికి అనుగుణంగా సోమవారం సీనియర్ సైనిక అధికారులను సమావేశానికి పిలిపించారు. వారిలో చాలా మందిని పదవులనుండి తొలగించారు.

## సూర్యకాంత్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)



మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కెమెరాకు పోజులిచ్చేటప్పుడు సంప్రదాయంగా గ్రూప్ ఫోటో కూడా తీశారు. మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ కూడా హాజరయ్యారు. కొత్త సిజెఐ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను పలకరించారు. ఆదివారం సిజెఐ పదవి నుంచి వైదొలిగిన జస్టిస్ గవాయ్ తన వారసుడిని కౌగిలించుకున్నారు. ఫిబ్రవరి 10, 1962న హర్యానాలోని హిసార్ జిల్లాలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన జస్టిస్ కాంత్ ఒక చిన్న పట్టణ న్యాయవాది నుండి దేశంలోని అత్యున్నత న్యాయ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఆయన జాతీయ ప్రాముఖ్యత కలిగిన అనేక తీర్పులు, ఆదేశాలలో, రాజ్యాంగ విషయాలలో భాగమయ్యారు. కురుక్షేత్ర విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీలో 'ఫస్ట్ క్లాస్ ఫస్ట్'గా నిలిచిన ఘనత కూడా ఆయనకు ఉంది. పంజాబ్, హర్యానా హైకోర్టులో అనేక ముఖ్యమైన తీర్పులను రాసిన జస్టిస్ కాంత్, అక్టోబర్ 5, 2018న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

### అధికారిక కారును వదలి వెళ్లిన గవాయ్

ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం మాజీ సిజెఐ జస్టిస్ గవాయ్, తాను వచ్చిన అధికారిక కారును కొత్త సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. నిబంధనల ప్రకారం సిజెఐగా పదవీవిరమణ చేసిన అనంతరం మాజీ సిజెఐలు తాము ఉంటున్న అధికారిక నివాసాలను, సిజెఐకి ప్రభుత్వం ఇచ్చే ఇతర సౌకర్యాలను వీడాల్సి ఉంటుంది. అందులోభాగంగానే జస్టిస్ గవాయ్ కారును సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. అయితే జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టిన వెంటనే జస్టిస్ గవాయ్ కారును అక్కడే వదిలివేయడం గమనార్హం.

## రూ.300 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ఇందిరమ్మ చీరెల పంపిణి' పురోగతి, రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో వడ్డేలేని రుణాల పంపిణీ' అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తో కలిసి జిల్లా కలెక్టర్లతో సోమవారం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కాగా ములుగు జిల్లా నుంచి రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న వడ్డీ లేని రుణాలతో మహిళల్లో ఒక ధైర్యం, నమ్మకం, ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. వడ్డీ లేని రుణాల మొత్తం నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నందున ఎవరికి ఎంత మొత్తంలో చేరుతుందనే విషయాన్ని సభ్యులకు స్పష్టం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమ అద్భుతంగా సాగుతోందన్నారు.మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ తమకు నాణ్యమైన ఇందిరమ్మ చీరలను అందించడం పట్ల రాష్ట్రం లోని మహిళలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. నాణ్యమైన చీరాలను అందించడంతో పాటు పెద్ద ఎత్తున వడ్డీలేని రుణాలను కూడా అందించడం పట్ల ఆమె ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కె.రామకృష్ణారావు మాట్లాడుతూ జిల్లాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీని త్వరిత గతిన పూర్తిగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అన్ని నియోజక వర్గాల్లో నిర్వహించే వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా నుండి ప్రాతినిధ్య వహించే మంత్రులు, ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలన్నారు. రాష్ట్రంలో లక్ష మంది విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్స్ నిధులను విడుదల చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జ్యోతి బుద్ధా ప్రకాష్, హౌసింగ్ ఎం.డి గౌతమ్, సెర్ప్ సిఇఒ దివ్య, పంచాయితీ రాజ్ కమిషనర్ సృజన పాల్గొన్నారు.

## ప్రభుత్వమే సరాఫరా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు మొత్తం బిల్లులను వెంటనే చెల్లించడంతో పాటు తమ సమస్యలకు పరిష్కారం చూపకపోతే డిసెంబర్ చివరి వారం రాష్ట్ర వ్యాప్తంగా వంటలు బంద్ చేసి సమ్మెలోకి వెళ్తామని వారు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్( ఎఐటియుసి) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయాన్ని సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన వంట కార్మికులు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిదులు ప్రాథమిక విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ, తెలంగాణ మధ్యాహ్న భోజన ప థకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌పావని, జంపాల రవీందర్ మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగామధ్యాహ్న భోజన పథకంలో వంట కార్మికులుగా పనిచేస్తూ సొంత డబ్బులు వెచ్చించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందిస్తున్న వంట కార్మికుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని వివరించారు. మధ్యాహ్న భోజనానికి పెట్టుబడి పెట్టిన డబ్బులు 9 నుంచి 10 నెలలుగా పెండింగ్‌లో ఉంటే, వారు వంటలు ఎలా చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలకు, మార్కెట్‌లో లభిస్తున్న ధరలకు చాలా వ్యత్యాసం ఉన్నదని, దీంతో ఆ మెనూ ప్రకారం భోజనాన్ని సరఫరా చేయడానికి వంట కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు. నెలకు రూ.3 వేలు మాత్రమే గౌరవ వేతనం చెల్లిస్తూ, అది కూడా పెండింగ్‌లో పెడితే వారు ఎలా జీవిస్తారని, ఎలా పని చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం పథకం బిల్లులను ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయలేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెల రూ. 10వేలవేతనాన్ని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తమడిమాండ్‌పైన కమిషనర్ సానుకూలంగా స్పందించారని, వీలైనంత త్వరగా సమస్యలన్నింటిని పరిష్కారిస్తామని యూనియన్ నేతలకు హామీనిచ్చారని వారు తెలిపారు. కాగా కమిషనర్ హామీ ఇవ్వడంతో ముట్టడిని విరమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ, ఉపాధ్యక్షులు తోపునూరి చక్రపాణి, కుంటాల రాములు, కోశాధికారి ఆది రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోలప్పోలు వెంకటేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పూసల రమేష్, ఉపాధ్యక్షులు ధర్మల రామ్మూర్తి, సిరిసిల్ల లక్ష్మణ్, కరీంనగర్ సాయిలు, నిర్మల్ లక్ష్మి , అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణకుమారి, భద్రాద్రి కొత్తగూడెం ప్రభావతి, నాగర్‌కర్నూలు వెంకటేష్, రామకృష్ణ, భూఖ్య రమేష్, కె.రజిత, గడ్డం లలిత, సామల రమ, పోరెడ్డి ప్రమీల, గున్నాల రాజకుమారి,గడ్డం భారతి, కుదుముల సమ్మక్క, ప్రభావతి, జాడే నాందేవ్, వసంత పాల్గొన్నారు.

## నోయిడాగా కొడంగల్

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నామన్న రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని పునరుద్ఘాటించారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశామన్నారు. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశామని చెప్పారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తామని వెల్లడించారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభమవుతాయన్న ఆయన నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని రేవంత్ రెడ్డి వివరించారు. మరో 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలి అని రేవంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. 'త్వరలో జరగబోవు సర్పంచ్ ఎన్నికలు అత్యంత కీలకం. మంచివాళ్లను సర్పంచ్‌లగా ఎన్నికొండి. పదేళ్లు తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఉంటుంది. ఈ కొడంగల్‌ను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందాం. ఈ ప్రాంతాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టుకుందాం. మన ఆర్థిక పరిస్థితిని బాగుచేయడానికి, అభివృద్ధి పథం వైపు నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. దానికి ఒక ప్రయోగశాలగా కొడంగల్‌ను ఎన్నుకున్నాం. 16 నెలల్లో ఈ ప్రాంతాన్ని తెలంగాణ నొయిడాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు చేపడుతున్నాం' రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, పోలీస్ హౌసింగ్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన, నారాయణపేట్ కలెక్టర్ సిక్తాపట్నాయక్, వికారాబాద్ జిల్లా ఎస్పి స్నేహమెహ్రా, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అక్షయ పాత్ర ఫౌండేషన్ చైర్మన్ సత్యగౌడ, చంద్రప్రభు దాస్‌జీతో పాటు వివిధ శాఖ అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బిసిలకు ద్రోహం తలపెట్టిన పాలకులకు గుణపాఠం తప్పదు

**బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు తీరని ద్రోహం తలపెట్టిన పాలకులకు తగిన గుణపాఠం తప్పదని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలను 50 శాతం రిజర్వేషన్లను మించకుండా పాత విధానంలోనే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి,బిసిలకు తీరని ద్రోహం చేసిందని ఆరోపించారు. శాసనసభ ఆమోదించిన బిసి బిల్లులను కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించేందుకు సిఎం రేవంత్ రెడ్డి కావాలనే ప్రయత్నించడం లేదన్నారు. బిజెపి కేంద్రమంత్రులు, ఆ పార్టీకి చెందిన ఎంపి , కాంగ్రెస్, బి ఆర్ ఎస్ అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు బిసిలను మోసం చేయడంలో పోటీ పడుతున్నాయని ఆరోపించారు. బిసిలకు స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, ఎన్నికల ముందు హామీ ఇచ్చి, బిసిల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం 23 శాతం రిజర్వేషన్లతో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం అత్యంత దుర్మార్గమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమ్మించి మోసం చేయడం పాలకులకు అలవాటుగా మారిందని, రాష్ట్రంలోని 12,733 గ్రామ పంచాయతీలలో 42 శాతం బిసి రిజర్వేషన్లతో 5,348 సర్పంచ్ స్థానాలు రావాల్సి ఉండగా 23 శాతం రిజర్వేషన్లతో 2,929 సర్పంచ్ స్థానాలను కేటాయించారని మండిపడ్డారు. 1,12,474 వార్డులలో 42 శాతం రిజర్వేషన్లతో 47, 239 వార్డులు రావాల్సి ఉండగా 23 శాతంతో కేవలం 25,869 వార్డులు మాత్రమే కేటాయిచారని వివరించారు. ఇప్పటికైనా సిఎం స్పందించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచిన తర్వతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, దీనిపైన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## లొంగిపోతాం

(మొదటి పేజీ తరువాయి)

జోనల్ కమిటీ కోరిం ది. ఎంఎంసి పరిధిలోని దలసభ్యులంతా తమ కార్యకలాపాలు నిలిపేయబోతున్నట్లు తెలుపుతూనే దీనిపై పెద్ద ఎత్తున రేడియోలు, వార్తాపత్రికలు, టివీ ఛానళ్లలో ప్రచారాం చేయాలని, అప్పుడే ఈ సమాచారం మా వారందరికీ తెలుస్తుందని, కొందరు జర్నలిస్టులు,ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యే అవకాశాన్ని కల్పించాలన్నారు. తద్వారా అంతా సామూహికంగా ఆయుధాలు వదిలి పునరావాస ప్రణాళికను అంగీకరించేందుకు ఒక ఖచ్చితమైన తేదీని ప్రకటిస్తామని ఆలేఖలో పేర్కొన్నారు.

### ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 15 మంది మావోయిస్టులు

సుక్మా జిల్లాలో సోమవారు 15 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన పదిహేను మందిలో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. మావోయిస్టు పార్టీపై నానాటికీ పెరుగుతున్న నిర్బంధం కారణంగా తాము లొంగిపోయేందుకు వచ్చినట్లు సుకుమా ఎస్‌పి కిరణ్ చౌహాన్ ఎదుట వారు చెప్పారు. లొంగిపోయిన వారిలో నలుగురిపై ఒక్కరికి రూ.8 లక్షల చొప్పున 32 లక్షల రివార్డు, మరో ఇద్దరికి ఒక్కొక్కరికి చొప్పున రూ.5 లక్షల రివార్డు ఉంది.

## లోగో ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

పలువురు మంత్రులు, వివిధ శాఖలఅ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పరిశీలించిన విషయం తెలిసిందే. గ్లోబల్ సమ్మిట్‌కు పాస్‌లు లేకుండా ఎవరు ఎంట్రీ కావడానికి వీలు లేదని, సమ్మిట్ కు సంబంధం లేని వారికి ఎట్టి పరిస్థితుల్లో ఎంట్రీ ఇవ్వకూడదని, సమ్మిట్‌కు సంబంధించి వివిధ శాఖల వారీగా పకడ్బందీగా అధికారులకు ఎంట్రీ ఉంటుందని సిఎం స్పష్టం చేశారు. సమ్మిట్ ఏర్పాట్లను తాను ఎప్పటికప్పుడు పరిశీలిస్తానని, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## దాడి కేసులో చట్టపరమైన చర్యలు

ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైకోర్టు న్యాయవాదిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి, తక్షణమే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. హైకోర్టు న్యాయవాది హబిబ్ రిజ్వాన్ హష్మిపైన ఒక కేసుకు సంబంధించిన ప్రత్యర్థులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో 'హైకోర్టు బార్ అసోసియేషన్' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హైకోర్టు గేటు ముందు న్యాయవాదులు సోమవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదిపై దాడిచేసిన వ్యక్తులపైన కేసు నమోదు చేసి, తక్షణమే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశబూరు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్, ప్రధాన కార్యదర్శి విజారత్ అలీ, ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ పాల్గొని, న్యాయవాదులకు మద్దతు తెలిపారు. తక్షణమే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## ఐబొమ్మ రవి ఒక్కడే పైరసీ చేశాడు..

ముగిసిన ఐదు రోజుల పోలీసు కస్టడీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐబొమ్మ రవి ఐదురోజుల పోలీసు కస్టడీ సోమవారం ముగిసింది. సినిమాలను పైరసీ చేసి వాటిని ఐబొమ్మ, బప్పం టివి వెబ్ సైట్లలో పెట్టిన ఐబొమ్మ రవిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే అతడిని సిసిఎస్ పోలీసులు ఐదురోజుల కస్టడీకి తీసుకుని.. ఐదు రోజుల పాటు రవిని విచారించి కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. రవి ఒక్కడే పైరసీ చేసినట్లు నిర్ధారించారు. టెలిగ్రామ్ ద్వారా పైరసీ సినిమాలను కొన్నట్లుగా తెలుసుకున్నారు. అతని బ్యాంక్ అకౌంట్లో రూ.20 కోట్ల లావాదేవీలను గుర్తించారు. సినిమాలు చూసేందుకు వెబ్ సైట్ ఓపెన్ చేసిన వారికి ఏపీకే లింక్స్ పంపి బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లు చేశాడని, ఆ నిధులను భారత్ లో ఉన్న ఐడిఎఫ్‌సి బ్యాంకుకు మళ్లించినట్లు గుర్తించారు. కస్టడీ ముగిసిన అనంతరం రవిని చంచల్ గూడ జైలుకు తరలించారు. ఇక కస్టడీలో తొలిరోజు వెబ్ సైట్లు, సర్వర్లు, బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులతో రవికి ఉన్న సంబంధాలు, ట్రాన్సాక్షన్లపై పోలీసులు విచారణ చేశారు. రెండోరోజు ఎస్బీఐ టర్మ్ ఇన్సూరెన్స్‌లో ప్రత్యక్షమైన సినిమాలు, బ్యాంకు లావాదేవీలపై ప్రశ్నించారు. మూడోరోజు రవి వాడిన ఐపీ అడ్రస్‌ల గురించి సిపి సజ్జనార్ విచారించారి. ఎథికల్ హ్యాకర్లను పిలిపించి సర్వర్లు, ఇతర అంశాలపై సైబర్ క్రైమ్ పోలీసులు ఆరా తీశారు. నాలుగవ రోజు బ్యాంక్ అకౌంట్ల ట్రాన్సాక్షన్లు, విదేశాల్లో ఉన్న నెట్‌వర్క్‌లు, బెట్టింగ్ యాడ్స్ నుంచి వచ్చిన సొమ్మును వాడిన తీరుపై ప్రశ్నించారు. అలాగే ఈఆర్ ఇన్ఫోటెక్ కంపెనీ పేరుతో ఉన్న డొమైన్ల కొనుగోలుపై కూడా రవిని ప్రశ్నించారు. కాగా.. విచారణలో రవి తమకు పూర్తిగా సహకరించలేదని పోలీసులు చెప్తున్నారు. నాల్గవ రోజు విచారణలో గుర్తులేదు, మర్చిపోయానని సమాధానాలివ్వడంతో ఖంగుతిన్నామన్నారు. పోలీసుల వాదనను రవి తరపు అడ్వొకేట్ శ్రీనాథ్ తెలిపారు. విచారణకు రవి సహకరించలేదన్నది అవాస్తవమని పేర్కొన్నారు. రవిపై మొత్తం 5 కేసులు నమోదవ్వగా.. ఒక కేసులోనే రిమాండ్ విధించారని తెలిపారు. ఒక్కేకేసులో పీటీ వారెంట్ సపరేట్‌గా వేస్తుండటంతో కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు సూచించిందన్నారు. 27న రవిని కోర్టులో హాజరు పరచాలని నాంపల్లి కోర్టు ఆదేశించినట్లు తెలిపారు.

## సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమస్యలపై ఉద్యమించాలి

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు




**ప్రజాపక్షం/హనుమకొండ :** సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలపై ఉద్యమించాలని ఎఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రథమ మహాసభ సోమవారం కుక్కల మల్లయ్య అధ్యక్షతన హనుమకొండలోని గిరిజన సంక్షేమ కమిటీ హాల్ (అంబేద్కర్ భవన్ ఎదురుగా)లో జరిగింది. ఈ మహాసభకు మూడు జిల్లాల నుంచి సుమారుగా 300మందికి పైగా హమాలీ కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండ బస్సు డిపో దగ్గర నుండి గిరిజన సంక్షేమ కమిటీ హాల్ వరకు కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీ కార్మికుల డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్త ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. "మన భుజాల మీదనే రాష్ట్రంలో 4 కోట్ల మంది ప్రజల ఉచిత బియ్యం పథకం నడుస్తోందని, కానీ మన ఛార్జీలు 7 ఏళ్లుగా పెంచలేదని, మన ప్రాణాలకు రక్షణ లేదన్నారు. ఈ సందర్భంగా మహాసభలో ప్రధానంగా పలు నిర్ణయాలు, డిమాండ్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. డిసెంబరు 15, 2025 లోపు పై డిమాండ్లు నెరవేర్చకపోతే 2026 జనవరి 1 నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయ్ గోడౌన్ల నుంచి ఒక్క బియ్యం బస్తా కూడా బయటకు రానివ్వమని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ మహాసభలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మన్, కొట్టేపాక రవి, నాయకులు మస్కుల భరత్, సుమలత, హమాలి నాయకులు మచ్చ శంకర్, పరకాల బొచ్చు నరేష్, ములుగు సరిగమల సురేష్, గాడిచర్ల బాబు, కానీనేని రాములు, పోడం రమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్యలు

పెట్రోల్ పోసి నిప్పంటించి దారుణంగా హత్య



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** కట్టుకున్న భర్తను అమానుషంగా పెట్రోల్ పోసి నిప్పంటించి చంపిన ఘటన భీమ్‌గల్ మండలం దేవక్కపేట్‌లో చోటు చేసుకుంది. ఈ సంఘటనతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది దీంతో గ్రామస్తులు మానవత్వం మంట గలుస్తోంది. మానవ సంబంధాలు దెబ్బ తింటున్నాయి. క్షణికావేశం మనుషుల్ని రాక్షసులుగా మారుస్తోంది. కట్టుకున్న భర్తను ఇద్దరు భార్యలు పెట్రోల్ పోసి నిప్పంటించి చంపటం అమానుషం. ఈ సంఘటనలో భర్త అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఎస్సై సందీప్, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవక్కపేట్ గ్రామానికి చెందిన మాలవత్ మోహన్ (39)కు ఇద్దరు భార్యలు, ఐదుగురు కుమార్తెలు, మృతుడు మొదటి భార్య సంగీతది మానాల, రెండవ భార్య కవితది తాళ్లపల్లి గ్రామం. మొదటి భార్యకు ముగ్గురు, రెండో భార్యకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా మృతుడు ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటునే వివాహ శుభకార్యాలకు బ్యాండ్ కొట్టేందుకు తాత్కాలికంగా వెళతాడు. మృతుడికి ఇద్దరు భార్యలకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో సోమవారం సైతం భర్త, ఇరువురు భార్యలతో గొడవ జరిగినట్లు సమాచారం. గొడవలో ఆవేశానికి గురైన ఇద్దరు భార్యలు కుర్చీలో కూర్చొని ఉన్న భర్త మోహన్‌పై డీజిల్ పోసి నిప్పంటించారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించి మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గ్రామంలో వ్యాపించటంతో ఒక్కసారిగా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మృతుని సోదరులు రవి ఫిర్యాదు మేరకు సిఐ సత్యనారాయణగౌడ్, ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భర్తను దారుణంగా హత్య చేసిన భార్యలిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తండ్రి హత్యకు గురికావటం తల్లులు ఇద్దరు జైలుకు వెళ్లటంతో ఐదుగురు ఆడపిల్లలు అనాథలుగా మారారు. ఈ సంఘటన మండలంలో తీవ్ర కలకలం రేపింది.

## ప్రజా ప్రభుత్వంలో పెరిగిన దేవాలయాల ఆదాయం

రాష్ట్రం ఆలయాల అభివృద్ధికి వేగంగా అడుగులు

భక్తులకు సౌకర్యాలు కల్పించడం మా బాధ్యత: మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల ఆదాయం గతం కంటే ఘననీయంగా పెరిగింది. గత ప్రభుత్వంలో పదేండ్లు కెసిఆర్ కేవలం ఒక దేవాలయం మినహా మిగతావి అన్నీ నిర్లక్ష్యానికి గురి చేయగా... ప్రజా ప్రభుత్వంలో మాత్రం అన్ని దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి టెంపుల్‌ను అభివృద్ధి చేసేందుకు సర్కారు కృషి చేస్తున్నది. అందుకే, ఆదాయం పెద్ద ఎత్తున పెరిగింది. 2023 సంవత్సరం చివరి అంకంలో రాష్ట్రంలోని ఉన్న 699 దేవాలయ సంస్థలను నుంచి రూ.373.55 కోట్లు ఆదాయం వస్తే... ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాల ద్వారా 2024లో రూ.544.61 కోట్లు వచ్చినట్టు దేవాదాయ శాఖ గణాంకాలే చెబుతున్నాయి. కార్తీక మాసంలో... యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయానికి ప్రజా ప్రభుత్వంలో భారీ ఆదాయం వచ్చింది. ఈ సమయంలోనే స్వామివారిని దర్శించుకున్న మొత్తంగా 20 లక్షల 52 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రజా ప్రభుత్వం భక్తులకు వసతులు కల్పించడం పెరగడంతో... భక్తుల సంఖ్య పెరిగిందని ఎండోమెంటు ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. టెంపుల్‌కు ఆదాయం రూ.17 కోట్ల 62 లక్షల 33 వేల 331 వచ్చాయి. అయితే, గతేడాది ఆదాయం రూ.14 కోట్ల 30 లక్షల 69 వేల 481 వచ్చిన పరిస్థితి ఉంది. మొత్తంగా పరిశీలిస్తే... గతేడాది కంటే రూ.3 కోట్ల 31 లక్షల 63 వేల 850 ఆదాయం స్వామివారి దేవాలయానికి అధికంగా వచ్చింది. అయితే, ఈ ఆదాయం టెంపుల్ అభివృద్ధికే ఉపయోగించునున్నామని దేవాదాయశాఖ స్పష్టం చేస్తుంది.

**ప్రధాన దేవాలయాల అభివృద్ధిలో పరుగులు**

వీటితో పాటు రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధిపై ఎండోమెంటు శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలోని దేవాదాయ శాఖ పెట్టింది. అందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ రూపొందించి వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా... రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల్లో సుమారు రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రెడీ అయింది. ముఖ్యంగా చెరువుగట్టు, కొండగట్టు, భద్రాచలం, వేములవాడ ఆలయాలకు భారీగా నిధులు కేటాయించింది. యాదగిరి గుట్టలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ విమాన గోపురానికి 60 కిలోల బంగారు తాపడం పనులు జరుగుతున్నాయి. ఇందులో దేవస్థానం వద్ద నిల్వ ఉన్న 25 కిలోల బంగారంతోపాటు విరాళంగా వచ్చిన 35 కిలోల బంగారాన్ని వినియోగిస్తున్నారు. గోల్డ్ ప్లేటింగ్ తయారీ, ఫిక్సింగ్ చార్జీలకు కలిపి మొత్తం రూ.8 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నది. రానున్న బ్రహ్మోత్సవాల నాటికి ఈ పనులు పూర్తికానున్నాయి. ఇంకా 17 ఎకరాల్లో రూ.43.79 కోట్లతో వేదపాఠశాల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. దీంతోపాటు వసతి గృహాన్ని ఏర్పాటు చేయడానికి 101 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భక్తుల వసతి కోసం కొండపై డార్మెటరీ హాల్ ఏర్పాటు చేశారు. వైటీడీఏకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించడంతోపాటు పరిపాలనలో పారదర్శకతకు పట్టం కట్టారు. వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.76 కోట్లు మంజూరు చేసింది. దీనిలో అన్నదానం సెంటర్ నిర్మాణానికి రూ.35.25 కోట్లు కేటాయించింది. శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధి, గుడి చెరువు సుందరీకరణకు మరో రూ.20 కోట్లు మంజూరు చేసింది.

## ప్రయోగశాలలతో విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య



ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/నిర్మల్ :** విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందుతుందని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని బాలికల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో రూ.13.50 లక్షల వ్యయంతో నెలకొల్పిన విజ్ఞానశాస్త్ర ప్రయోగశాలను మంత్రి జూపల్లి, అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి ప్రారంభించారు. విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించిన మంత్రి, ల్యాబ్‌లోని పరికారాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు పెంపుదల కొరకు ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా విద్యార్థుల పరిజ్ఞానం పెంపొందడమే కాకుండా, వారిలో విజ్ఞాన శాస్త్రంపై జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్న కుతూహలం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ల్యాబ్‌లో పొందుపరిచిన పరికరాల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యను విద్యార్థులకు అందించేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతుందని అన్నారు.

**విద్యార్థులకు పరిజ్ఞానం అందించేందుకే విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలు : కలెక్టర్ అభిలాష అభినవ్..**

విద్యార్థులకు సైన్సుపట్ల పరిజ్ఞానం పెంపొందేలా విద్యాబోధన అందాల అన్న ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలను నెలకొల్పుతున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో కొత్త విషయాలు నేర్చుకోవాలన్న తపన అలవరుతోందని వివరించారు. అంతకు ముందు 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పాఠశాలకు సంబంధించి పలు మౌలిక వసతుల కల్పన, మరమ్మత్తులకు సంబంధించిన పనులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే కలెక్టర్, తదితరులు భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మంత్రికి అధికారులు విద్యార్థులు పుష్పగుచ్చాలను ఇచ్చి, ఎన్‌సిసి విద్యార్థులు బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి, డీఈవో భోజన్న, జెడ్పీ సీఈవో గోవింద్, ఎంపీడీవో సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనతో భవిష్యత్తు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్పొరేటర్లకు రానున్న కాలంలో మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి పలు అంశాల నేపథ్యంలో మంచి భవిష్యత్తు ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపైన రాహుల్‌గాంధీకి చిత్తశుద్ది ఉంటే లోక్‌సభలో రిజర్వేషన్ల అంశాన్ని పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్‌కు చెందిన జిహెచ్‌ఎంసి కార్పొరేటర్లతో కెటిఆర్ సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, వివేకానంద, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిహెచ్‌ఎంసి కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై కార్పొరేటర్లకు కెటిఆర్ దిశానిర్దేశం చేశారు. అనంతరం బిసి ప్రజా ప్రతినిధులు, మాజీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులతో కెటిఆర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతినిధ్యం వహిస్తున్న బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు రిజర్వేషన్ల అంశంపైన లోక్‌సభలో గళం లేవనెత్తాలన్నారు. బిసి రిజర్వేషన్ల అంశంతో పాటు బిసిలకు కాంగ్రెస్ ద్రోహం చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ బిసిలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామన్నారు. బిసి డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బిసిలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆరోపించారు. పార్టీ వెంట ఉన్న వారికి భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని హామీ నిచ్చారు.

## కోకాపేట నియోపోలీస్‌లో ఎకరం ధర రూ.137.25 కోట్లు

సరికొత్త రికార్డు సృష్టించిన హెచ్ఎండిఎ

ప్లాట్ 17 (4.59 ఎకరాలు) ఎకరాకు రూ.136.50 కోట్లు

ప్లాట్ 18 (5.31 ఎకరాలు) ఎకరాకు రూ.137.25 కోట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోకాపేటలోని నియోపోలిస్ తొలి విడత ఈఆక్షన్‌లు రికార్డు స్థాయి ధరలను నమోదు చేశాయి. కోకాపేట నియో పోలీస్ లేఔట్‌లో ఎకరం ధర రూ.137.25 కోట్లు పలికి సరికొత్త రికార్డు సృష్టించింది. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ మార్కెట్‌లలో హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని ఈ ఫలితాలు స్పష్టం చేశాయని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండిఏ) సోమవారం రంగారెడ్డి జిల్లా కోకాపేటలోని నియో పోలీస్ లేఔట్‌లో, మేడ్చల్ జిల్లా మూసాపేట వై జంక్షన్ దగ్గర ఉన్న భూములను వేలం వేసింది. ఈ వేలంలో ప్లాట్లు రికార్డు స్థాయిలో అమ్ముడుపోవడం విశేషం. ప్లాట్ నెంబర్ 17,18లకు అధికారులు ఈ వేలం నిర్వహించారు. ప్లాట్ నెంబర్17లో 4.59 ఎకరాలు ఉండగా, ఈ వేలంలో ఎకరానికి రూ.136.50 కోట్ల ధర పలికింది. ప్లాట్ నెంబర్ 18లో 5.31 ఎకరాలు ఉండగా, ఈ వేలంలో ఎకరానికి రూ.137.25 కోట్ల ధర పలికి రికార్డు సృష్టించింది. సోమవారం నిర్వహించిన వేలంలో 9.90 ఎకరాలకు రూ.1,355.33 కోట్ల ఆదాయం హెచ్ఎండిఏకు సమకురింది. కోకాపేటలో మిగిలిన భూములను ఈనెల 28వ తేదీన హెచ్ఎండిఏ అధికారులు వేలం వేయనున్నారు. కోకాపేట నియోపోలీస్‌లో ఒక్కో ఎకరానికి 99 కోట్ల ప్రారంభ ధరను హెచ్ఎండిఏ నిర్ణయించింది. అయితే అంతకు మించే ఎకరం ధర పలికింది. కోకాపేట్ నియోపోలీస్ ప్లాట్లకు ఎకరానికి 99 కోట్లు, కోకాపేట గోల్డెన్ మైల్ ప్లాట్లకు 70 కోట్లు, మూసాపేట్ ప్లాట్లకు 75 కోట్ల చొప్పున ప్రారంభ ధరను హెచ్ఎండిఏ నిర్ణయించింది. ఇ బిడ్డింగ్ ప్రక్రియను హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పర్యవేక్షించారు. డిటిసిపి డైరక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డి, హెచ్ఎండిఏ ప్లానింగ్ డైరక్టర్లు ఎం.రాజేంద్ర ప్రసాద్ నాయక్, విద్యాధర్, జిహెచ్ఎంసి చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, సిపిఓ ఎ.రవీందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

**నియోపోలీస్ లేఔట్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు..**

నియోపోలీస్ లేఔట్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. ఈ ప్రాజెక్ట్ ఇటు ఓఆర్ఆర్‌కు అటు రాయదుర్గం ఐటి కంపెనీలకు సమీపంలో ఉండటంతో కోకాపేట భూములకు ప్రాధాన్యత పెరిగింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సమీపంలో ఉండడంతో నియోపోలిస్ లేఔట్‌లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో దేశ, విదేశీ దిగ్గజ రియల్ ఎస్టేట్ సంస్థలు పెద్ద ఎత్తున పోటీపడటంతో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కోకాపేటలోని నియోపోలిస్ లేఔట్‌లో ప్లాట్లను కొనుగోలు చేసే వారికి ఆకాశమే హద్దుగా ఎన్ని అంతస్తులైన నిర్మించుకునేందుకు అనుమతులు ఇస్తారు. ఈ లేఔట్‌లో సుమారు రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. 40 ఎకరాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారు. ఇందులో సైక్లింగ్‌ట్రాక్స్, 45 మీటర్ల విస్తీర్ణంలో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలను కల్పించారు. కమర్షియల్, రెసిడెన్సీ, ఎంటర్‌టైనమెంట్ అవసరాలకు భవనాలు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వనున్నారు.



**మొదటి నుంచి కొనసాగుతున్న ఊపు..**

నియోపోలిస్ భూముల ఇవేలం మొదటి సెట్ అత్యంత విజయవంతమైంది. భారతదేశంలోనే అత్యంత డైనమిక్, పటిష్టమైన రియల్ ఎస్టేట్ మార్కెట్‌లలో హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేశాయి. ఈనెల 3వ తేదీన ఇవేలం నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి ఈనెల 17న (ఆఫ్లైన్), 20న (ఆన్‌లైన్) జరిగిన ప్రీబిడ్ సమావేశాల ద్వారా వచ్చిన ఊపు, సోమవారం ఫలితాలలో స్పష్టంగా కనిపించింది. ఈ వేలంలో నియోపోలిస్ ఆకాశమే హద్దుగా రికార్డు ధరలు నమోదయ్యాయి.

**2023లో వేలంతో పోలీస్తే.. 87 శాతం పెరిగిన ధరలు..**

గతంలో 2023లో జరిగిన నియోపోలిస్ వేలంలో సగటు ధర ఎకరాకు సుమారు రూ.73 కోట్లు మాత్రమే. ప్రస్తుత వేలం ఫలితాలు ఆ ధరల కంటే 87 శాతం పెరుగుదలను సూచిస్తున్నాయి. ఇది పెట్టుబడిదారులు నియోపాలీస్‌పై ఎంత నమ్మకంగా ఉన్నారో, ఈ ప్రాంతం హైదరాబాద్‌లో అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతున్న తీరును స్పష్టంగా తెలియజేస్తుంది. ఎంఎస్‌టిసి పోర్టల్‌లో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు షెడ్యూల్ చేయబడిన ఈ వేలంపాటలో 10 మంది ప్రముఖ జాతీయ, స్థానిక డెవలపర్లు తీవ్రంగా పోటీపడగా, బిడ్డింగ్ ప్రక్రియ సాయంత్రం 4:00 గంటలు దాటినా కొనసాగింది. మొదట ఎంఎస్ఎన్ అర్బన్ వెంచర్స్ ఎల్ఎల్‌పి ప్లాట్ 18ను దక్కించుకోగా, ఆ తర్వాత కొద్దిసేపటికే వజ్ర హౌసింగ్ ప్రాజెక్ట్స్ ఎల్ఎల్‌పి ప్లాట్ 17 విజేతగా నిలిచింది. ఈ రెండు వేలంపాటల ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి మొత్తం రూ.1,356 కోట్ల ఆదాయం సమకూరింది.

హెచ్ఎండిఏ, ఎంఎస్‌టిసి సమన్వయ ప్రయత్నాలు, ఈవెంట్‌కు ముందు అందించిన సలహా సహకారాలతో ఈ వేలం ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. కష్మాన్, వేక్‌ఫీల్డ్ సంస్థ చేసిన సన్నాహక కృషి, మార్కెట్‌లో బలమైన విస్తరణకు, బిడ్డర్‌ల నుండి సమాచారంతో కూడిన భాగస్వామ్యానికి దోహదపడింది. ఆశించిన దానికంటే మెరుగైన ఆరంభంతో, రాబోయే ఈనెల 28, డిసెంబర్ 3 (నియోపోలిస్), డిసెంబర్ 05 (గోల్డెన్ మైల్) జరగబోయే ఇ వేలంపాటలకు రియల్ ఎస్టేట్, డెవలప్‌మెంట్ కమ్యూనిటీ నుండి మరింత పోటీ బిడ్డింగ్ లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ : వికారాబాద్ సర్కిల్
టెండర్ నోటీస్ నెం.11/25-26
అవసరమైన సామగ్రి కోసం అర్హత కలిగిన బిడ్డర్ల నుండి బిడ్లు ఆహ్వానించడమైనవి. 1) 47 నంబర్లు 33KV 800A AB స్విచ్ ఫిక్స్‌డ్ & మూవింగ్ కాంటాక్టులు. 2) 55 నంబర్లు 11 KV 400A కన్వర్షన్ రకం ఫిక్స్‌డ్ & మూవింగ్ కాంటాక్ట్, 53 నంబర్లు 11 KV 400A DB AB స్విచ్ ఫిక్స్‌డ్ & మూవింగ్ కాంటాక్ట్ & 55 నంబర్లు 11 KV 400A కన్వర్షన్ AB స్విచ్ ఫ్లెక్సిబుల్ జంపర్. 3) 190 నంబర్లు రబ్బరు హ్యాండ్ గ్లోవ్-పెయిర్, 170 నంబర్లు LV బ్రాస్ బుష్ రాడ్లు 180X12 mm (1/2''x7''), 150 నంబర్లు 2 హోల్ 4 బోల్టెడ్ ప్యాడ్ క్లాంప్ అగ్ని నిరోధక పాంథర్ Cd, 155 నంబర్లు 2 హోల్ 4 బోల్టెడ్ ప్యాడ్ క్లాంప్ అగ్ని నిరోధక డాగ్ Cd, 145 నంబర్లు టెయిల్ క్లాంప్ అగ్ని నిరోధక పాంథర్ Cd, డాగ్ Cd నుండి 140 నంబర్లు టెయిల్ క్లాంప్, & 95 నంబర్లు T-క్లాంప్ డాగ్-డాగ్ Cd-8 బోల్టెడ్.
మరిన్ని వివరాల కోసం, దయచేసి www.tgsouthernpower.com ని సందర్శించండి, పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో ఉంచబడిన మెటీరియల్ స్పెసిఫికేషన్ వివరాలు. ఫోన్ నంబర్: 8712469736 లేదా 8712469716. ఇమెయిల్ - sevkbtgspdcl@gmail.com.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, TGSPDCL, వికారాబాద్ సర్కిల్.
DIPR R.O. No. : 11178-PP/CL/ADVT/1/2025-26, Date: 22-11-2025

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
**NIT No.** 46, **పని పేరు:** జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11 లో 3 పనులకు బిటి రోడ్డును బలోపేతం చేయడం మరియు రీకార్పెట్ చేయడం మరియు సిసి రోడ్డు వేయడం. **అంచనా మొత్తం / ఇసివి:** రూ. 118.30 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం:** 24.11.2025న మ.2.30గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 01.12.2025న మ.2.45గం.ల వరకు, **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 11274-PP/CL/ADVT/1/2025-26, Date: 24-11-2025

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్.
కొటేషన్ల ఆహ్వాన ప్రకటన
NIQ No. 08/EE/CIRCLE-17/KZ/GHMC/2025-26 తేది: 24.11.2025
**NIQ No.** 08, **పని పేరు:** ఎ) ఇన్వర్టర్ ఖర్చు, వెయిట్ బ్లాక్ GBP టెన్షన్ డివైజ్, ఫ్లాట్ కేబుల్ FFC 10పిన్, లోడ్ కొలిచే సెన్సార్ మొదలైన వాటితో సహా లిఫ్ట్‌లకు మరమ్మతులు మరియు పునరుద్ధరణ సేవలను అందించడం, ఇందులో సరుకు / రవాణా మరియు ఇతర ఇతర వస్తువులు మొదలైనవి ఉన్నాయి. బి) ఇన్వర్టర్ ఖర్చు, వెయిట్ బ్లాక్ GBP టెన్షన్ డివైజ్, ఫ్లాట్ కేబుల్ FFC 10పిన్, సరుకు / రవాణా మరియు ఇతర ఇతర వస్తువులు సహా లోడ్ కొలిచే సెన్సార్‌తో సహా ఎస్కలేటర్లకు మరమ్మతులు మరియు పునరుద్ధరణ సేవలను అందించడం. **డౌన్‌లోడింగ్ ప్రారంభ / ఆఖరి తేది & సమయం:** 25.11.2025న ఉ.10.30గం.ల నుండి 28.11.2025న ఉ.10.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాల కోసం, దయచేసి క్రింద సంతకం చేసిన వారి కార్యాలయాన్ని సందర్శించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 11289-PP/CL/ADVT/1/2025-26, Date: 24-11-2025

దేవాదాయ-ధర్మాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వము
శ్రీ జోగులాంబా బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము
అలంపూరు పట్టణము, జోగులాంబ గద్వాల జిల్లా, తెలంగాణ. ఫోన్ నం. 08502-241327
సీల్డ్ టెండరు కం బహిరంగ వేలము కం ఆన్‌లైన్ టెండర్ల ప్రకటన
లేఖ నం.: 6/EO/SJBBSGD/2025 తేది: 23-11-2025
ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియచేయునది ఏమనగా ఇట్టి దేవస్థానమునకు సంబంధించి ఈ క్రింద తెలిపిన వివిధ టెండర్లు నిర్వహించబడును.

విభాగము-ఎ

| క్ర.సం. | టెండరు వివరములు | కాల పరిమితి | షెడ్యూలు ధర రూ. | డిపాజిట్ రూ. |
|---|---|---|---|---|
| 1 | శ్రీ అమ్మవారి చీరల సేకరణ చేసుకొను హక్కు | ఒక సంవత్సరము 01.12.2025 నుండి 30.11.2026 వరకు | 1,000-00 | 8,00,000-00 |
| 2 | టెంకాయలు, పూజా సామాగ్రి అమ్ముకోను హక్కు | | 1,000-00 | 15,00,000-00 |
| 3 | పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను హక్కు | | 1,000-00 | 15,00,000-00 |
| 4 | వసతి గదులు నిర్వహించుకొను హక్కు | | 1,000-00 | 4,00,000-00 |

విభాగము-బి

| క్ర.సం. | టెండరు వివరములు | కాల పరిమితి | షెడ్యూలు ధర రూ. | డిపాజిట్ రూ. |
|---|---|---|---|---|
| 1 | పూల మాలలు సరఫరా చేయుటకు & పూల అలంకరణలు చేయుటకు | 2 సంవత్సరములు 01.12.2025 నుండి 30.11.2027 వరకు | 1,000-00 | 10,000-00 |
| 2 | అరటి మట్టలు, మామిడాకులు సరఫరా చేయుట | | 1,000-00 | 10,000-00 |
| 3 | హోమమునకు అవసరమైన కట్టెలు (సమిధలు) సరఫరా చేయుటకు | | 1,000-00 | 10,000-00 |

ఆసక్తి గల వారు సీల్డ్-కం - బహిరంగ వేలము - కం-ఆన్‌లైన్ టెండరు పూర్తి వివరముల కొరకు www.tender.telangana.gov.in endowments.Marketing నందు తిలకించగలరు. ఈ సీల్డ్ టెండర్లలో పాల్గొనదలచిన వారు తేది:- 25.11.2025 నుండి 27.11.2025 నాడు సా. గం.5-00 లోపు షెడ్యూలు ధర రూ.1,000/- చెల్లించి షెడ్యూళ్ళు పొందగలరు.
**వేదిక : శ్రీ జోగులాంబా బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము, అలంపూరు గ్రా. & మం., జోగులాంబ గద్వాల జిల్లా.**
**టెండర్లు నిర్వహించు తేది: 28.11.2025 శుక్రవారము, సమయము: మ.11-00 లకు.**
ఈ టెండర్లలో పాల్గొను వారు హిందూ మతమును ఆచరించువారై వుండవలెను. అన్య మతస్తులు ఈ టెండర్లలో పాల్గొనుటకు అనర్హులు.
షరతులు మరియు ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయము నందు కానీ (లేదా) సెల్ నం. 9490518885 కానీ, 9441391022 ను కానీ సంప్రదించగలరు.
DIPR R.O. No. : 11249-PP/CL/ADVT/1/2025-26, Date: 24-11-2025 సం/- కార్యనిర్వహణాధికారి

## సర్పంచ్‌గా ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధికి రూ.20లక్షలు

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండల పరిధిలో ఉన్న గారకుంట తండ గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా ఎటువంటి రాజకీయ పార్టీలతో సం బంధం లేకుండా ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులు కేటాయిస్తానని హేమ్‌ఎస్ బ్రదర్స్ సభ్యులు గుగులోత్ సందీప్ నాయక్ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గ్రామం లో 450 మహిళా ఓటర్లు, 450 పురుష ఓటర్లు ఉన్నారన్నారు. గ్రామాభివృద్ధికి మనమందరం ఏకతాటిపై నిలబడి సహకరించాలని వారిని గ్రామంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయి స్తానన్నారు. గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయం, ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్, ప్రత్యేకమైన ఆట స్థలం, అంగన్వాడీ భవనం, సేవాలాల్ విగ్రహం, అంబేద్కర్ విగ్రహముతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి గ్రామాన్ని మండలంలోని అభివృద్ధి పథంలో నిలిపివేస్తానని వారు కోరారు. ఈ కార్యక్రమా నికి గ్రామములో ఉన్న గ్రామ ప్రజలు, గ్రామ ఓటర్లు, యువకులు, ఉత్సాహవంతులు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తా

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** కోదాడ నియోజక వర్గ అభివృద్ధికి సాయశక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు. సోమవారం కోదాడ మండలం కూచిపూడి గ్రామంలో టిజిఎస్‌పిడిసిఎల్ నిధుల కింద రూ.2.59 కోట్లతో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం గుడిబండ గ్రామంలో పిఏసిఎస్ కింద రూ.38.8లక్షలతో నిర్మించిన నూతన గోడౌన్ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ సూర్యనారాయణ, తహశీల్దార్ వాజిద్‌అలీ, ఏడిఇ వెంకన్న, ఏఇ సైదా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీ నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమాటి వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.





## మహిళలు ఆర్థికాభివృద్ధి లక్ష్యం

భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలతో పాటు వడ్డీ లేని రుణాలను అందించి ప్రోత్సహించి మహిళలను కోటీశ్వరులుగా మార్చే దిశగా చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలోని శుభం గార్డెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మహిళలు 14 వేలకు పైగా ఉంటే స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా, 8135 మంది ఉన్నారని 11 వేలు తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నారని, మిగిలిన వారు కూడా సంఘాలలో సభ్యత్వం పొందాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కాగా జలాల్పురంలో ఇందిరమ్మ ఇల్లు పూర్తి అయిన లబ్ధిదారుని గృహప్రవేశానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణా రెడ్డి, ఎండిఓ భాస్కర్ తహసీల్దారు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఏపిఎం తౌట నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు క్లైం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధా న్యతనిచ్చి సమస్యలు పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలె క్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి 58 ఆర్జీలను స్వీకరిం చారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించా లన్నారు. అందులో రెవిన్యూ శాఖ 41, గ్రామీణాభివృద్ధి శాఖ 4, జిల్లా సంక్షేమ శాఖ 2, మున్సిపాలిటీ 2, ఆర్ అండ్ బి, ఎక్సైజ్, ఇరిగేషన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా పంచాయతీ, సివిల్ సప్లై, ఆర్టీసీ, ఎంప్లాయిమెంట్ టీం, విద్య శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరి ష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, హౌసింగ్ పీడీ విజయ సింగ్ పాల్గొన్నారు.

### భవన నిర్మాణ కార్మికుల బీమా పెంపు

భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంబంధించిన బీమా పెంచడం జరిగిం దని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ బీమా పెంపు సంబంధిత గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లేబర్ డిపార్ట్మెంట్ అరుణ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారి మొయిజుద్దీన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 29న దీక్షా దివస్

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఈనెల 29న నిర్వహించనున్న దీక్ష దివాస్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో అన్న నినాదమే తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరిపో సిందన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్రం మెడలు వంచిందని ఆ దీక్షతోనే తెలంగాణ సమాజం అంతా ఉవ్వెత్తున లేచి అన్ని రంగాలు ఐక్యతతో కలిసి వచ్చిన రోజని నవంబర్ 29 అన్నారు. దానిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి సూర్యాపేటలో జరుగు దీక్షదివాస్‌కు హాజరయ్యేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆరాచక పాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. కోకాపేటలో ఎకరం రూ. 100 నుండి 170 కోట్లు వేలంలో విక్రయించినట్లు చెబుతున్న ప్రభుత్వం అదే ప్రాంతంలో అతి తక్కువ ధరకు విక్రయించడంలో అర్థమేమిటో ప్రజలకు అర్థమవుతుందన్నారు. భూ కుంభకోణంలో సహకరించిన వాళ్లంతా జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో కూడా చాలా గోల్‌మాల్ జరుగుతుందని ఆరోపించారు. ఐకెపి సెంటర్లలో సరిగ్గా ధాన్యం కొనడం లేదని, మ్యాచ్చర్ వస్తలేదని రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, ఒంటెద్దు నర్సింహారావు, గుజ్జ యుగంధర్‌రావులు పాల్గొన్నారు.

## 30 వరకు ఆసరా పింఛన్లు పంపిణీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో వివిధ రకముల చేయూత ఆసరా పింఛన్లు (అనగా వృద్ధాప్య,వితంతు,వికలాంగుల,చేనేత,కల్లుగీత,ఒంటరి మహిళ పింఛన్లు) పొందు పింఛనుదార్లకు ఈనెల 24 నుండి 30వరకు బట్వాడా చేయబడునని డిఆర్‌డిఓ యర్రబెల్లి శేఖర్ రెడ్డి తెలిపారు. పింఛను దారులు సంబంధిత పోస్టల్ ఆఫీసు నేరుగా వెళ్లి పింఛన్లు పొందలన్నారు. ప్రభుత్వము వారు ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు సాఫ్ట్ వేర్ ద్వారా పింఛను మొత్తం పొందవలెను. పింఛను పొందుటకు మధ్య దళారీలను నమ్మ వద్దు,ఎటువంటి సొమ్ము చెల్లించ వలసిన అవసరము లేదన్నారు. పింఛను మొత్తం సొమ్ము రూ.16తో సహా అడిగి తీసుకోవాలని తెలియజేశారు.

# సూర్యాపేట పోరాటాల ఖిల్లా...

బిజెపి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

ప్రజావ్యతిరేక విధానాలపై పెద్దఎత్తున ఉద్యమిస్తాం : సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట ప్రాంతం అంటేనే పోరాటాల ఖిల్లా అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. డిసెంబర్ 27న ఖమ్మంలో జరుగు సిపిఐ 100 సంవత్సరాల ఆవిర్భావ వేడుక బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న బస్సుజాత సోమవారం పట్ట ణంకు చేరుకుంది. సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన జిల్లా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజానాట్య మండలి కళాకారులు ఆటపాటలతో, మహిళలు బోనా లతో ఘనంగా స్వాగతం పలికారు. ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల వద్ద గల కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం విగ్ర హానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేసు కున్నారు. అనంతరం సూర్యాపేట పట్టణములోని బైక్ ర్యాలీ నిర్వహిస్తూ పిఎస్‌ఆర్ సెంటర్, వాణిజ్యభవన్, సూర్యాపేట కొత్తబస్టాండ్ మీదుగా ఖమ్మం చౌరస్తా వరకు ప్రచార జాతా సాగింది. ఈ సందర్భంగా వాణిజ్య భవన్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆమె మాట్లా డుతూ బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి ఏ బండ్లోవోస్తావో కొడకో నైజాం సర్కరోడా అంటూ తెలం గాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఊపిరులు ఊదిన బండి యాదగిరి అన్నను ఈ సందర్భంగా స్మరించుకోవ లసిన అవసరం ఉందన్నారు. ఆయనతోపాటు కామ్రేడ్ ధర్మభిక్షం, భీంరెడ్డి నర్సింహారెడ్డి లాంటి ఎంతో మంది మహానాయకులు పోరుచేసిన నేల అన్నారు. దానికి ప్రతి సంవత్సరం సంతాప సభలు జరుపుతూ గుర్తు చేసుకుం టున్నామని తెలిపారు. అందులో భాగంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ 100 సంవత్సరాల ఆవి ర్భావ వేడుక బహిరంగ సభలో మహానాయకులను గుర్తు చేసుకోవడంతోపాటు పార్టీ సాధించిన విజయాలను, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోనున్నట్లు తెలి పారు. మోదీ అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎ త్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ 100 సంవత్సరాల వేడుక బహి రంగ సభకు కార్యకర్తలు, కర్షకులు, రైతులు అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లిఉల్లాఖాద్రి, రైతు సంఘం రాష్ట్ర కోశాధి కారి డిజి నరేంద్రప్రసాద్, పిఎస్‌ఎం ఉపాధ్యక్షులు ఉప్ప లయ్య, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దూళిపాల ధనుంజయ నాయుడు, కొప్పు సూర్యనారాయణ, ఉస్తెల సృజన, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, ఖమ్మం పాటి రాము, చిలకరాజు శ్రీను, మహిళా నాయకురాలు అనంతుల మల్లేశ్వరి, దేవర మల్లేశ్వరి, ఉప్పునూతల కోటమ్మ, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, దీకొండ శ్రీనివాస్, రేగటి లింగయ్య, పెంద్ర కృష్ణ, ఏడెల్లి శ్రీకాంత్, బూర సైదులు, కప్పల రాము, వాడపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



### బహిరంగ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/చివ్వెంల :** భారత కమ్యూనిస్టు పార్టీ 100 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ కోరారు. పార్టీ 100 సంవత్సరాల ముగింపు సంద ర్భంగా చేపట్టిన జాతా సోమవారం బీబీగూడెం నుండి చివ్వెంల మండల కేంద్రం వరకు 100 మోటర్ బైక్ ర్యాలీతో రాగా ప్రజానాట్యమండలి కళాకారుల ఆటపా టలతో, మహిళలు కార్యకర్తలు, హారతులు, బతుకమ్మ లతో బస్సుయాత్రకు స్వాగతం పలికారు. అఖిల భారత యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు వల్లిఉల్లాఖాద్రి సిపిఐ పథకాన్ని ఆవిష్కరించారు. చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము అధ్యక్షతన నిర్వహించిన సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నంద్యాల సోమిరెడ్డి, వేముల చిన్న తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్ర మంలో సూర్యాపేట సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి దూళిపాల ధనుంజయ నాయుడు, మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉత్సల సృజన, జిల్లా అధ్యక్షు రాలు దేవరం మల్లేశ్వరి, కోటమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, ఎఐటియుసి నాయకులు దంతాల రాంబాబు, శ్యామల అశోక్, రాజారామ్, రేగటి లింగయ్య, పొదిల వెంకటమ్మ, ఖమ్మంపాటి నాగమణి, చివ్వెంల గ్రామ కార్యదర్శి సంపంగి సతీష్, వెంకటేష్, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.










# వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలి

కాంట్రాక్టరు పనులు చేపట్టకపోతే క్రిమినల్ చర్యలు

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టరు పనులు చేపట్ట కపోతే అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం సోమ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనకబండ చౌరస్తా నుండి మోత్కూరు మున్సిపాలిటీ పరిధి రాజన్నగూడెం వరకు మూడున్నర కిలోమీటర్ల రోడ్డు వేయుటకు గత ప్రభుత్వం రూ.ఐదు కోట్ల 80 లక్షల నిధులు మంజూరు చేసిందని, అట్టి రోడ్డు 2024లో ప్రారంభించ బడి నేటికీ పూర్తికాలేదని విమర్శించారు. కాంట్రాక్టర్ సుమారు కిలోమీటర్ మేర వదిలేసినట్టు తెలుస్తుందని, సగం పనులు చేసి వదిలి వేయటం వలన గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగి ప్రయాణికులు మరణిస్తున్నారని తెలి పారు. అనేకమందికి గాయాలపాలై ఆసుపత్రిలో చేరారని అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. కాంట్రాక్టు తీసుకున్న కాంట్రా క్టరు పనులు చేపట్టకపోతే అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, వేరే కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించాలని కోరారు. ప్రజలకు అసౌక ర్యంగా మారిన రోడ్డును సంవత్సరాల తరబడి పూర్తి చేయకపోవడం విచార కరం అన్నారు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ వహించి రోడ్డు పనులు పూర్తి చేయించి రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. లేనిఎడల ప్రత్యక్ష ఉద్యమాలకు పాటు పడవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ సమా వేశంలో మోత్కూరు మండల పార్టీ సెక్రెటరీ అనేపు వెంకట్, మండల పార్టీ సహాయ కార్యదర్శి పులకరం మల్లేష్, మోత్కూరు పట్టణ సెక్రెటరీ బోయిన ఉప్పలయ్య, గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, గీతా పనివారల సంఘం మండల అధ్యక్షుడు బత్తిని శ్రీను, ప్రజానాట్యమం డలి మండల అధ్యక్షుడు గొలుసుల యాదగిరి, సీనియర్ నాయకులు తాడూరు లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.






## అర్హులకు సిఎం సహాయనిధి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/చండూరు:** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. ఇటీవల కాలంలో చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన ఎర్రజెల్ల ధనలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని సీఎం రిలీఫ్ ఫండ్ కు ధరఖాస్తుచేసుకోగా మంజూరైన 60వేల రూపాయల చెక్కును సోమవారం బాధితురాలకు ఎంఎ లేసి సత్యం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి సత్యం మాట్లాడుతూ పేదరికంలో ఉండి ,ఆర్థికంగా బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేసుకున్న ప్రతి ఒక్కరు సీఎం రిలీఫ్ పథకాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు గంట రమేష్ ,ఇరిగి సంజీవ, ఏఐ వైఎఫ్ నాయకుడు గడ్డం నవీన్ పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా స్థానిక సంస్థల ఎన్నికలు



నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** స్థానిక సంస్థల ఎన్నికలను మండల ప్రత్యేక అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని పర్యవేక్షించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమ వారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో ( 70)మంది నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ప్రజా ఫిర్యా దుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై జిల్లా కలె క్టర్ సమీక్షిస్తూ జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమా నికి నిర్దేశించిన సమయంలోగా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశిం చారు. ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలను తాను ర్యాండంగా తనిఖీ చేస్తానన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులకు మినహా యింపు ఉండదని, ఒకవేళ అత్యవసరమైతే ముందుగానే అనుమతి తీసుకో వాలని చెప్పారు.మండలాల ప్రత్యేక అధికారులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేకంగా తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్య వేక్షణ చేయాలని, అవసరమైతే ఎంపీడీవో కార్యాలయంలో కూర్చొని ఎన్ని కలు సవ్యంగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వ హణలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు.కాగా ఈ సోమవారం మొత్తం (70) ఫిర్యాదులు రాగా,జిల్లా అధికారులకు (39) రెవెన్యూ శాఖకి(31)వ చ్చాయి.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్,గృహ నిర్మాణ శాఖ పిడి రాజకు మార్, ఆర్‌డిఓలు వై.అశోక్ రెడ్డి,రమణారెడ్డి,శ్రీదేవి,జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్మి కుల బీమా పెంపుపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు.జిల్లా కార్మిక శాఖ అధికారి ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజా సమస్యలను తక్షణ పరిష్కరించే విధంగా కృషి చేయడమే లక్ష్యంగా పోలీస్ గ్రీవెన్స్ డేని నిర్వ హించడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు.ప్రజల సౌక ర్యార్థం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 33 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమ స్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై వేగంగా స్పందించి పోలీసు సేవలు అందజేయాలని అధికారులకు ఎస్‌పి సూచించారు. ప్రతి ఫిర్యాదుదారునికి భరోసా నమ్మకం కలిగించాలని,ప్రజల యొక్క ఫిర్యాదులను స్వీకరించడానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక విభాగం పని చేస్తున్నదని,ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ

అదనపు కలెక్టర్ సీతారామారావు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రజావాణి ఫిర్యాదు లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మంది రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో చాలా రోజులుగా ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించుటకు సమయం కేటాయించాలని లేకపోతే చర్యలు తీసుకుంటా మని ఆదేశించారు. వారం రోజుల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రజావాణి ఫిర్యాదు స్టేటస్‌పై సమీక్ష నిర్వహిస్తామన్నారు.

**కార్మికుల భీమా పెంపు పోస్టర్ ఆవిష్కరణ...** భవన, ఇతర నిర్మాణ రంగా లకు చెందిన (అవ్యవస్థీకృత రంగం) కార్మికులు సంక్షేమం కొరకు ప్రమాద వశాత్తు ఏమైనా జరిగితే ప్రభుత్వం లేబర్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశ పెట్టిం దని అట్టి పథకాన్ని జిల్లాలోని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని అద నపు కలెక్టర్ కోరారు. భవన నిర్మాణ కార్మికులు చాలా ఎత్తులో పనిచేస్తారని ప్రమాదవశాత్తు అనుకోని సంఘటన జరిగి మరణిస్తే రూ.10లక్షలు, శాశ్వత అంగవైకల్యం రూ.6లక్షలు, పాక్షిక అంగవైకల్యం రూ.4లక్షలు, సహజ మర ణానికి రూ.2లక్షలు ప్రభుత్వం కార్మిక భీమా పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. అవ్యవస్థీకృత రంగానికి చెందిన కార్మికులు అందరూ లేబర్ ఇన్సూరెన్స్‌లో రిజిస్ట్రి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో 1,35,885 మంది కార్మికులు భీమాలో రిజిస్ట్రి అయి ఉన్నారని తెలిపారు. అనంతరం కార్మిక భీమా పెంపు పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో మొత్తం 66 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరిం చేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని తెలిపారు. ఆర్‌డిఓ వేణు మాధవ్, డిఆర్‌డిఓ వివి అప్పారావు, హౌజింగ్ పిడి సిద్ధార్థ, అసిస్టెంట్ లేబర్ కమీషనర్ అరుణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిడబ్ల్యు నరసింహారావు, వెల్ఫేర్ అధికా రులు శంకర్, దయానందరాణి, నరసింహారావు, శ్రీనివాస్ నాయక్, డిఈఓ అశోక్, డిఐఈఓ భాను నాయక్, డిఎంహెచ్ఓ వెంకటరమణ పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నేడు అయోధ్యలో ప్రధాని చేతుల మీదుగా ద్వజారోహణ

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా నేడు (మంగళవారం) అయోధ్యలోని రామమందిరంలో ద్వజారోహణ కార్యక్రమం జరగనుంది. ఆలయ శిఖరంపై 22 అడుగుల కాషాయ జెండాను ఎగురవేయడం ద్వారా ద్వజారోహణ పూర్తవుతుంది. ఆలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ద్వజారోహణ కోసం ఆలయంలో ఏర్పాట్లన్నీ ముమ్మరంగా సాగుతున్నాయి. శ్రీసీతారాముల కళ్యాణం జరిగిన మార్గశిర మాసం శుక్లపంచమి రోజున అభిజిత్ ముహూర్తముననే ఈ ద్వజారోహణ కార్యక్రమం జరుగుతుండటం విశేషం. అంతేకాదు 17వ శతాబ్దంలో అయోధ్యలో నిర్విరామంగా 48 గంటలపాటు ధ్యానం చేసిన సిక్కుల ఆరో గురువు తేజ్ బహదూర్ అమరత్వం పొందిన రోజు కూడా ద్వజారోహణ రోజు ఎగురవేసే కాషాయ జెండా గౌరవానికి, ఐక్యతకు, సంస్కృతి, సంప్రదాయాలకు కొనసాగింపునకు, రామరాజ్య పాలనా వైభవానికి నిదర్శనాన.

## దేశవ్యాప్తంగా రేపు సంవిధాన్ దివస్

### పంచాయతీల్లో రాజ్యాంగ పీఠిక పఠనం




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 2.63 లక్షల పంచాయతీలు బుధవారం సంవిధాన్ దివస్ (రాజ్యాంగ దినోత్సవం)పాటిస్తాయి. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉన్న స్థానిక భాషలలో సామూహికంగా రాజ్యాంగ పీఠికను పఠిస్తారు. రాజ్యాంగ విలువలపై చర్చలు,సెమినార్లు, క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. అదేవిధంగా న్యూఢిల్లీలోని పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ కార్యాలయంలో కూడా ఆ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ నాయకత్వంలో సీనియర్ అధికారులు, ఇతర సిబ్బంది సమక్షంలో రాజ్యాంగ పీఠిక పఠనం జరుగుతుంది.

''పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ సమన్వయంతో దేశవ్యాప్తంగా సంవిధాన్ దివస్ నిర్వహిస్తారు. దేశంలోని మూడు అంచెల పంచాయతీ వ్యవస్థలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు'' అని కేంద్ర మంత్రిత్వశాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ''ఒక జాతీయస్థాయి రాజ్యాంగ సమ్మేళనం, రాజ్యాంగ పీఠిక పఠన ప్రసార కార్యక్రమాలను బుధవారం (26వ తేదీ) ఉదయం 10 గంటల నుండీ సాయంత్రం 6.45 గంటల వరకూ సంబంధిత మంత్రిత్వశాఖ అధికారిక యూట్యూబ్ చానల్‌లో ప్రసారం చేస్తారు. ప్రతి రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర పాలిత ప్రాంతానికీ ఈ లైవ్ ప్రసారాల్లో 15 నిమిషాలసేపు సమయం కేటాయిస్తారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పంచాయతీ రాజ్ వ్యవస్థ నుండి గ్రామీణ స్థానిక పంచాయతీ శాఖ వరకూ కమ్యూనిటీ ఆర్ట్ ద్వారా ఒక ప్రియాంబుల్ వాల్ సృష్టించేందుకు ప్రోత్సాహం ఇస్తారు. గోడలపై ''మన గ్రామం, మన రాజ్యాంగం'' అని రాతలు రాయిస్తారు. యువకులు, స్వయం సేవాసంఘాలు, కమ్యూనిటీ సంస్థలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటాయి. రాష్ట్ర స్థాయిలో సమన్వయం విభాగాలు ఈ కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు క్రియాశీల పాత్ర నిర్వహిస్తాయి. వీటిపై ప్రత్యేకదృష్టి కేంద్రీకరిస్తాయి. 'పెసా' ప్రాంతాలలో ప్రత్యేక భాగస్వామ్యంతో పాల్గొంటారు.

## రాజకీయపార్టీలకు అజ్ఞాత విరాళాలు వద్దు

### దాతలపేర్లు బయటపెట్టాలి
### సుప్రీంకోర్టులో పిటిషన్
### కేంద్రం,ఇసికి ధర్మాసనం సంజాయషీ నోటీసులు




**న్యూఢిల్లీ:** రాజకీయ పార్టీలు రూ.2000 లోపు నగదు విరాళాలను అజ్ఞాత దాతల నుండి స్వీకరించేందుకు అనుమతిస్తూ దేశ ఆదాయపన్ను చట్టంలో పొందుపరచిన నిబంధన చెల్లుబాటును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. రాజకీయపార్టీలకు విరాళాలు ఇచ్చే దాతలపేర్లు అజ్ఞాతంగా ఉంచకూడదని, వారి పేర్లు బయటపెట్టాలని, ఆ వివరాలన్నీ ఓట్లు వేసే ఓటర్లకు తెలియాల్సిన అవసరం ఉందని పిటిషనర్ కోరారు. రాజకీయపార్టీలకు ఎంత సొమ్ము దాతలు విరాళంగా ఇస్తున్నారు? ఎవరు ఇస్తున్నారు? అనే వివరాలన్నీ ఓటర్లకు అందుబాటులో ఉంచాలని పిటిషనర్ కోరారు. రాజకీయ పార్టీలు ధనం రూపేణా ఏదీ తీసుకోకూడదని, రాజకీయ పార్టీలు నిధులు సమకూర్చుకునే విషయంలో దాపరికం ఉండకూడదని పిటిషనర్ కోరారు. న్యాయవాది జయేష్ కె.ఉన్నికృష్ణన్ ద్వారా ఈ పిటిషన్ దాఖలైంది. ఈ విషయంపై భారత ఎన్నికల సంఘానికి మార్గదర్శకాలు జారీ చేయాలని కూడా పిటిషనర్ కోరారు.

ఈ కేసులో పిటిషనర్‌కు సంజాయిషీ చెప్పాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికీ, భారత ఎన్నికల సంఘానికి, ఇతర రాజకీయ పార్టీలకు సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. కేంద్రం, ఎన్నికల సంఘం నుండి ప్రతిస్పందనలు సిద్ధమైన తర్వాత ఈ కేసు విచారణను నాలుగువారాల తర్వాత విచారణకు చేపడతామని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. వాస్తవానికి ఆదాయపన్నుచట్టంలో రాజకీయ పార్టీలకు ఉన్న సదుపాయం ప్రకారం సెక్యూరిటీలు, ఇంటి ఆస్తులనుండి ఆదాయం లేదా ఇతర వనరుల ద్వారా ఆదాయంతో పార్టీలు నిధులు సమకూర్చుకోవాలి. పార్టీలకు ఆదాయం స్వచ్ఛంధంగా సమకూరాలి.

1961 ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 13ఎలో ఉన్న క్లాజ్ (డి)ని రద్దుచేయాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారు. 2024లో ఎన్నికల బాండ్లను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఈ సందర్భంగా పిటిషనర్ ప్రస్తావించారు. ఈ విషయంలో దాపరికం ఉండటంవల్ల ఎన్నికల ప్రక్రియలో రాజకీయపార్టీలకు నిధులు ఎక్కడి నుండి సమకూరుతున్నాయన్న విషయంలో ముఖ్యమైన సమాచారం ఓటర్లకు తెలియడంలేదని, ఓటర్లకు హేతుబద్ధత కొరవడుతోందని, ఓట్లు వేసే సమయంలో ఓటర్లకు పూర్తి అవగాహన ఉండాలని, కానీ ఈ దాపరికంవల్ల వారిలో అవగాహనలేక వారిలో హేతుబద్ధత కొరవడుతోందని పిటిషనర్ పేర్కొన్నారు. కేంద్రం, ఎన్నికల సంఘంతోపాటు కొందరు ఇతరులకు కూడా సుప్రీంకోర్టు ఈ నోటీసులు ఇచ్చింది. ఒక రాజకీయ పార్టీని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, ఎన్నికల గుర్తును కేటాయించడానికి ముందుగా, సదరు పార్టీ నగదు తీసుకోకూడదన్న విషయాన్ని షరతుగా నిర్దేశించాలని ఎన్నికల సంఘానికి మార్గదర్శకాలు జారీ చేయాలని కూడా పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. అదేవిధంగా గుర్తింపు పొందిన అన్ని రాజకీయపార్టీల నుండీ 24 ఎ ఫారంలను క్షుణ్ణంగా పరిశీలించాలని పిటిషనర్ కోరారు. వారికి సమకూరే ధనం ఇచ్చేవారి చిరునామా లేదా పాన్ కూడా ఇవ్వడంలేదని పిటిషనర్ పేర్కొన్నారు. ఫారం 24 ఎను సమర్పించని పార్టీలను ఎన్నికల సంఘం సంజాయషీ అడగాలనీ, ఎన్నికల గుర్తును ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నించాలని పిటిషనర్ కోరారు.

దీనిపై ఎందుకు మీరు మొదట హైకోర్టుకు వెళ్ళలేదని ఈ నోటీసులు జారీ చేయడానికి ముందుగా పిటిషనర్ ఖేమ్ సింగ్ భాటా తరపున కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా, న్యాయవాది స్నేహ కలితలను న్యాయస్థానం ప్రశ్నించింది. మొదట ఈ కేసును హైకోర్టును పరిశీలించనివ్వండి అని ధర్మాసనం పేర్కొంది. దీంతో న్యాయవాది హన్సారియా స్పందిస్తూ, ఈ పిటిషన్ అన్ని రాజకీయపార్టీలకూ సంబంధించిన విషయమని, దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలకు నగదు నిధులు వారికి సమకూరుతున్న విషయానికి సవంబంధించినదని వివరణ ఇచ్చారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు ధర్మాసనం సమ్మతించి సంబంధిత అందరికీ నోటీసులు జారీ చేసింది.

## నెతన్యాహూ అసమర్థ ప్రభుత్వం

### ఇజ్రాయెల్‌కు అదే అతిపెద్ద సమస్య
### ప్రతిపక్షనేత యైర్ లిపిడ్ విమర్శ

**జెరూసలెం:** ఇజ్రాయెల్‌లో యుద్ధ సమస్యకు భిన్నంగా దేశంలో ఉన్న ఇతర సమస్యల పరిష్కారంలో విఫలమైన నెతన్యాహూ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. ప్రధానమంత్రి నెతన్యాహూ అసమర్థ ప్రభుత్వమే ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థకు అతిపెద్ద సమస్యగా మారిందని ప్రతిపక్ష నాయకుడు యైర్ లిపిడ్ విమర్శించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇజ్రాయెలీ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో సోమవారం బిజినెస్ లీడర్స్‌తో జరిగిన ఒక సమావేశంలో లాపిడ్ దేశ సమస్యలపై మరోసారి తీవ్రంగా స్పందించారు. ''ఇజ్రాయెల్ దేశానికి అతిపెద్ద ఆర్థిక సమస్య ఏమిటంటే మనకు ఇక్కడ పనిచేసే ప్రభుత్వం లేదు, నైతికకోణంలో పరిశీలిస్తే ఇక్కడ ప్రభుత్వమే లేదు, నిర్వహణ సామర్థ్యం లేదు, ఆర్థిక దృక్పథంతో పనిచేసే ప్రభుత్వం గానీ, పౌరుల జీవితాలను నిలబెట్టేందుకు వారి సమస్యలను పరిష్కరించే ప్రభుత్వం దేశంలో లేదు, ఈ దేశంలో ఎలాంటి ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్నదీ ఆయన వివరించారు. దేశంలో కూటమి ప్రభుత్వ నిధులతో పనిచేసే ప్రభుత్వం ఉండకూడదు, ఐడిఎఫ్‌తో పనిచేసే ప్రభుత్వం ఉండకూడదు, సైన్యం లేకుండా ప్రభుత్వాన్ని ప్రజలకోసం నడపాలి, కేవలం 18 మంది మంత్రుల సహాయంతో ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడపాలనుకుంటున్నాను'' అని లిపిడ్ చెప్పారు.

## హైకమాండ్ నిర్ణయిస్తే పదవిలో కొనసాగుతా

### కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్య
### ఢిల్లీ బాటపట్టిన డికె శివకుమార్ మద్దతు ఎమ్మెల్యేలు



**బెంగళూరు:** కర్నాటకలో ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డికె శివకుమార్ మధ్య పోటీ తీవ్ర తరమవుతుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్యకు మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు ఢిల్లీకి చేరుకుంటున్నారు. అయితే పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తే తాను పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య పేర్కొనడం గమనార్హం. కాగా, ఇప్పటికే డికె శివకుమార్‌కు మద్దతు తెలిపే ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాం వేయగా, మరో ఆరుగురు దేశ రాజధానికి చేరుకున్నారు. ఇంకొంతమంది కూడా వారితో చేరే అవకాశాలున్నాయి. అయితే నాయకత్వ మార్పుపై హైకమాండ్ తుది నిర్ణయం తీసుకుంటుందని, దానిని తాను, తన డిప్యూటీ కూడా అంగీకరించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. 'మేము హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాము. వారు నేను (సిఎంగా) కొనసాగాలని నిర్ణయించుకుంటే, కొనసాగుతాను. చివరికి, హైకమాండ్ ఏది నిర్ణయిస్తే, దానిని అంగీకరించాలి. శివకుమార్ కూడా దానిని అంగీకరించాలి' అని సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారా అని అడిగినప్పుడు, 'హైకమాండ్ నిర్ణయిస్తుందని నేను చెప్పానని, మీరు నన్ను మళ్ళీ అదే అడుగుతున్నారు' అని సిద్ధరామయ్య అసనం వ్యక్తం అన్నారు. శివకుమార్ మద్దతుదారులు ఢిల్లీకి విమానాల్లోకి వెళ్తున్న నేపథ్యంలో ఈ సీనియర్ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. 2023లో అగ్రశ్రేణి ఇద్దరు నాయకుల మధ్య అధికార పంపిణీ ఒప్పందం పుకార్లకు ఆజ్యం పోసినప్పటికీ, డిప్యూటీ సిఎం శివకుమార్ మద్దతు ఉన్న కనీసం ఆరుగురు శాసనసభ్యులు ఆదివారం రాత్రి కాంగ్రెస్ నాయకులను కలవడానికి దేశ రాజధానికి చేరుకున్నారు. ఈనెల 20న కాంగ్రెస్ ప్రభుత్వం తన 2.5 సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నందున, ముఖ్యమంత్రి మార్పు ఉండవచ్చనే ఊహాగానాలు ముమ్మరమయ్యాయి. దీనిని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలిచినప్పుడు సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య జరిగిన అధికార పంపిణీ ఒప్పందం దృష్ట్యా కొందరు 'నవంబర్ విప్లవం'గా అభివర్ణిస్తున్నారు. దళిత ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టాలనే పిలుపుల మధ్య యాదృచ్ఛికంగా మాజీ కెపిసిసి చీఫ్, హోంమంత్రి జి పరమేశ్వర కూడా బరిలోకి దిగారు. ఢిల్లీలో ప్రస్తుతం ఉన్న ఆరుగురు శివకుమార్ అనుకూల ఎమ్మెల్యేలతో పాటు, కెపిసిసి చీఫ్‌ను సిఎంగా నియమించడానికి మరికొందరు శాసనసభ్యులు త్వరలో ప్రయాణించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో ఉన్న ఎమ్మెల్యేలు హెచ్ సి బాలకృష్ణ, కె ఎం ఉదయ్, నయన మోటమ్మ, ఇక్బాల్ హుస్సేన్, శరత్ బచేగౌడ్, శివగంగ బసవరాజ్ అని వర్గాలు తెలిపాయి. సిద్ధరామయ్య ఇది వరకే బెంగళూరులో ఉన్న ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిశారు. కాంగ్రెస్ చీఫ్ ఢిల్లీకి వెళ్లనున్నారు, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాల నుండి తిరిగి వచ్చే అవకాశం ఉందని, ఈ విషయంపై ఇద్దరి మధ్య చర్చించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ హైకమాండ్ ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటుందని కూడా ఖర్గే పేర్కొన్నారు.

## భారత నౌకాదళం అమ్ముల పొదిలో 'సైలెంట్ హంటర్' అస్త్రం

### 'ఐఎన్ఎస్ మాహె'ను నేవీకి అప్పగింత



**న్యూఢిల్లీ:** భారత నౌకాదళం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ షాలో ఎఎస్‌డబ్ల్యు ఎస్ వాటర్ క్రాఫ్ట్ 'ఐఎన్ఎస్ మాహె' నౌకాదళంలో చేరింది. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది 'ఐఎన్ఎస్ మాహె'ను నేవీకి అప్పగించారు. కొచ్చిన్ షిప్‌యార్డులో నిర్మించిన ఐఎన్ఎస్ మాహెలో 80 శాతం స్వదేశీ సాంకేతికతను వినియోగించారు. సైలెంట్ హంటర్‌గా పిలిచే ఈ నౌక పశ్చిమ సీబోర్డు ఆధీనంలో కార్యకలాపాలు సాగించనుంది. 'మలబార్ తీరంలోని చారిత్రక పట్టణం మాహె పేరును ఈ నౌకకు పెట్టారు. దీని పైభాగంలో ఉరుమి అనే ఆయుధాన్ని ఏర్పాటు చేశారు. ఇది కలరిపయట్టులో ఉపయోగించే పొడవైన, సన్నని కత్తి. చురుకుదనం, కచ్చితత్వం, యుద్ధ సమర్థతను ఇది సూచిస్తుంది. ఈ నౌక రాకతో సముద్ర తీరాలపై భారత ఆధిపత్యం మరింత పటిష్ఠం కానుంది. జలాంతర్గాములను వేటాడేందుకు, తీర ప్రాంతంలో గస్తీ నిర్వహించేలా ఐఎన్ఎస్ మాహెను అధునాతన సామర్థ్యాలతో నిర్మించారు. సముద్ర గర్భంలో నిఘాతో పాటు రెస్క్యూ మిషన్లలోనూ ఈ జలాంతర్గామి పాల్గొననుంది' అని సైనిక దళాల అధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు.

**శత్రు జలాంతర్గాములు దీని రాకను గుర్తించలేవు!**

ధ్వని తక్కువగా ఉండే ఈ వాటర్‌క్రాఫ్ట్ నీటిలో చాలా నిశ్శబ్దంగా కదులుతుంది. శత్రు జలాంతర్గాములు దీని రాకను గుర్తించలేవు. అందుకే దీన్ని సైలెంట్ హంటర్‌గా పిలుస్తారు. ఇందులోని సోనార్ సిస్టమ్ అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. శత్రు జలాంతర్గాములు, మైన్స్, సముద్రంలో ఇతర ముప్పులను కనిపెట్టేందుకు ఈ వ్యవస్థే నౌకకు అత్యంత కీలకం. డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అభయ్ హల్‌మౌంటెడ్ సోనార్ వ్యవస్థను ఇందులో ఉపయోగించారు. తద్వారా నౌక చుట్టూ ఉన్న ప్రాంతాలను నిరంతరం గమనించే అవకాశం ఉంటుంది. జలాంతర్గాముల శబ్దాలు, వాటి కదలికలను ఇది వేగంగా గుర్తిస్తుంది. ఇందులోని 'లో ఫ్రీక్వెన్సీ వేరియబుల్ డెప్త్ సోనార్' వ్యవస్థ సాయంతో సముద్రంలో చాలా లోపలి వరకు నిఘా పెట్టే అవకాశం ఉంది. ఈ నౌక నుంచి ఓ కేబుల్ విడిపోయి సముద్ర గర్భంలో శత్రు ముప్పును పసిగడుతూ ఉంటుంది.

**రెస్క్యూ ఆపరేషన్లలోనూ కీలకం!**

ఐఎన్ఎస్ మాహెలో ఐఆర్ఎల్ యాంటీసబ్‌మెరైన్ రాకెట్ లాంఛర్, 30ఎంఎం నావెల్ సర్ఫేస్ గన్, అడ్వాన్స్‌డ్ ట్రిపుల్ లైట్‌వెయిట్ టార్పెడో లాంఛర్, యాంటీసబ్‌మెరైన్ మైన్స్, 12.7ఎంఎం రిమోట్ కంట్రోల్ గన్ వంటి ఆయుధ వ్యవస్థలు ఉన్నాయి. తక్కువ లోతు ఉండే ప్రాంతాల్లో ఇది చాలా సమర్థంగా పనిచేస్తుంది. ఈ యుద్ధ నౌక పొడవు 78 మీటర్లు కాగా, సముద్ర జలాల్లో వేగంగా, స్థిరంగా కదలగలదు. ఈ నౌక గంటకు 25 నాటికల్ల మైళ్ల వేగంతో వెళ్లగలదు. ఫలితంగా వేగంగా చేపట్టే రెస్క్యూ ఆపరేషన్లలో ఇది కీలకంగా పనిచేస్తుంది. నౌకలో మొత్తం 57 మంది సిబ్బంది పని చేస్తారు.

## తమిళనాడు, ఉత్తరాఖండ్‌లో బస్సు ప్రమాదాలు

### 11 మంది మృతి : పలువురికి గాయాలు



**న్యూఢిల్లీ:** తమిళనాడులోని టెన్‌కాశి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ప్రైవేట్ బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఆరుగురు మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని సహాయ చర్యల్లో చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పలువురు పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మధురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు దురైసామిపురం ప్రాంతానికి రాగానే, ఎదురుగా టెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు మరణించాడు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ప్రమాదం ధాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం టెన్‌కాశీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టెన్‌కాశి జిల్లా కలెక్టర్ కమల్ కిశోర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అరవింద్ నేతృత్వంలోని పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద స్థలం నుంచి తొలగించే పనులు చేపట్టారు.

### స్పందించిన సిఎం

మరోవైపు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఈ ఘటనపై స్పందించారు. ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు, తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ.1లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ప్రకటించారు.

### నియంత్రణ కోల్పోయి గుంతలో పడిన బస్సు- ఐదుగురు మృతి

ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ జిల్లాలో బస్సు ప్రమాదం జరిగింది. భక్తులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి గుంటలో పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 20 మంది గాయపడ్డారని ఎఎస్‌పి జెఆర్ జోషి తెహ్రీ గర్వాల్ తెలిపారు. క్షతగాత్రుల్లో కొంత మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసుల ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. 28 మంది ప్రయాణికులతో ఉన్న బస్సు సోమవారం రిషికేశ్ నుంచి కుంజాపురి ఆలయానికి చేరుకుంది. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో బస్సు 70 మీటర్ల లోతు ఉన్న గుంటలో పడిపోయినట్లు సమాచారం. ఘటనాస్థలిలో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో నిమగ్నమయ్యాయి. కాగా ప్రయాణికులంతా ఢిల్లీ, గుజరాత్‌కు చెందిన వారుగా తెలుస్తోంది.

## బిఎల్‌ఒల నిరసన ప్రదర్శన




**కోల్‌కతా:** కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో ఒత్తిడికి గురై బిఎల్‌ఒలు ఆత్మహత్యలు, గుండెపోటుకు గురవుతామతి చెందుతున్న విషయం విదితమే. అయితే పశ్చిమ బెంగాల్‌లో సోమవారం సర్ ప్రక్రియలో నిమగ్నమై ఉన్న బూత్ స్థాయి అధికారులు అధిక పని ఒత్తిడిని నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. సిఇఒ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బిఎల్‌ఒలు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. బిఎల్‌ఒ అధికార్ రక్షా కమిటీ సభ్యులు ఉత్తర కోల్‌కతాలోని కాలేజ్ స్క్వేర్ నుండి తాళాలు, సంకెళ్లతో ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) కార్యాలయం ఉన్న భవనం ప్రధాన ద్వారాన్ని మూసివేయడానికి ర్యాలీగా వెళ్లారు. అప్పటికే అక్కడ బారిగేకేడ్లు ఏర్పాటు చేయగా వాటిని తొసుకుంటూ సిఇఒ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. సర్ సమయంలో తీవ్రమైన, అమానవీయ పని ఒత్తిడికి సంబంధించిన వారి ఫిర్యాదులకు పోల్ ప్యానెల్ స్పందించకపోవడంతో ఊరేగింపును నిర్వహించాల్సి వచ్చిందని ఆరోపిస్తూ నిరసన తెలిపిన బిఎల్‌ఒలు ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్కువ వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారని, అయితే అదే పని సాధారణంగా రెండు సంవత్సరాల కంటే ఎక్కువ సమయం పడుతుందని ఒక కార్యకర్త పేర్కొన్నారు. బిఎల్‌ఒలు అనారోగ్యానికి గురవుతున్నారని, వారిలో ఇద్దరు ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని కమిటీ ఆరోపించింది. ఎన్నికల కమిషన్ తక్షణ జోక్యం కోసం ఒత్తిడి తీసుకురావడానికి పారాటీచర్లు, కళాశాల ప్రొఫెసర్లు, అనేక సంస్థలకు చెందిన ఉపాధ్యాయులు ఈ మార్చ్‌లో పాల్గొంటారని బిఎల్ఓ అధికార్ రక్ష కమిటీ గతంలో ప్రకటించింది. ఎస్ఐఆర్ కింద ఇంటింటికి గణన నవంబర్ 4న ప్రారంభమైంది, డిసెంబర్ 4 వరకు కొనసాగుతుంది. డిసెంబర్ 9న ముసాయిదా జాబితా ప్రచురిస్తారు. గడువులను పొడిగించకపోతే లేదా దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే, నిరంతర నిరసన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కమిటీ హెచ్చరించింది.

## అది అసాధారణ పరిస్థితుల్లో సంభవించిన దుర్ఘటన

**న్యూఢిల్లీ:** హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్) తయారు చేసిన తేజస్ యుద్ధ విమానం దుబాయ్ ఎయిర్ షోలో శుక్రవారం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో హెచ్ఎఎల్ పైలట్, వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ మృతిచెందారు. సయాల్ మరణంపట్ల హెచ్ఎఎల్ కంపెనీ తీవ్ర విచారం వ్యక్తంచేసింది. ఈ ప్రమాదాన్ని అసాధారణ పరిస్థితుల్లో సంభవించిన దుర్ఘటనగా అభివర్ణించింది. మరోవైపు తేజస్ ప్రమాదంతో సోమవారం నాటి ట్రేడింగ్‌లో హెచ్ఎఎల్ షేర్లు భారీగా పడిపోయాయి. కంపెనీ షేర్లు సోమవారం ఉదయం ఎనిమిది శాతానికిపైగా పడిపోయాయి. అయితే ఈ ప్రమాదం తమ సంస్థ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు, భవిష్యత్తు డెలివరీలపై ఎలాంటి ప్రభావం చూపదని హామీ ఇచ్చింది. అయినప్పటికీ బీఎస్ఈలో షేరు ఓ దశలో దాదాపు 8 శాతం తగ్గి రూ.4,205 వద్ద ట్రేడైంది.

## కనీస వేతనాలు, సామాజిక భద్రతపై ఎలాంటి ఆధారాలు లేవు

### నాలుగు లేబర్ కోడ్‌ల అమలుపై ఎస్‌కెఎం ఆగ్రహం

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) బిజెపి నేతృత్వంలోని సర్కార్‌పై తీవ్రంగా మండిపడింది. కొత్త కార్మిక చట్టాలు కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రతను కల్పిస్తాయనే వాదనలకు ఎలాంటి ఆధారాలు లేవని ఆక్షేపించింది. 90 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో ఉన్నారని, ఈ నియమావళి పరిధికి దూరంగా ఉన్నారని ఎస్‌కెఎం పేర్కొంది. కొత్త నియమావళిని కూడా ఖండించింది. అవి కార్మికులు కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కును తిరస్కరిస్తాయని, సమ్మె నిర్వహించడంపై కఠినమైన షరతులు విధించాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుత 8 గంటల నుండి 12 గంటల పని దినాలను చట్టబద్ధం చేసిందని, 8 గంటల పనిదినాలు కార్మికులకు సార్వత్రికంగా ఆమోదించబడిన హక్కు అని పేర్కొంది. ఇది న్యాయమైన, మానవీయ పని పరిస్థితులను నిర్ధారించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 42కు విరుద్ధంగా ఉందని తెలిపింది. 'స్వాతంత్ర్యం తర్వాత అత్యంత తిరోగమన కార్మిక సంస్కరణలు అయిన నాలుగు కార్మిక నికఓడ్‌లను ప్రశంసించాలనే కార్పొరేట్ తప్పుడు పచారాన్ని ఎస్‌కెఎం తీవ్రంగా ఖండిస్తుంది. వారి హక్కులను పునరుద్ధరించడానికి, ఇతర ప్రాథమిక డిమాండ్లను సాధించడానికి, కార్మిక కోడ్‌లపై పోరాడటానికి ఐక్య కార్మిక సంఘాల ఉద్యమానికి ఎస్‌కెఎం హృదయపూర్వకంగా మద్దతు ఇస్తుంది' అని ఒక ప్రకటన తెలిపింది. కార్మిక కోడ్‌లు కార్మికులందరికీ కనీస వేతనాలు, సామాజిక భద్రతను కల్పిస్తాయని ప్రధాన మంత్రి చేసిన వాదనకు ఆధారాలు లేవని, అసంఘటిత రంగంలో ఉన్న 90 శాతం కంటే ఎక్కువ మంది కార్మికులు కార్మిక కోడ్‌ల పరిధికి దూరంగా ఉన్నారని వెల్లడించింది. కార్మిక కోడ్‌లు ఇప్పుడు మిగిలిన కార్మికులలో 90 శాతం మందిని చట్టపరమైన రక్షణ నుండి దూరంగా ఉంచాయని ఆవేదన వ్యక్తం చేసింది. 300 కంటే తక్కువ మంది కార్మికులు ఉన్న యూనిట్లను 100 మంది కార్మికుల పరిమితి నుండి తొలగింపులు, మూసివేతలకు ముందస్తు ప్రభుత్వ అనుమతి పొందవలసిన అవసరం నుండి పారిశ్రామిక సంబంధాల నియమావళి మినహాయించిందని ఎత్తి చూపింది. అలాగే, 20 లేదా 40 మంది కంటే తక్కువ మంది కార్మికులు ఉన్న యూనిట్లు (విద్యుత్ వినియోగాన్ని బట్టి) వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల (ఒఎస్‌హెచ్‌డబ్ల్యుసి) కోడ్ నిర్దిష్ట నిబంధనల నుండి మినహాయించబడ్డాయి. 2021–22లో వార్షిక పరిశ్రమల సర్వే (ఎఎస్ఐ) డేటా ప్రకారం 100 కంటే తక్కువ మంది ఉద్యోగులు ఉన్న కర్మాగారాలు, అన్ని కర్మాగారాల్లో 79.2 శాతం ఉన్నాయి. అసంఘటిత రంగంలో సామాజిక భద్రతకు కనీస వేతనాలను నిర్ధారించడానికి ఎటువంటి అమలు యంత్రాంగం లేదని, కనీస వేతనాన్ని రూ. 26,000కి పెంచాలనే డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించడానికి ఇష్టపడటం లేదని ఎస్‌కెఎం విమర్శించింది. బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని హితవు పలికింది. బిజెపి, ఆర్ఎస్ఎస్, బిఎంఎసం నాయకత్వం కార్పొరేట్లకు మద్దతు ఇస్తున్నాయా లేదా భారత ప్రజలకు మద్దతు ఇస్తున్నాయా అనే దానిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. మోదీ ప్రభుత్వం శ్రామిక ప్రజలను, యువతరాన్ని మోసం చేయడానికి కార్పొరేట్ గుత్తాధిపత్యాలకు లొంగిపోయిందని ఆరోపించింది. లేబర్ కోడ్‌ల అమలు నేపథ్యంలో ట్రేడ్ యూనియన్ల అభిప్రాయాలు, సిఫార్సులను పరిగణనలోకి తీసుకోలేదని కూడా చెప్పింది. 'కీలకమైన త్రైపాక్షిక సంప్రదింపుల వేదిక అయిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి) 2015 నుండి సమావేశాలు నిర్వహించడం లేదు. శ్రామిక ప్రజలపై కార్పొరేట్ ఆధిపత్యాన్ని విధించే అత్యంత నిరంకుశ మార్గం ఆమోదయోగ్యం కాదు' అని అది పేర్కొంది. ఈనెల 26న జరగనున్న ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాలు, రంగాల సమాఖ్యలు, ఇతర కార్మిక, వ్యవసాయ కార్మికుల సంఘాల సంయుక్త వేదికలు పిలుపునిచ్చిన నిరసనలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చింది.

ప్రజాపక్షం
మంగళవారం, 25 నవంబరు

# కార్మికుల డిజిటల్ లాక్‌ఔట్

సైబర్ నేరాల్లో 'డిజిటల్ అరెస్టు' గూర్చి తరచూ వింటున్నాం, చదువుతున్నాం. మన న్యాయ శాస్త్రంలో, చట్టాల్లో అటువంటిదేమీ లేదని రిజర్వుబ్యాంక్ సహా సంబంధీకులు ప్రచారం చేస్తున్నారు. ఈ డిజిటల్ అరెస్టు బెడద ఎంతగా వ్యాప్తి చెందిందంటే మన పోలీసు వ్యవస్థ ఆ మోసాలను నిరోధించలేకపోతున్నది. అందువల్ల 'అప్రమత్తతే నిరోధకం' అని ప్రచారం చేస్తూ, నేరం జరిగిన 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే బాధితులు కోల్పోయిన సొమ్ములో కొంతైనా రాబట్టవచ్చునని పోలీసు అధికారులు ఒక ఫోన్ నెంబర్, ఇ–మెయిల్ అడ్రస్తు ఇస్తున్నారు. సైబర్ నేరగాళ్లతో కొందరు బ్యాంక్ ఉద్యోగులు కుమ్మక్కు కావటం కూడా ఈ డిజిటల్ నేరాలు పెరుగుదలకు కారణమవుతున్నదనేది ఆందోళన కలిగించే తాజా పరిణామం. డిజిటల్ అనే పదమే భయకంపితం చేసేంతగా నేరాలు, ఘోరాలు జరుగుతున్నాయి. ఇలా డబ్బు పోగొట్టుకుంటున్న వారిలో అత్యధికులు విద్యావంతులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు కావటం మరీ ఆందోళనకరం.

విద్యావంతులు, స్మార్ట్‌ఫోన్‌లతో సునాయాసంగా లావాదేవీలు జరిపేవారి పరిస్థితే ఇలా వుంటే, ఇక అవిద్యావంతులు, దినసరి కూలీలు, సాధారణ వాయిస్‌కాల్ ఫోన్ మాత్రమే ఉపయోగించగలిగిన పేదల పరిస్థితి ఎంత దుర్లభం – ఈ డిజిటల్ వ్యవస్థలో. గ్రామీణ నిరుపేద శ్రమజీవులకున్న ఏకైక ఉపాధి హామీ పథకం – మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ (ఎంజిఎన్ఆర్ఇజిఎ) చట్టం డిజిటల్ పరిధి నెలరోజుల్లో (2025 అక్టోబరు 10– నవంబర్ 14) దాదాపు 27లక్షలమందిని బయటకు నెట్టివేసింది. నోరేగా డేటాబేస్‌నుంచి వారి పేర్లు తొలగించబడ్డాయి – అంటే రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవుల కడుపుమీద కొట్టారు. ఎంత దారుణం! ముసాయిదా శ్రమశక్తినీతి, 2025 ఆమోదించబడితే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పదుల లక్షలమంది శ్రమజీవులు డిజిటల్‌గా ఉపాధులనుంచి తొలగించబడతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కార్మికమంత్రిత్వశాఖ 'భారతదేశ జాతీయ కార్మిక, ఉపాధి విధానం(శ్రమశక్తి నీతి)' ముసాయిదాను అక్టోబర్ 8న విడుదలచేసి, అక్టోబర్ 27లోగా సంబంధితులనుంచి అభిప్రాయాలు కోరటం తెలిసిందే. తగినన్ని రక్షణలు లేని డిజిటల్ ఫ్రేమ్‌వర్క్ అనియత కార్మికులను, గ్రామీణ శ్రామికులను, వలస కార్మికులను దేశ ఉపాధి కల్పన వ్యవస్థనుంచి బయటకు పంపుతుందని ఇంటర్నెట్ ఫ్రీడం ఫెడరేషన్(ఐఎఫ్ఎఫ్) హెచ్చరించింది.

కేవలం నెలరోజుల్లో 27లక్షలమంది నోరేగా శ్రామికుల పేర్లను తొలగించటం ఐఎఫ్ఎఫ్ ఆందోళనను ధృవీకరిస్తున్నది. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పాత డిజిటల్ ఫ్రేమ్‌వర్క్ కిందనే ఇది జరిగింది. ఆ నెలలో 10.5లక్షల పేర్లు కొత్తగా చేరాయి. కాగా కేంద్రప్రభుత్వం ఇ–కెవైసీని (మీ కస్టమర్‌ను ఎలక్ట్రానికల్‌గా తెలుసుకో) పాటింపును తప్పనిసరి చేయటంవల్ల అర్హులైన లబ్దిదారులు 27లక్షలమంది ఏరివేయబడ్డారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)ను ఉపయోగించటాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అన్ని పని ప్రదేశాల్లో 2021 మే 21 న ప్రారంభించిన నాటినుంచీ నోరేగా కార్మికసంఘాలు అభ్యంతరం చెబుతున్నాయి. నోరేగా కింద పనులు నిరాకరించటానికి అనేక రూల్సు ఉన్నాయి. ఐదేళ్ల కొకసారి జాబ్‌కార్డుల పునరుద్ధరణ వాటిలో ఒకటి. ఆ పని ఇప్పుడు జరుగుతున్నదని అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇ–కెవైసీని తప్పనిసరి చేస్తూ 2025 జులై 8న రాష్ట్రప్రభుత్వాలకు 18 పేజీల నోట్ పంపింది. ఈ పద్ధతి కింద నోరేగా సూపర్‌వైజర్లు ప్రతి ఒక్క కార్మికుని ఫోటో తీసి ఎన్ఎంఎంఎస్ కు అప్‌లోడ్ చేయాలి. అవి వారి ఆధార్ డేటాతో సరిపోలాలి. అలాగే కార్మికులు పనిచేస్తున్న ఫోటోలను రోజుకు రెండుసార్లు అప్‌లోడ్ చేయాలి. అయితే ఇంటర్నెట్ కనెక్టివిటీ నాసిరకంగా ఉండటం సమస్య అవుతున్నది. దాంతో అనేకమంది ఉపాధి నిరాకణకు గురవుతున్నారు. ఆధార్ ప్రాతిపదికగా వేతన చెల్లింపులను 2023లో కేంద్రం ప్రవేశపెట్టింది. కార్మికుని పేరు, ఫోటో, ఆధార్‌కార్డ్, జాబ్‌కార్డ్, బ్యాంక్ అక్కౌంట్‌ల మధ్య ఏ మాత్రం తేడా ఉన్నా పని నిరాకరించబడుతోంది, చెల్లింపులు ఆగిపోతున్నాయి.

గ్రామీణ శ్రామికులకు పనులు లేనికాలంలో కనీసం ఒకపూట తిండిపెట్టే ఉపాధి హామీ చట్టాన్ని యుపిఎ మొదటి ప్రభుత్వం కమ్యూనిస్టుల ఒత్తిడితో తెచ్చింది. మోదీ ప్రభుత్వం దానికి తూట్లు పొడుస్తున్నది. దాన్ని కుదించేందుకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తోంది. ఇప్పుడీ డిజిటల్ ఇ–కేవైసీతో మరింతగా కార్మికులను తగ్గించే ప్రమాదం ఉంది. అందువల్ల గ్రామీణ కార్మిక సంఘాలు మరింత అప్రమత్తతతో పని అవసరమున్న ప్రతి శ్రమజీవి పేరును నోరేగా కింద రిజిస్టర్ చేయించాలి.

# ప్రజల రాజ్యాంగ దినోత్సవంగా నవంబరు 26



డివివిఎస్ వర్మ
దారిదీపం సంపాదకులు
85006 78977

నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం నాడు రాజ్యాంగ పీఠికను మనం జ్ఞప్తికి తెచ్చుకోవాలి. భారత ప్రజలమైన మనము...తో ప్రారంభమై రాజ్యాంగాన్ని మనము మనకు సమర్పించుకుంటున్నాము తో ముగుస్తుంది. ఈ రాజ్యాంగం మన దేశ ప్రజలందరిది. మనందరి సొత్తు. ప్రభుత్వాలు రాజ్యాంగ దినోత్సవాన్ని లాంఛనంగా ప్రజల భాగస్వామ్యం లేకుండా నిర్వహిస్తున్నాయి. పాలకులే రాజ్యాంగ భక్షకులైనప్పుడు ప్రజలే దానికి రక్షకులు కావాలి. అందువల్ల అన్ని పౌర సమాజ సంస్థలు దానిని ప్రజల రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలి.

రాజ్యాంగం రచన కోసం 1946 డిసెంబరు 9 రాజ్యాంగ సభ ఏర్పడింది. ముసాయిదా రచనా కమిటీకి డా.అంబేద్కర్ ఛైర్మన్ గా సారధ్యం వహించారు. రాజ్యాంగ ముసాయిదాకు తుది రూపం ఇవ్వడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది. 1949 నవంబరు 26 న ఆమోదించిన రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది.

భారతదేశం వివిధ ప్రాంతాలు, భాషలు , వివిధ మతాలు, వేల సంఖ్యలో కులాల దేశం. దేశ ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగ రూపకల్పన చేయడం అంత తేలిక కాదు.

ప్రత్యక్షంగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే లోక్ సభ తోపాటు రాష్ట్రాల శాసనసభలకు ప్రాతినిధ్యం కల్పించే రాజ్యసభను ఏర్పాటు చేశారు. యూనియన్–రాష్ట్రాల మధ్య స్పష్టమైన అధికార విభజన చేశారు. మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా దేశ పౌరులందరికీ ప్రాథమిక హక్కులను కల్పించే లౌకిక రాజ్యాంగాన్ని తెచ్చారు. అందరికీ ఓటు హక్కుతో అధికారంలో సమానత్వాన్ని కల్పించారు. ఇలా దేశంలో భిన్నత్వాన్ని కాపాడుతూ ఏకత్వాన్ని సాధించే రాజ్యాంగ రచన చేశారు.

రాజ్యాంగ లక్ష్యాలను, విలువలను స్పష్టంగా, సంక్షిప్తంగా క్రోడీకరించి ఒక అద్భుతమైన పీఠికను రూపొందించారు.

భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించాలని పీఠిక ప్రకటించింది. ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అందించే హామీని ఇచ్చింది. దేశ సమైక్యతకు ప్రజల మధ్య సౌభ్రాతృత్వం సాధించాలని చెప్పింది.

వీటిని రాజ్యాంగంలో పౌరులకు ప్రాథమిక హక్కులుగా, ప్రభుత్వాల కర్తవ్యాలను నిర్దేశించే ఆదేశిక సూత్రాలుగా పొందుపరిచారు.

రాజ్యాంగం ఎంత మంచిదైనా అది అమలు చేయాల్సిన వారు చెడ్డవారైతే అది చెరుపు చేస్తుందని నవంబరు 26న రాజ్యాంగసభ ముగింపు సమావేశంలో డా.అంబేద్కర్ చేసిన హెచ్చరికను మనం గుర్తుంచుకోవాలి.

ప్రస్తుతం మనం అలాంటి స్థితిలో వున్నాం. రాజ్యాంగబద్ధ పాలనకు చెరుపు చేసేవారు పాలకులు అయ్యారు.

గత 10 సంవత్సరాలకు పైగా ప్రధాని మోదీ సారధ్యంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నది. పీఠికలోని సామ్యవాద, లౌకిక పదాలను తొలగించాలని రచ్చ చేస్తున్నారు. మహాకుంభ మేళాలో సాధు బృందాల ముసుగుతో హిందూ రాష్ట్ర మత రాజ్యాంగ ముసాయిదాను ముందుకు తెచ్చారు. మోదీ ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చి ఎన్నికల కమిషనర్‌ల నియామకాన్ని తన గుప్పిటిలోకి తెచ్చుకుంది. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించవలసిన భారత ఎన్నికల సంస్థను స్వాధీనంచేసుకుంది. బీహార్ ఎన్నికల్లో గెలిచింది బిజెపి కూటమి కాదు, గెలిపించింది ఎన్నికల కమిషన్ అన్నది సత్యదూరం కాదు. ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం సిబిఐ, ఇడిలను వాడుకోవడం ప్రతి రోజూ చూస్తున్నదే.

రాజ్యాంగం దేశ ప్రజలను ఐక్యంచేసే పద్ధతులను రూపొందిస్తే దానికి విరుద్ధంగా ఓట్లకోసం కుల, మత, ప్రాంతీయ, భాషా పరమైన విద్వేషాల చుట్టూ విభజన రాజకీయం సాగిస్తున్నారు.

ఇప్పుడు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న రెండు శక్తులు వున్నాయి. ఒకటి దేశాన్ని పాలిస్తున్న బిజెపి, సంఘ పరివారం. మరొకటి దేశ సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ శక్తులు. ఇవి రెండూ పెనవేసుకుని వున్నాయి. పరస్పర సహకారంతో, ఆదాన ప్రదానాల తో ఒకరు అధికారాన్ని మరొకరు, దేశ సంపదను చేజిక్కించుకుంటున్నారు.


PREAMBLE

WE, THE PEOPLE OF INDIA,
having solemnly resolved to constitute India into a
SOVEREIGN SOCIALIST
SECULAR DEMOCRATIC REPUBLIC
and to secure to all its citizens :
JUSTICE, social, economic and political;
LIBERTY of thought, expression,
belief, faith and worship;
EQUALITY of status and of opportunity;
and to promote among them all
FRATERNITY assuring the dignity of the
individual and the unity and
integrity of the Nation;
IN OUR CONSTITUENT ASSEMBLY
this twenty-sixth day of November, 1949, do
HEREBY ADOPT, ENACT AND GIVE TO
OURSELVES THIS CONSTITUTION.

మోదీకి వున్న జనాకర్షణ ఆయన పరిపాలనా దక్షత నుండి వచ్చింది కాదు. ఆయన పాలన ఒక వైఫల్యాల పుట్ట. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి బాదుడు, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, మేకిన్ ఇండియా, స్మార్ట్ సిటీలు, రైతుల ఆదాయం రెట్టింపు వగైరాలన్నీ దీనికి అద్దం పడతాయి. 230లక్షల కోట్లకు పైగా అప్పుల చెయ్యడం, అదానీ, అంబానీలను ప్రపంచంలో అత్యధిక సంపన్నులను చెయ్యడం,కార్పొరేట్ శక్తులకు రుణమాఫీలు, రాయితీలుగా 20 లక్షల కోట్లు ప్రజల సొమ్మును దానం చెయ్యడమే ఆయన సాధించిన విజయాలు.

మోదీ తనను తాను హిందూ జాతీయ వాదిగా ప్రకటించుకున్నారు. మెజారిటీ మత జాతీయవాద ఉన్మాదాన్ని ప్రేరేపించడానికి హిందూత్వను, హిందూ మతానికి జతచేసి రాజకీయం చేస్తున్నారు. హిందూత్వ హిందూ మతం ఒకటి కాదు. హిందూత్వలో మతం లేదు. అది కేవలం మత రాజకీయం మాత్రమే. కాని హిందూ మతం ఒక విశ్వాసం. దానికంటూ తనదైన ఒక ప్రత్యేక రాజకీయం లేదు.

కాని మోదీ, సంఘ పరివారం ఈ రెంటినీ కలగాపులగం చేసి ఓట్లకోసం మత పరంగా ప్రజలను విభజించి విద్వేషాన్ని ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. ఇందులోనే మోదీ జనాకర్షణ శక్తి దాగి వుంది.

దీనికి తోడుగా ఎన్నికలకు అపారమైన నిధులను అందించగల కార్పొరేట్ శక్తుల మిత్రగణాన్ని పెంచి పోషిస్తున్నారు.

దీనికి గోదీ మీడియా బాకాలు ఊదుతున్నాయి. మరో పక్క స్వతంత్ర రాజ్యాంగ సంస్థలు తలలు వంచుతున్నాయి. మోదీ జనాకర్షణ సాధన వెనుక ఇన్ని శక్తులున్నాయి. అది ఒక కృత్రిమ సృష్టి నుండి, ఒక ఉన్మాదం నుండి పుట్టుకొచ్చిన జనాకర్షణ.

యువత, మధ్యతరగతి వర్గాలు ఈ ఆకర్షణకు లోనౌతున్నారు. వారిలో హిందూత్వకి, హిందూమతానికి వున్న తేడాని గుర్తించ లేని భావజాల గందరగోళం వుంది.

మత స్వేచ్ఛ అందరికీ వుండాలి. కాని మనం వేసే ఓటు లక్ష్యం వేరు. దానిని కుల, మతాలకు అతీతంగా మంచి పాలన కోసం వినియోగించాలి అన్న చైతన్యాన్ని ప్రజల రాజ్యాంగ దినోత్సవం ప్రచారంలో భాగం చెయ్యాలి.

మరొక అంశం హిందువులకు ఒక దేశం వుండాలని సంఘ పరివారం చేస్తున్న ప్రచారానికి కొందరు లోనౌతున్నారు. ఏ మత రాజ్యం లోనైనా రాజ్యాంగం వుండదు, నామమాత్రంగా వున్నా దాని స్థానా న్ని మత గ్రంథాలు ఆక్రమిస్తాయి.

కుంభమేళాలో ప్రకటించిన హిందూ రాష్ట్ర రాజ్యాంగం ప్రకారం హిందువులకు మాత్రమే ఓటు హక్కు, గురుకుల విద్యార్థులైన సనాతనులకు మాత్రమే పోటీచేసే హక్కు వుంటుందని, దీనికి మనుధర్మ శాస్త్రం, కౌటిల్యుని అర్థశాస్త్రం ఆధారాలని చేసిన ప్రకటన దీనికి అద్దం పడుతుంది. మతరాజ్యంలో పౌరులందరూ సమానం అన్న ప్రజాస్వామ్యం వుండదు. వివక్ష, విద్వేషం రాజ్యం చేస్తాయి.

పౌర హక్కులు, స్వేచ్ఛ మృగ్యం అవుతాయన్న స్పృహను పౌర సమాజానికి కలిగించాలి.

భావితరం కానున్న విద్యార్థులకు రాజ్యాంగ పీఠిక పఠనం పీఠిక ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలతో రాజ్యాంగ విలువలను అందించాలి.

మనదేశంలో రకరకాల శ్రమజీవులే అత్యధిక సంఖ్యలో ఓటర్లుగా వున్నారు. రాజకీయ పరిభాష లో వారు షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, ఇతర వెనుక పడిన కులాలు, మైనారిటీలు ఇతర పేదల రూపంలో కనిపిస్తారు. పాలక పార్టీల వాగ్దానాల చుట్టూ తిరుగుతూ లబ్ధిదారుల భావనతో వున్నారు.కాని

రాజ్యాంగం ప్రకారం వారు హక్కు దారులు. రాజ్యాంగం అందరికీ జీవించే హక్కును, ప్రాథమిక హక్కుగా ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గౌరవప్రదమైన జీవితం ప్రజల ప్రాథమిక హక్కు. అంటే నివాస వసతి, ఆహార భద్రత, వైద్య సేవలు, పిల్లలకు చదువు పాలకుల దయాదాక్షిణ్యాల మీద కాకుండా పొందడం రాజ్యాంగ హక్కు. ఇది జరగాలంటే మోదీ పాలనలతో షరీకై కార్పొరేట్లు దేశాన్ని దోచుకుని పోగుచేసుకున్న సంపదను పునఃపంపిణీ చెయ్యాలి. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు సంపద కేంద్రీకరణ జరగకూడదని, సహజవనరులు ప్రైవేటుపరం కాకూడదని ప్రకటించింది.

అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించే లక్ష్యాన్ని ప్రకటించింది.

ప్రముఖ ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం వివిధ పన్నుల ద్వారా ఏటా 15 లక్షలకోట్లు శ్రమజీవుల సంక్షేమానికి సమకూరతాయి. వారికి పై హక్కుల అందించడం తోపాటు పేదలకు కనీస ఆదాయ పథకం,. రైతులకు చట్ట బద్ధంగా మద్దతు ధరలు, యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి అందించవచ్చును.

సంపద పునఃపంపిణీ నినాదం అత్యధికులను ఆకర్షిస్తుంది. మోదీ హిందూత్వనీ దాని కుమ్మక్కుదారులైన కార్పొరేట్లను ఓడించ గల శక్తి అవుతుంది. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల రాజ్యాంగ దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించుకోవాలి.

# పెన్షనర్ల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

'సిఎం గారు నేను హాస్పిటల్‌లో ఉన్నాను, నా ఆరోగ్యం క్షీణిస్తోంది, రెండు కిడ్నీలు పాడయ్యాయి. హాస్పిటల్ బిల్లు కట్టడానికి పైసల్లేవు నా పెన్షనరీ బెనిఫిట్స్ ఇప్పించండి ...
(కుదుముల అంజయ్య, రిటైర్డ్ టీచర్, వికారాబాద్)

'రిటైరై ఎనిమిది నెలలైంది. ఇంటికోసం, జీవనం కోసం ప్రైవేటు ఫైనాన్స్ దగ్గర, తోటి ఉద్యోగుల దగ్గర అప్పుతీసుకున్న. రిటైర్మెంట్ బెనిఫిట్ డబ్బులు వస్తే వారికి చెల్లిద్దామనుకున్న, కానీ నేటికీ పైసా రాలేదు. అప్పులోళ్ళకు ముఖం చూపించలేక వేరే ఊర్లో తలదాచుకుంటున్న. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం చెల్లించకపోతే నాకు ఆత్మహత్యే శరణ్యం'
(A.SI సాధిక్ రిటైర్).

'కూతురు పెండ్లికి అప్పుచేశా. అప్పులకు వడ్డీ కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నా. నేను ప్రభుత్వం దగ్గర దాచుకున్న నా కష్టార్జితం డబ్బులు నాకు వెంటనే ఇవ్వాలి'
(రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ఎర్ర పరంధాములు)

ఇటీవలికాలంలో సామాజిక మాధ్యమాలలో, పత్రికలలో కన్పించిన వార్తలివి. ఇవి ఒక అంజ య్య, సాదిక్, పరంధాముల అరగోస కాదు రిటైరైన వేలాదిమంది ఉద్యోగ ఉపాధ్యాయుల ఆవేదన. సహజంగా రిటైర్మెంటు సభలో రిటైర్మెంటు ఉద్యోగానికి తప్ప దేహానికి కాదు. కాబట్టి రిటైరైన తరువాత కూడా మీరు ఉత్సాహంగా, చురుకుగా అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ సేవను కొనసాగించాల ని ఉద్యోగ విరమణ పొందిన వారికి ధైర్యం నూరి పోస్తూ ఉత్సాహం కల్పిస్తూ కొందరు వక్తలు మాట్లాడుతుంటారు. కానీ ప్రస్తుత కాలంలో రిటైరవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాత్రం ఉద్యోగ విరమణ ఆందోళన కలిగిస్తున్నది, ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నది. దానికి కారణం వారికి రిటైర్మెంటు బెనిఫిట్స్ అందకపోవడమే. మనవళ్ల తో, మనవరాళ్ళతో ఆడుతూ, పాడుతూ కాలం గడపాల్సిన సమయంలో వారు మానసికంగా కృంగిపోతూ, ఆందోళన చెందుతూ మాట్లాడిన మాటలు వింటుంటే ఈ ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగంతోపాటు ఆ ఉద్యోగి దేహానికి కూడా విరమణ కలిగిస్తుందెమో అనే పరిస్థితి దాపురించడం బాధాకరం. ఇలా వేడుకుంటూ వేడుకుంటూ పాపం కుదుముల అంజయ్య కీర్తిశేషులు అవ్వడం ప్రస్తుత పరిస్థితులు ప్రతిబింబిస్తున్నాయి.

మూడు, నాలుగు దశాబ్దాలపాటు ప్రభుత్వ ఉద్యోగిగా, ఉపాధ్యాయుడిగా ప్రజలకు, సమాజానికి సేవలందించిన వారు రిటైర్మెంటు తర్వాత అందవలసిన ఆర్థిక ప్రయోజనాల కొరకు కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగడం, అవి ఎప్పుడు అందుతాయో తెలియక అధికారులను, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులను అడుగడం నేడు నిత్యకృత్యమై పోయింది. ఉద్యోగ విరమణ చెందిన వారికి గ్రాట్యుటీ, జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రూపు ఇన్స్యూరెన్సు, ఈఎల్ నగదు, కమ్యూటేషన్, తదితర రూపేణా చెందవలసిన ఆర్థిక ప్రయోజనాల సొమ్మును ప్రభుత్వం ఏక మొత్తంలో వారికి చెల్లించాల్సి ఉంటుంది. అందుకొరకు ఉద్యోగి రిటైర్మెంటు గడువు సమీపిస్తున్న తరుణంలో వారికి సంబంధించిన అన్ని వివరాల ను సేకరించి వాటి ఆధారంగా రిటైర్మెంటు తరువాత ఒక వారం, పదిరోజులు లేక గరిష్టంగా నెల రోజుల వ్యవధిలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని ఆర్థిక ప్రయోజనాలను వారివారి ఖాతాలలో జమచేస్తూ ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రక్రియ సజావుగా జరిగేది. ఆ తరువాత ఉమ్మడి రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. మిగులు బడ్జెట్‌తో ధనిక రాష్ట్రంగా పేరుపొందిన తెలంగాణలో ఉద్యోగ విరమణ ఆర్థిక ప్రయోజనాలకు ఎటువంటి ఆటంకం ఉండదని, అవన్నీ సకాలంలో రిటైరైన ఉద్యోగికి లభిస్తాయని నాడు అందరూ సంబరపడ్డారు. నాటి పాలకుల మాట లు కూడా ఉద్యోగ ఉపాధ్యాయులకు భరోసా కలిగించాయి. కానీ ధనిక రాష్ట్రమైన తెలంగాణలో కూడా కాలక్రమేణ ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు అందించడంతో బాటు ఇతర ఆర్థిక ప్రయోజనాలు చెల్లించడం కష్టతరంగా మారింది.

ఆ పరిస్థితుల్లో నాడు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం రెండవదఫా అధికారం చేపట్టిన తరువాత



ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయస్సును జిఒ.45 ద్వారా 58ఏండ్ల నుండి 61 కి పెంచింది. ఆ పెంపుదల 2021లో జరిగింది. దాంతో ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు నాటి పాలకులకు జేజేలు పలికారు, పాలాభిషేకాలు చేశారు. కానీ ఆ పెంపుపై నాడు రకరకాల వాదనలు వినిపించాయి.

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ ఆర్థిక ప్రయోజనాలు చెల్లించేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వంవద్ద లేకపోవడంతోనే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పొడిగించినట్లు ప్రచా రం జరగడం గమనార్హం. ఆనాడు ఆ ప్రభుత్వ నిర్ణయంతో ఆగిపోయిన రిటైర్మెంట్లు 2024 మార్చి నెలలో ప్రారంభమైనాయి.

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక కార్యకలాపాలు, అప్పులు, వడ్డీలు లెక్కతేల్చి రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, గత ప్రభు త్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టడమే భారంగా మారిందని ప్రకటించింది. దాంతో రిటైర్మెంటు బెనిఫిట్సును అందించడం కష్టతరంగా మారింది. రిటైర్ అయ్యాక వచ్చే డబ్బును గురించి లెక్కలు వేసుకొని పిల్లల పెండ్లిళ్ళు, ఇంటి నిర్మాణం, తదితర అవసరాల కోసం ప్రణాళికలు రూపొందించుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రిటైరైన ఉద్యోగులకు న్యాయంగా అందాల్సిన బెనిఫిట్సు రావడం లేదు. ఆఖరుకు తమ జీతంలో నుండి తాము దాచుకున్న ఖాతాలోని సొమ్మును కూడా అందుకోలేని పరిస్థితిలో రిటైరు ఉద్యోగులున్నారు. తమకు ప్రభుత్వం తక్షణం పెన్షనరీ ప్రయోజనాలను అందజేస్తాం అని హామీ ఇస్తే మెజారిటీ ఉద్యోగ, ఉపాధ్యాయులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కూడా చేయడానికి సిద్ధంగా ఉన్నారు అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఉపముఖ్యమంత్రి గారు ఏప్రిల్ నుండి పెన్షనర్లకు నెలకు 500 కోట్లు విడుదల చేస్తామన్నారు. కానీ ఇంతవరకు ఐదు పైసలు కూడా విడుదల చేయలేదు. రిటైర్మెంటు ప్రయోజనాల కొరకు కొంతమంది హైకోర్టుకు వెళ్ళి సాధించుకున్నారు. ఆర్థికస్థితి బాగాలేని వారు కోర్టు ఫీజులు చెల్లించుకునే స్తోమత లేక ప్రభుత్వం తమ ఆర్థిక ప్రయోజనాల ను ఎప్పుడిస్తుందా? అని కన్నులు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. తెలంగాణలో వేలమంది రిటైర్డ్ ప్రభు త్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, వారి హక్కుల ఉల్లంఘనపై ఇటీవల ఒక సామాజిక కార్యకర్త జాతీ య మానవహక్కుల కమీషన్ను ఆశ్రయించారు. వివిధ జిల్లాల్లో పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, ర్యాలీ లు నిర్వహిస్తున్నారు. జనవరిలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన వారికి కూడా నేటికి ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడం శోచనీయం.

నిజమే, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ధనికరాష్ట్రం నేడు అప్పులకుప్పగా మారిపోయింది. వారి నిర్వాకం వల్ల ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నేటి ప్రభుత్వం మెడకు చుట్టుకొని వారిని నిస్సహాయులుగా చేయడం బాధాకరమైన విషయమే. అందువల్లనే ప్రస్తుత ప్రభుత్వానికి ఇబ్బంది లేనివిధంగా అందరికీ ఒకేసారి కాకున్నా ప్రతినెలా కొన్ని కోట్లు ప్రకటించి సీనియారిటీ ప్రాతిపదికన వరుసక్రమం లో రిటైర్మెంటు చెందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని బాధ్యత గల సంఘంగా స్టేట్ టీచర్స్ యూనియన్ డిమాండ్ చేస్తోంది. ఉద్యోగుల, పెన్షనర్ల అంశాన్ని ఇతర రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రచార అస్త్రంగా వాడుకొని ప్రభుత్వ వ్యతిరేకతకు ప్రయత్నించే అవకాశం వారికి ఇవ్వకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలని కోరుతున్నది. సుదీర్ఘ కాలం ప్రభుత్వ ఉద్యోగం వెలగబెట్టి అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వారధిగా వివిధ రకాల ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసిన తమకు ఇటువంటి దుస్థితి రావడం పట్ల పెన్షనర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోల్పోయిన ప్రాణాలకు బాధ్యులెవరని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టమైన హామీనిస్తూ ఇకముందు పోయే ప్రాణాలకు భరోసా కల్పించాలని పెన్షనర్లు కోరుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆశిద్దాం....

సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747

# మావోయిస్టు లొంగుబాట్లపట్ల మానవత్వ దృక్పథం



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

'సాయుధ పోరాటం ద్వారానే రాజ్యాధికారం సాధ్యం' అనే సిద్ధాంతాన్ని నమ్ముకొని పనిచేస్తున్న మావోయిస్టు పార్టీ తీవ్ర గడ్డ పరిస్థితులను ఎదుర్కొంటున్నది. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతుంది. వారి ఆదేశాల మేరకు బిజెపి పాలిత రాష్ట్రాలు దూకుడుగా వెళుతున్నాయి. ఇప్పటికే 'ఆపరేషన్ కగారు' పేరుతో గత ఆరు మాసాలలో 521 కి పైగా నక్సలైట్లను ఎన్కౌంటర్ పేరుతో హతమార్చారు. వేల మంది పారా మిలిటరీ స్పెషల్ పోలీస్ దళాలతో ఛత్తీస్‌ఘడ్‌లో దండకారణ్యంలోని నక్సలైట్ స్థావరాలను అణువణువునా గాలిస్తూ రాత్రింబవళ్లు కూబింగు నడిపిస్తున్నారు. వీరికి అధునాతనమైన ఆయుధాలతో పాటు, డ్రోన్ల ద్వారా సెన్సింగ్ కూబింగ్ ఆపరేషన్ చేపడుతున్నారు. 'ఆపరేషన్ కగార్'తో ఛత్తీస్‌ఘడ్ నుంచి కకావికలమైన మావోయిస్టులు చాలామంది లొంగిపోయారు. కొద్ది మంది మాత్రమే పోరాట పంథాలో కొనసాగుతున్నారు. వారు కూడా ఆత్మరక్షణ కొరకు ఇటీవల కాలంలో దండకారణ్యం నుండి తలదాచుకొనుటకు నిఘాలేని మైదాన ప్రాంతాలకు షెల్టర్సు మారుస్తున్నారు. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ లో సురక్షిత ప్రాంతాలకు వచ్చి షెల్టర్స్ పొందుతున్న వారి ఉనికిని పసిగట్టిన నిఘా పోలీసు ఒకే రోజున 50 మంది నక్సల్స్‌ను అరెస్టు చేయడం జరిగింది. మరి కొంతమంది లొంగిపోవడానికి సిద్ధమవుతున్నారనే వార్తలు వస్తున్నాయి.

మరోవైపు మావోయిస్టు ఉద్యమంలో నాలుగు దశాబ్దాలకు పైగా పనిచేస్తు ఉన్నత స్థానంలో ఉన్న నాయకులు మల్లోజుల వేణుగోపాలరావు, తక్కల్లపల్లి వాసుదేవరావు లాంటి కీలక నేతలు 'సాయుధ పోరాట పంథా' ను వీడి, ప్రభుత్వానికి ఆయుధాలు అప్పగించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీసుకు మల్లోజుల వేణుగోపాల్, ఛత్తీస్‌ఘడ్ డిజిపికి తక్కల్లపల్లి వాసుదేవరావు ఆయుధాలను అప్పగించారు. వీరితో పాటు దాదాపు 350 మంది దళసభ్యులు వారి నాయకత్వంలో సాయుధ పోరాటానికి స్వస్తి పలుకుతు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమక్షంలో ఇటీవల లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ ఆయుధాలను రాజ్యం చేతుల్లో పెట్టారు. దానికి బదులుగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి వారి చేతికి భారత రాజ్యాంగ ప్రతిని అందజేశారు.

మల్లోజుల వేణుగోపాల్ 45 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో పని చేశారు. కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరోలో 28 ఏండ్లుగా పనిచేస్తు వస్తున్నారు. పార్టీ ఎత్తుగడల తప్పిదమే సాయుధ పోరాటాన్ని దెబ్బతీసిందని, అందుకే పట్టున్న ప్రాంతాల్లో పార్టీ క్యాడరును కోల్పోతున్నామని మల్లోజుల వేణుగోపాల్ పేర్కొన్నారు. తన ఆవేదనను వినిపిస్తూ రెండు నెలల క్రితమే లేఖను విడుదల చేసినట్టు.. తాను రాసిన లేఖపై చర్చిస్తారని అనుకున్నానని, తప్పిదాలతో అనేక నష్టాలు, బలిదానాలు కావడానికి తాను కూడా ఓ కారణమేనని, అందుకే తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని తెలిపారు.' మా పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అమరుడు కావడానికి ముందు ఆయుధాలు విడిచిపెట్టి శాంతిచర్చలకు సిద్ధం కావాలని' ప్రతిపాదించారని తక్కల్లపల్లి తెలిపారు.

**పార్టీ విధానము–ఎత్తుగడలపై అంతర్గత చర్చలు:**

పార్టీ విధానము ఎత్తుగడలపై అంతర్గత చర్చలు రహస్యంగా జరుగుతున్నట్లు.. తమ ఉనికిని కాపాడుకొనుటకు పోరాట విరమణ ప్రకటించడమే ప్రస్తుతం మన ముందున్న మార్గమని చర్చలు సాగుతున్నాయని ఇటీవల లొంగుబాటు ప్రకటిస్తున్న దళ నాయకుల బట్టి తెలుస్తుంది.

సోను(మల్లోజుల), సతీష్ (తక్కల్లపల్లి) రాజకీయంగా దిగజారినారని, తమ పార్టీ పంథాను తప్పు పట్టే హక్కువారికి లేదని, వారిని విప్లవ ద్రోహులుగాను, అడవికి పట్టిన చెదగాను, ప్రాణభయంతో శత్రువుకి లొంగిపోయిన పిరికివాళ్లుగాను మావోయిస్టు శిబిరం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.'ప్రజల రక్త మాంసాలతో' చెమట చుక్కలతో సమకూర్చుకున్న ఆయుధాలను శత్రువుకు అప్పగించే అధికారం, హక్కు మీ కెక్కడిది? అని ప్రశ్నిస్తూ, వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించడమే కాకుండా, తగిన శిక్షలు విధించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు.

గతంలో చాలామంది పలు కారణాలవల్ల లొంగుబాటు మార్గాన్ని ఎంచుకున్నారు. కానీ, ఈసారి సైద్ధాంతిక విభేదాలతో బయటకు వస్తున్నారు. అది ఒకరిద్దరు వ్యక్తులుగా కాకుండా ప్రాంత కమిటీల వారిగా, బృందాల వారిగా ప్రభుత్వానికి ఆయుధాలను అప్పగిస్తున్నారు. అజ్ఞాత జీవితం వీడి బయటకు రావాలని ఇతర సహచరులకు పిలుపు ఇస్తున్నారు. ఈ పరిణామాన్ని సాధారణ లొంగుబాటుగానో, 'విప్లవ ద్రోహం' గానో పరిగణించటం, వారిని శత్రుపూరిత వైఖరితో నిందించటం సబబు కాదు. వీరంతా కొన్ని దశాబ్దాలుగా తాము నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, కష్టాలకు ఓర్చుకొని ప్రజల కోసం పనిచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ పంథాతో లాభం లేదనుకొని బయటకు వస్తున్నారు.

ఒకసారి రహస్య జీవితంలోకి, సాయుధ పోరాట మార్గంలోకి వెళ్లినవారు అమరులయ్యేదాకా అదే దారిలో వెళ్లాలని కోరుకోవడం సమర్థనీయం కాదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పేద ప్రజలకు అండగా.. అరాచక దోపిడీ వర్గాల నిర్మూలన కోసం సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకొని ఇంతకాలం రహస్యంగా పోరాటం చేస్తూ వచ్చాం. నేడు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలను సమీకరిస్తూ వారి సమస్యలపై ఉద్యమించుటకు.. ఉద్యమాలు చేపట్టుటకు కలిసి రావలసిన అవసరం ఉన్నది.

ఈ నేపథ్యంలో నేడు ఆయుధాన్ని వీడి రాజ్యాంగాన్ని చేతబూనుతున్నవారు చట్టబద్ధంగా ప్రజా సమస్యల పరిష్కార ఉద్యమాలను చేపట్టినా వాటికి ఫలితం ఉంటుందా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన మావోయిస్టు అప్పటి పీపుల్స్‌వార్ ఉద్యమం తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతుంది. వరుస ఎన్కౌంటర్లు..లొంగుబాట్లతో సతమతమవుతున్న పార్టీలో అగ్ర నేతలే ఉద్యమ పంథా వీడుతున్నారు. ఇన్నాళ్ల మావోయిస్టుల్ని అక్కున చేర్చుకున్న దండకారణ్యంలో మనలేని పరిస్థితులు నెలకొనడంతో అగ్రనేతలు ఆయుధాలను వీడుతున్నారు. ప్రస్తుతం పార్టీలో కీలకంగా ఉన్న మరి కొందరు సైతం ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తుంది. కొంతకాలంగా పార్టీకి ఎదురవుతున్న గడ్డు పరిస్థితుల నేపథ్యంలో ఉద్యమంలో పురోగమించే అవకాశం లేదని గ్రహించిన నేపథ్యంలోనే ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు మనకు కనిపిస్తుంది. ముఖ్యంగా అబూజ్ మడ్ గుండెకోట్ లో మే 21న పార్టీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ ఎన్కౌంటర్లో మృతి చెందిన అనంతరం శ్రేణులో తీవ్ర నిరాశ నెలకొంది. మరోవైపు ఈ ఏడాదిలోనే కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, బాలకృష్ణ, గణేష్, కట్ట రామచంద్ర రెడ్డి, కదారి సత్యనారాయణ రెడ్డి, హిడ్మా మృతి చెందడం, అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగు పోవడం, చంద్రన్న, బండి ప్రకాష్ అనారోగ్య కారణాలతో సాయుధ మార్గం వీడి జనజీవస్రవంతిలో కలవడం.. పార్టీకి కోలుకోలేని దెబ్బగా మారింది. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసేదేందుకు వస్తున్న మావోయిస్టు నక్సలైట్లు గ్రూపులను, వ్యక్తులను స్వాగతించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆ వైఖరి తీసుకోవాలి. ముఖ్యనేతలైనా సరే, లొంగుబాటుకు వ్యవధికోరితే వారికి ఆ అవకాశం ఇవ్వటం మానవత్వం – అలాకాకుండా బూటకపు ఎన్కౌంటర్లలో హతమార్చటం రాక్షసత్వం అవుతుంది.

## 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాపక్షం / జన్నారం :స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని బిసి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బిసి సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తూ ఆందోళన చేపట్టారు. ధర్నా కారణంగా లారీలు, బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు తక్షణమే



అమలు చేయకపోతే రాబోయే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: గడ్డం వివేక్

ప్రజాపక్షం / బెల్లంపల్లి :రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యేగడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. బెల్లంపల్లి మండల ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని వివరించారు. అనంతరం 30 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.5 కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. సబ్ కలెక్టర్ మనోజ్, ఎంపిడిఒ, ఐకెపి వివో లు,మాజీప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.



## మహిళల భద్రతే షీ టీం లక్ష్యం



ప్రజాపక్షం / తాండూరు:ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీం ప్రధాన ఉద్దేశమని బృందం సభ్యులు తెలిపారు. సోమవారం మండలంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలను వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు అసభ్యంగా ప్రవర్తించినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే షీ టీం నంబర్ డయల్ 100కు లేదా 6303923700కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు శ్రవణ్, జ్యోతి, దివ్య, ఎస్ఐ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



ప్రజాపక్షం /మందమర్రి:కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి, టిబిజికెఎస్, సిఐటియు జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన జెఎసి సమావేశంలో వారు మాట్లాడారు. జులై 9న దేశవ్యాప్తంగా సమ్మె చేసినా కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. దీనికి నిరసనగా 25న గనుల విభాగాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి, 26న సాయంత్రం నల్ల జెండాలతో ధర్నా నిర్వహించి మెమోరాండం సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ, మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, వీరారెడ్డి, అశోక్, మధుసూదన్, సారంగపాణి, సిఐటియు నాయకులు,ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్, పాల్గొన్నారు.

## పాఠశాలలో వేదికకు రేకులషెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/రామాయంపేట:మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేదికకు శాశ్వత ప్రాతిపదికన రేకులషెడ్డు నిర్మాణానికి సోమవారం శంఖుస్థాపన చేశారు. షెడ్డు నిర్మాణానికి సుమారు 45లక్షల ఖర్చు భరించడానికి అంగీకరించిన దాత విట్టల మదుసూదన్‌రావు ముందుకు వచ్చి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి ముస్కుల స్రవంతి సిద్దిరాంరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు శాశ్వత వేదికకు రేకులషెడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చి పనులు ప్రారంభించిన మదుసూదన్‌రావును అభినందించారు. దీంతో విద్యార్థులకు వేదిక సమస్య తీరుతుందన్నారు. మధుసూదన్‌రావు సేవలను గ్రామస్థులు అభినందించారు. గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జిపిని ముట్టడించిన కాలనీవాసులు



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎస్‌సి, బిసి కాలనీ వాసులు ముట్టడి చేశారు. గత 3నెలల నుండి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఖాళీ బిందెలు, బకెట్లతో ముట్టడి చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ రాజ్యశ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాజమున వచ్చి మిషన్ భగీరథ ఎఇను పిలిపించి నీటి సమస్యను 3 రోజులలో తీరుస్తామని తెలిపారు. అప్పటివరకు ట్యాంకర్‌తో నీటి సరఫరా చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. నీటి సమస్యను త్వరలో పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని కాలనీవాసులు హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మైలారం సుధాకర్,బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కె.నరేందర్, నాయకులు పాల్గొన్నారు

## ఆల్ఫోర్స్ విద్యార్థుల జయకేతనం




ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బి.ఎం.ఆర్.కరాటే డో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా నిర్వహించబడిన 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్2025 లో ఆల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనతో మెరిశారు.అత్యుత్తమ పోరాట పటిమను కనబరిచి మొత్తం ఆరు పతకాలను సాధించడం ద్వార ఈటెక్నొ స్కూల్ రాష్ట్ర స్థాయిలో తమ కీర్తి ప్రతిష్టలను పెంచింది. వారి కృషికి తగిన ఫలితంగా,కె.సమన్యు,ఎల్.వైభవ్‌రెడ్డి,ఎస్.విక్రాంత్ రెడ్డి ,ఎస్.విహాన్ మొత్తం నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. వీరితో పాటు,శివ శ్రేయ అద్భుతమైన పోరాటంతో వెండి పతకాన్ని సాధించగా,విష్ణు శ్రీ కూడా పోటీలలో తన ప్రతిభను చాటుకుంటూ రజత పతకాన్ని గెలుచుకుంది. విజేత విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ,ఈవిజయం వారిని మరింత ప్రోత్సహించి,భవిష్యత్తులో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలలో పాల్గొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను''అని అన్నారు.క్రీడల్లో విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ అందించడానికిఅవసరమైనఅన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇ చ్చారు.

## కోతలు లేకుండా మత్స్య సంపద పెంచాలి

### ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



ప్రజాపక్షం/బాల్కొండ:కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గంగపుత్రులకు ఎలాంటి కోతలు లేకుండా మత్స్య సంపద పంచి ఆర్థిక బలోపేతం కోస కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం బాల్కొండ మండలం నాగపూర్ శివారు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో సబ్సిడీ చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు ఉచిత చేప పిల్లలు, రొయ్యలు పంపిణీ చేసిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం చేపట్టిన అన్ని పథకాల్లో కాంగ్రెస్ కోతలు విధిస్తూ ప్రజలను తప్పుదోబ పట్టిస్తుందన్నారు. గతంలో నియోజకవర్గంలో రూ.3.70 కోట్లతో కోటి 74 లక్షల చేప పిల్లలు 68 లక్షల రొయ్యలతో క లిపి పదేళ్లలో 35 కోట్లతో ఉచిత చేపల సరఫరా చేవామని చెప్పారు. మత్స్యకారులకు రూ. 8 కోట్లతో మోపెడ్ వలలు, డీసీఎం వ్యాన్లు, మొబైల్ ఫిష్ మార్కెట వెహికిల్స్‌తో అనేక సౌకర్యాలు కల్పించామన్నారు. రూ.72 లక్షలతో 8 మత్స్య సహకార సంఘ భవనాలు రూ.10 లక్షల తో బాల్కొండలో ఫిష్ మార్కెట్ 19 కుటుంబాలకు రూ.77 లక్షల ఇన్సూరెన్స్ చెక్కులను అందజేవామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత యేడు కోటి 74 లక్షల చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉండగా 83 లక్షల చేపలు సరఫరా చేసి రొయ్యల పంపిణీ మరిచిందన్నారు. గత యేడాది కోత విధించిన చేప పిల్లలు కలిపి ఈ సారి పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్, పార్టీ లీడర్లు వెంకటొరెడ్డి, వెంకటేష్, నర్సారెడ్డి, మత్స్యకారులు పాల్గొన్నారు.

## ఎత్తిపోతల మోటర్లకు నిధులు

### ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి



ప్రజాపక్షం/నందిపేట్ : ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో ఎత్తిపోతల పథకాల కరెంటు మోటార్‌ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. నందిపేట్ మండలంలో ఆదివారం రూ. 12 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పథకాల మోటర్ల మరమ్మతు కొరకు రూ. 8.9 కోట్లు కావాలని రెండేళ్లుగా నీటిపారుదల శాఖ మంత్రిని కలుస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే నిజాంసాగర్ కాలువ మరమ్మతులకు తగినన్ని నిధులు ఇవ్వాలని మంత్రిని 28 సార్లు కలిశానని తెలిపారు. కేంద్ర రైల్వే మంత్రి నితిన్ గడ్కరీని నిజామాబాద్ ఎంపి ద్వారా కలిసి ఆర్మూర్ నుంచి జగిత్యాల్ వరకు రైల్వే లైన్ కొరకు 2500 కోట్లు మంజూరు చేశారని, టెండర్ కూడా అయిందన్నారు. ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్ వరకు లైన్ కోసం మంత్రి 6 వేల కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే చెప్పారు. పలు సమస్యలు పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తీసుకువచ్చారు

## క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన

### కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/నస్పూర్:ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జి ల్లా కార్యాలయాల భవనంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, ఆర్‌డిఒ శ్రీనివాస్ రావుతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాత మంచిర్యాలకు చెందిన అల్లి లచ్చయ్య తన భూమిలో ఉన్న వి ద్యుత్ స్తంభాలను తొలగించాలని, జైపూర్ మండలం నర్సింగాపూర్‌కు చెం దిన రైతు అనిల్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. లక్ష్మీ నగర్ కాలనీలో అనుమతి లేని నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, బిఎఎస్ సీట్ల కేటాయింపుపై విచారణ జరిపించాలని సిఐటియు నా యకులు దుంపల రంజిత్ కుమార్ వినతిపత్రాలు అందజేశారు. స్థానిక సం స్థల్లో బిసిలకు రిజర్వేషన్లు కేటాయించాలని బిజెపి నాయకులు నగునూరి వె ంకటేశ్వర్ గౌడ్ కోరారు. సంబంధిత అధికారులు పాల్గొన్నా రు.

**నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి**

జిల్లా కేంద్రంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం పాత మంచిర్యాలలోని మహిళా శక్తి భవన్, కాలేజీ రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. వైద్యరంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి పనులను గుత్తేదారులతో సమన్వయం చేసుకుని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కల్యాణ మంటపానికి రూ.20 లక్షలు మంజూరు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ పట్టణంలో ఇటీవల ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యుల అభినందన సభకు బిజెఎల్‌పినేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ము ందుగా,సంఘ సభ్యులు,నాయకులు కలిసి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కి బుధవార్ పేట్ చౌరస్తా నుండి నాయడివాడ వరకు భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు.అనంతరం,ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సభలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ,ఆర్యవైశ్య సంఘం ఎల్లపుడూ సామాజిక సేవలో ముందుంటుందని కొనియడారు.ఈ సందర్భంగా,నూతన కళ్యాణ మండపం నిర్మాణం కొరకు 20 లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.అదే విధంగా సంఘ సభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఎమ్మెల్యే కి శాలువాతో సత్కరించి,తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించినందుకు,కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్,జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్,ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్,నాయకులు మేడిసెమ్మ రాజు,జిల్లా బీజెవైయం అధ్యక్షుడు ఒడిసెల అర్జున్,పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి,తాజామాజీ కౌన్సిలర్ సారం అరవింద్,జుట్టు దినేష్,గిల్లి విజయ్ తో పాటు ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యులు,తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్:ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే లా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించా రు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీక్ష త కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదన పు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్ తో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జైనూర్ మండలం నాయక్ తండాకు చెందిన జాదవ్ సుజాత భూమి విరాసత్ చేయాలని, జిల్లా కేంద్రానికి చెందిన పెంద్రం సత్యవతి రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. దహేగాం మండలం లగ్గాంకు చెందిన కొండ్ర భాస్కర్ గౌడ్ గీత కార్మికుడి లైసెన్స్, తిర్యాణి మండలం చెలిమెల కోలాంగూడకు చెందిన గంగారం భూమి ఆక్రమణ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. జైనూర్‌కు చెందిన దుదనే శ్రీమంత, కాగజ్ నగర్‌కు చెందిన ఫర్వీన్ సుల్తానా, రెబ్బెన మం డలం జక్కులపల్లి గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సిర్పూర్ టి మండలానికి చెందిన మహమ్మద్ అమీనొద్దీన్ పెండింగ్ వేతనం ఇప్పించాలని కోరారు. గత ప్రజావాణి దరఖాస్తుల వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పరిశీలన

### అతి త్వరంలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు * ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి




ప్రజాపక్షం/పటాన్‌చెరు:పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఐడియా ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తయ్యాయని అతి త్వరలో ఆసుపత్రికి సంబంధించిన పూర్తి స్థాయి సామాగ్రి రాబోతుందనిపటాన్‌చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆసుపత్రి వైద్యులు టిజిఎంసిడిసివిభాగం అధికారులతో కలిసి ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 187 కోట్ల రూపాయలతో ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా చేయడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రి సివిల్ వర్క్ పూర్తి కావడం జరిగిందని ఆపరేషన్ థియేటర్ స్కానింగ్ మెషిన్లు ఇతర పరికరాల కోసం 23 కోట్ల 56 లక్షల రూపాయల నిధులు వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హాయాంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేతుల మీదుగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రిని ప్రారంభించేందకు సలహాలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్స్‌ఎండీసీ) ఆధ్వర్యంలో నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో వెలువడే కాలుష్యం మూలంగా వచ్చే వ్యాధులను గుర్తించి అందుకు అవసరమైన వైద్య విభాగాలను నిపుణులైన వైద్యులు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. దీంతో పాటు ప్రధానంగా పారిశ్రామిక వాడల్లో జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అందుకు అవసరమైన అత్యాధునిక శస్త్ర చికిత్స విభాగాలు సైతం ఇందులో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ ఎస్ షరీఫ్ ,ఇఇ రవీందర్‌రెడ్డి ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర ఆసుపత్రి సలహా సంఘం కమిటీ సభ్యుడు కంకర సీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నిజం చేసిన కాంగ్రెస్ సర్కార్

### కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి



ప్రజాపక్షం/శివ్వంపేట : సొంతింటి కలను కాంగ్రెస్ సర్కార్ నిజం చేసిందని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. ప్రభుత్వ సహాయంతో గోమారం గ్రామంలో నూతనంగా నిర్మితమైన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ కలలు గన్న పేదోడి సొంతింటి కలలను కాంగ్రెస్ సర్కార్ నిజం చేసిందని ఆయన తెలిపారు. గోమారం గ్రామానికి ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ వెంకటరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, మండల సీనియర్ నాయకులు లక్ష్మి కాంతరావు, పులిమామిడి నవీన్‌గుప్తా, హనుమన్నగారి నరేందర్‌రెడ్డి, భవన్నగారి శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి, కాముని శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, బుర్ర మురళీగౌడ్, పెద్దపులి సతీశ్ తదితరులు ఉన్నారు.

## పిసిసి అధ్యక్షుడిని కలిసిన డిసిసి అధ్యక్షుడు



ప్రజాపక్షం/నిజాంసాగర్:జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సూచన మేరకు పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ సోమవారం కలిశారు. హైదరాబాద్‌లోని మహేష్‌కుమార్ గౌడ్ కార్యాలయంలో కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ భవిష్యత్ కార్యక్రమాలపై ముఖ్యమైన సూచనలు చేశారు. పార్టీని జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి నుండే కేడర్ ఉత్సాహంగా పనిచేసేలా వారిని చైతన్యపర్చాలని సూచించారు.

## మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో మోసం

### ఇద్దరు నిందితుల అరెస్ట్ * ఎల్‌జి ఇండియా ఎంఎల్‌ఎం ద్వారా 150 మంది 75 లక్షల పెట్టుబడి



ప్రజాపక్షం/నిజామాబాద్ :మోసపూరిత యాప్‌లో తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందవచ్చని నమ్మిస్తే ప్రజలు ఆకర్షితులు కాకూడదని సీపీ సాయిచైతన్య సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీ కంట్రోల్‌హాల్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తూ రెంజల్ మండలంలోని షాటాపూర్‌కు చెందిన పిట్ల మధు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన దరఖాస్తు ప్రకారం సుమారు 3 నెలల క్రితం ముబారక్‌నగర్ వివినగర్ కాలనీకి చెందిన మేకల జగదీష్, షాటాపూర్‌కు చెందిన పెద్ద బోయిన భూమయ్య అలియాస్ ప్రేమ్ ఇద్దరు ఎల్‌జి ఇండియాకు సంబంధించిన యాప్‌లో 25500 జమ చేస్తే ఎల్‌జి ఇండియాకు సంబంధించిన వీడియోలు రోజుకు 16 చొప్పున చూస్తే ప్రతి వీడియోకు 55 వస్తాయని నమ్మించారని, అదేరోజు రూ.800 సంపాదించవచ్చని నమ్మించి ఈ కంపెనీలో డబ్బులు పెడితే కంపెనీ యాడ్స్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందవచ్చని లీడర్గా మారి ఇతరులను జాయిన్ చేస్తే దానికి గాను అదనంగా 8మందికి 4 వేల చొప్పున 15 మందికి 8 వేల చొప్పున డబ్బులు వస్తాయని ఆ శ చూపించగా బాధితుడు పిట్ల మధు నమ్మి పెట్టుబడి పెట్టారని తెలిపారు .అంతేగాకుండా ఏజెంట్లు మాయ మాటలు నమ్మి అతను అతని రక్త సంబంధీకులను తెలిసిన వ్యక్తులను ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టించాడని మొదట్లో ఇట్టి యాప్‌లో డబ్బులు వస్తున్నట్లు వాలెట్‌లో జమ అవుతున్నట్లు కనిపించటంతో కంపెనీని నమ్మి ప్రేమ్, జగదీష్ దాదాపు ఒక 150 వ్యక్తులను నమ్మించి పెట్టుబడి పెట్టించారని తెలిపారు. వాలెట్‌లో ఉన్న డబ్బులు తమ స్వంత ఖాతాలకు మార్చుకుని డబ్బులు వస్తాయని అనుకోగా ఆ అకౌంట్లలోని జమ అయిన ఫేక్ అమౌంట్ విత్ డ్రా చేయడానికి ప్రయత్నించగా విత్‌డ్రా కాలేదని ఈ ఖాతాలన్ని కూడా ఫ్రిజ్ అయినట్లు తెలుసుకుని మోసపోవడమే కాకుండా ఇతరులు కూడా మోసపోయారని తెలుసుకుని ఏజెంట్లను అడగగా కంపెనీ ఆపరేట్ ముంబైలో జరుగుతుందని కంపెనీ చీఫ్ రాజుతో మాట్లాడుతున్నామని త్వరలోనే మీ డబ్బులు మీకు వస్తాయని నమ్మించినట్లు తెలిపారన్నారు. ఎట్టకేలకు మోసపోయామని తెలుసుకుని రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేశామన్నారు. షాటాపూర్ గ్రామానికి చెందిన 150 మందిని మోసం చేసినట్లు తెలిసిందని, డబ్బు విలువ సుమారు 75 లక్షల వరకు ఉంటుందని వెంటనే దర్యాప్తు చేపట్టామన్నారు. ఏజెంట్లు మేకల జగదీష్, భూమయ్య అలియాస్ ప్రేమ్ లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని ముంబాయికి సంబంధించిన రాజును కూడా త్వరలో పట్టుకుంటామని సీపీ తెలిపారు. మల్టీ లెవల్ మార్కెటింగ్ చైన్ సిస్టంలో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో లాభాలు పొందాలనే ఉద్దేశ్యంతో ప్రజలు పెట్టుబడులు పెట్టకూడదని మోసపూరిత మాటలకు ఆకర్షితులు కావద్దని తెలిపారు. కంపెనీ పేర్లతో పెట్టుబడి పెట్టాలని చెబితే లోకల్ పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని కోరుతున్నామన్నారు.

## ప్లాస్టిక్ నివారణకు నగరంలో స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారణ చర్యల్లో భాగంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు సోమవారం నగరంలో సానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని టవర్‌సర్కిల్‌లో పలు షాపుల్లో తనిఖీలు చేశారు. పెద్దమొత్తంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దొరకడంతో సంబంధిత షాపుకు 17 వేల రూపాయలు జరిమాన విధించి ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ నివారణ స్పెషల్ డ్రైవ్‌లో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు స్వామి, రమేష్, పారిశుద్ధ్య , డిఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



## కూలిన చెక్‌డ్యాం పరిశీలించిన కలెక్టర్, సిపి

**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని శంబునిపల్లి, పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామాల మధ్య గల మానేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యమ్ కూలిపోగా సోమవారం చెక్ డ్యామ్‌ను కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌష్ ఆలం, అధికారులు పరిశీలించారు. పలుకోణాల్లో దర్యాప్తు చేసిన అధికారులు ఎలా జరిగింది అనే కోణంలో పలువురిని అడిగి తెలుసుకున్నారు. ఇసుక మాఫియా ఈ పని చేసిందని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



## ఎమ్మెల్యే ఇందిరమ్మ చీరల పంపిణీ

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం కోనాపూర్, పెంబట్ల గ్రామంలో ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు రూ.13లక్షల 80వేలతో, కోనాపూర్ గ్రామంలో ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు రూ.13లక్షల 80వేలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, కోనాపూర్ గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి, మండలానికి చెందిన 10మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన 10లక్షల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేసి, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పౌర సేవల బోర్డును అనంతరం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. పల్లె దవాఖానాతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, రాష్ట్రంలో మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ రేవంత్, ఎంపిడిఒ సలీం, ఎమ్మార్వో వహీదుద్దీన్, డిఈ మిలింద్, ఎస్‌ఐ గీత, పాక్స్ చైర్మన్ మల్లారెడ్డి, ఎపిఎం చంద్రకళ, ఎఇ రాజమల్లయ్య, కార్యదర్శి నరేష్, మాజీ ఎంపిపి కోల జమున శ్రీనివాస్, మాజీ సర్పంచులు శేఖర్ గౌడ్, గుర్రాల రాజేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి సొల్లు సురేందర్, మాజీ ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు సుధాకర్ రావు, మండల, గ్రామ నాయకులు, అధికారులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ దావాఖానాల్లో కుక్కకాటు సూది లేకుంటే ఏలా?

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.



**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** ప్రభుత్వ దావాఖానల్లో కనీస కుక్కకాటుకు సూది మందు లేకపోతే దావఖాలు ఎందుకని ఇక నుండి ప్రభుత్వ దావాఖాల్లో మందులు లేవు అనడం పేదలు ఇబ్బందులు పడవద్దని మీకు ఏమి కావాలన్న నా దృష్టికి తీసుకురావాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వైద్య అధికారులను కోరారు. సోమవారం హుస్నాబాద్ ప్రభుత్వ అసుపత్రికి గత వారం రోజుల క్రితం కోటి రూపాయల మెడికల్ పరికరాలను అందించారు వాటిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసుపత్రిలోని అన్ని వార్డుల్లో తిరిగి పేసేంట్లను పలకరిస్తు వారి మంచి చేడులను య అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో అసుపత్రికి కావాలసి పరికారాలు, ఉన్న సమస్యలున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నా పార్లమెంటు పరిధిలోని కరీంనగర్, వేములావాడ, హుజురాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ప్రభుత్వం అసుపత్రుల్లో గతంలో రూ.3 కోట్లు ఒకసారి, 4 కోట్లు మరో మారు నేడు హుస్నాబాద్‌కు మరో కోటి రూపాయల వైద్యపరికారాలను అందించామని అన్నారు. ప్రభుత్వాలు కోట్లా రూపాయలు ఖర్చు పెట్టి అన్ని రకాల సౌకర్యలు ఏర్పటు చేస్తే పేదవాడు ప్రభుత్వ దావాఖానకు వస్తే కనీసం కుక్క కాటు మందు లేదు దూది లేదు సరైన మందులు లేవనడం ఇకనుంచి అలాంటి మాట రావద్దని వైద్యాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి రమేశ రెడ్డి, ఆర్‌డిఒ రాంమూర్తి, తహసీల్దార్, లక్ష్మ రెడ్డి, బిజెపి నాయకులు రాంగోపాల్‌రెడ్డి దోడ్డి శ్రీనివాస్, బత్తుల శంకర్‌బాబు, లక్కిరెడడి తిరుమలరెడడి , రాంగొపాల్‌రావు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ చీరలు : మద్దెల



**ప్రజాపక్షం/ముత్తారం :** మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ చీరలు అని కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తోపాటు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి మహిళా సోదరీమణుల ఆత్మ గౌరవం ప్రతిబింబించేలా ఇందిరమ్మ చీరలను రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకోజు అశోక్ చారి, అనవేన తిరుపతి, లక్కం రాజు, కుమార్ గౌడ్, తోపాటు తదితరులున్నారు.అలాగే మండలంలోని ఓడేడు, ముత్తారం, ఖమ్మంపల్లి,పారుపల్లి, మచ్చుపేట, సీతంపల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో ఇందిరమ్మ చీరలను ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

## మత్తు పదార్థాలకు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి : రజిత




**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం చైల్డ్ లైన్ అధికారి రజిత మాట్లాడుతూ అమ్మాయిలకు 18 సంవత్సరాలు అబ్బాయిలకు 21 సంవత్సరాల లోపు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలకు పాల్పడినట్లయితే జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా ఉంటుందని సూచించారు. బాల్య వివాహాల వల్ల పిల్లలకు భవిష్యత్తులో మానసిక శారీరక ఎదుగుదల ఆగిపోతుందని పిల్లలు మత్తు పదార్థాలకు మొబైల్ ఫోన్లో వాడకానికి దూరంగా ఉండాలని తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాల బాలికల రక్షణకు అవసరమైన1098 చైల్డ్ హెల్ప్ లైన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్యవివాహాలు లేని భారతదేశ కోసం ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి సాధన పిర్దోస్, అంగన్వాడి టీచర్ జ్యోతి గ్రామంలోని మహిళలు, తదితరులు ఉన్నారు.

# మహిళా సంక్షేమానికే ప్రాధాన్యం

### ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని స్వరూప గార్డెన్స్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు రవాణా కల్పిస్తే ప్రతిపక్షాలు తట్టుకోలేక పోతున్నాయని, దీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వీరికి జూబ్లీహిల్స్ మహిళలు కర్రుకాల్చి వాత పెట్టారని మంత్రి తెలిపారు. గత 10 సంవత్సరాల పాలనలో ఎప్పుడైనా వడ్డీలేని రుణాలు అందించాలని ఆలోచన పాలకులకు రాలేదని, మన ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజ్ ద్వారా వడ్డీ లేకుండా మహిళా సంఘాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో మొదటి ఏడాది వడ్డీ లేని రుణాలు కింద 9 కోట్ల రూపాయలు విడుదల చేసామని, ప్రస్తుత సంవత్సరం మరో 10 కోట్ల రూపాయలు విడుదల చేయబోతున్నామని అన్నారు. రాష్ట్రంలోనే మహిళలకు సారేఅందించాలని లక్ష్యంతో నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరికి చీరలు పంపిణీ చేస్తామన్నారు. పట్టణ ప్రాంతంలోని మహిళలకు వచ్చే సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా చీరలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం 2 లక్షల రూపాయల పంట రుణమాఫీ, ఎకరానికి 12 ,000 పెట్టుబడి సహాయం, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 రూపాయల బోనస్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బాగు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షల రూపాయల పెంచామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామని, రాబోయే 2 సంవత్సరాల కాలంలో ప్రతి పాఠశాల రూపురేఖలు పూర్తిస్థాయిలో మారుస్తామని అన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెద్దపల్లిలో టాస్క్ రీజినల్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో సిటి స్కాన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజల సంక్షేమానికి పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు తమ ఆశీర్వాదం అందించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ చీరల పంపిణీ మొదటి విడత గ్రామీణ ప్రాంతాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల సిసిలు , విఓ లు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేసి చీర అందుకున్న ప్రతి మహిళ ఫోటో యాప్ లో నమోదు చేయాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొదటి విడత కింద లక్షా 20 వేల ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట నాసిరకం చీరలు పంపిణీ చేసి మహిళలను అగౌరవ పరిచారని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి మంచి డిజైన్ తో నాణ్యమైన చీరలను మహిళలకు అందిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మ హిళకు నాణ్యమైన చీరను రేవంతన్న ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రతి మహిళ మరో 10 మందికి ఉపాధి అందించే స్థాయికి ఎదిగే దిశగా సహకారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులు, యువత, కార్మికులు, మహిళల సంక్షేమమే అభ్యున్నతిగా ప్రభుత్వం పనిచేస్తుందని అ న్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, ఆర్.డి.ఓ.గంగయ్య, గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని,తహసీల్దార్, ఎంపిడిఓ,స ంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వంపై భగ్గుమన్న సింగరేణి కార్మికులు

### కార్మికుల హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం 29కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తూ శనివారం దేశవ్యాప్తంగా అమలులోకి తెస్తున్నట్టు ప్రకటన విడుదల చేయడం పట్ల గుర్తింపు సంఘం ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాలు మారుస్తూ కార్మికులకు అందాల్సిన అలవెన్సులు, ప్లేడేలు తదితర సౌకర్యాలను కాలరాస్తు పెట్టుబడిదారులకు అనుకూలంగా 12 గంటలకుపైగా పని చేయ్యాలని కార్మికుల మీద లేబర్ కోడ్‌ల రూపంలో పని గంటల ఒత్తిడి తీసుకొస్తున్న బిజెపి ప్రభుత్వ తీరు పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం యూనియన్ పిలుపు మేరకు గనులు, డిపార్ట్మెంట్‌లలో పిట్ కమిటీల ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. దేశంలో దశాబ్దాల క్రితం అనేక పోరాటాలు చేసి సాధించిన హక్కులను కాలరాసేలా బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు అమలులోకి తెస్తున్నదని దీని వల్ల కార్మికులు అనేక హక్కులు కోల్పోనున్నారని వారు తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మార్చి తెస్తున్నందు వల్ల దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోనున్నారని వారు తెలిపారు. సమ్మె హక్కు కోల్పోవడం, గ్రాట్యుటీ చట్టం, బోనస్ చట్టం, అలవెన్సులు వంటి అనేక హక్కులు కోల్పోతారని కాబట్టి నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసి పాత చట్టాలనే కొనసాగించాలని లేని పక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని జెఎసిగా ఐక్య వేదిక ఏర్పాటు చేసుకుని పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు మాదన మహేష్, రంగు శ్రీను, బోగె సతీష్ బాబు, మానాల శ్రీనివాస్, ఉప్పులేటి తిరుపతి, వినయ్ కుమార్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, అజీం పాషా, గుర్రం ప్రభుదాస్,చంద తిరుపతి, భక్తి శ్రీనివాస్, నాయిని శంకర్, గొడిశెల నరేశ్, దొంత సాయన్న, బండి మల్లేష్, బి.సమ్మయ్య, దాసరి శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలి

### గన్నేరువరంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తాచాటాలని పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గన్నేరువరం మండలంలోని హన్మాజిపల్లి గ్రామంలో మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం ఆధ్వర్యంలో సిపిఐ కార్యకర్తల సమావేశం జరిగింది. పాల్గొన్న పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో సిపిఐ ఒంటరిగా బరిలోకి దిగుతుందని పేర్కొన్నారు. గన్నేరువరం మండలంలోని అన్ని గ్రామాల్లో వార్డు మెంబర్ నుంచి సర్పంచ్‌లదాకా సిపిఐ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేది సిపిఐ మాత్రమేనని, ప్రజలకు ఎర్ర జెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రజలకు చేరవేసి చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల అంజిరెడ్డి, మండల సహాయ కార్యదర్శులు కూనమల్లయ్య, పిప్పల కనకయ్య, గన్నేరువరం కార్యదర్శి బోయిని మల్లయ్య, గుండ్లపల్లి గ్రామ కార్యదర్శి బోయిని తిరుపతి, జంగపల్లి కార్యదర్శి కోతి సంపత్, కొండాపూర్ కార్యదర్శి కూన కిష్టయ్య, దాసరి చంద్రయ్య, ఎండి నయూమ్, బొమ్మకంటి అంజయ్యచారి, రాజమల్లు, సంపత్ భాస్కర్ పాల్గొన్నారు.

## చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా చేస్తా : ఎమ్మెల్యే సత్యం



**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా చొప్పదండి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి వెదురుగట్ట గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్య గౌడ్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ముద్దం తిరుపతి గౌడ్, గుర్రం రమేష్, కడారి శంకర్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మునిగాల చందు తదితరులున్నారు.

## కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోళ్లు

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లను ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మంత్రి లక్ష్మ ణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సివిల్ సప్లై అధికారులు ఎప్పటికప్పుడు కేంద్రాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే సన్న వడ్ల కొనుగోలు జరపడంతోపాటు ప్రభుత్వం బోనస్ అందజేస్తుందని మంత్రి చెప్పారు. రైతులెవరూ మిల్లర్లతో మాట్లాడుకోవాల్సిన అవసరం లేదని, మిల్లర్లతో మాట్లాడే బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. రైతు ప్రయోజనాల కోసం ప్రభుత్వం అండగా ఉంటుందని, కేంద్రాల వద్ద ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని అండగా తాను ఉంటానని మంత్రి లక్ష్మ ణ్ కుమార్ రైతులనుద్దేశించి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మార్కెట్ కమిటీ అధ్యక్షులు చిలుముల లావణ్య, డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు ఎస్. దినేష్, వేముల రాజేశ్, చిలుముల లక్ష్మ ణ్,కుంట సుధాకర్, బాలా గౌడ్, జాజాల రమేష్, రెడ్డవేణి సత్యం, శేర్ల రాజేశం, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిపారుదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### టిఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** నీటి పారుదల శాఖ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టిఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. పెండింగ్ పదోన్నతులు. బదిలీల ప్రభావం. బిల్లుల క్లియరెన్స్‌పై వెంటనే చర్యలు తీసుకుంటామని జగదీశ్వర్ హామీనిచ్చారు. సోమవారం సిద్దిపేటలో జరిగిన టిఎన్‌జిఓ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పల్లగుట్టలోని నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శాఖలో నెలకొన్న సమస్యలను సమగ్రంగా పరిశీలించి సంబధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం టిఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ మాట్లాడుతూ 2021లో జరిగిన రీ ఆర్గనైజేషన్ కారణంగా అనేక మంది జూనియర్ అసిస్టేంట్లు ఇతర జిల్లాలకు బదిలీ కావటంతో వారికి గణనీయమైన నష్టం కలిగిందన్నారు. గజ్వేల్ యూనిట్‌లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు వెంటనే అమలు చేయాలని అధికారులు తక్షణచర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. పదోన్నతులు నిలిచిపోయినందున ఉద్యోగులు ఎదుర్కోంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పిఎఫ్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు సమర్పించినట్లు అవి వేగంగా క్లియర్ కావటానికి సంఘం పక్షాన ఫాలో ఆప్ జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంబంధించిన ఫెస్టివల్ అడ్వాన్స్‌లు, టిజిఎల్ వంటి లోన్స్ అడ్వాన్స్‌ల త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. ఉద్యోగుల్లో క్రమశిక్షణ, సంఘం కట్టుబాటు చాల ముఖ్యమన్నారు.ఈ సమావేశంలో జిల్లా టిఎన్‌జిఓ రాష్ట్రకార్యదర్శి కోమాండ్ల విక్రమ్‌రెడ్డి. నీటిపారుదల శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టాలి: హైమావతి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** జిల్లాలో అతి త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను సంబంధిత అధికారులు ఇప్పటి నుండే పూర్తి స్థాయిలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం ఉదయం ఐడిఓసి ప్రధాన సమావేశమందిరంలో జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలసి జిల్లాలో అన్ని శాఖల అధికారులకు పలు సూచనలు చేశారుస ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాల కోసం ఇప్పటికే కేటాయించిన స్థలాల్లో పనులకు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడుత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వెంటనే ప్రారంభించి, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో నాలుగు రోజుల్లో ఆకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నేపథ్యంలో వర్షాల ప్రభావం వల్ల పంటలు నష్టపోకుండ జాగ్రత్తలు తీసుకునే విధంగా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు చేరుతున్న ధాన్యం తడవకుండ ఉండేందుకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ అందుబాటులో ఉన్నాయో లేదో ప్రత్యేకంగా పరిశీలించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను కోరారు.

## మండల స్థాయి చెకుముకి పోటీలలో ఆల్ఫోర్స్‌కు ప్రథమస్థానం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీలలో ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. జిల్లాస్థాయిలోనూ అత్యుత్తమంగా రాణిస్తూ పలు పోటీలలో విజయం సాధించడం చాలా గొప్ప విషయమని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు సిద్ధం కావాలని, విశ్లేషణాత్మకంగా, సముచితంగా తెలియపరచాలని చెప్పారు. మండలస్థాయిలో గెలుపొందిన వారిలో ఒంటెల శివస్మరణ్ రెడ్డి (8వ), ఎస్,రిశాల్(9వ), కె.ఓం కార్తికేయ(10వ) లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.



# క్రీడ





# భారత్ 201 ఆలౌట్

## భారీ ఆధిక్యంలో దక్షిణాఫ్రికా.. మూడో రోజు ముగిసిన ఆట

భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా పూర్తిగా పట్టుబిగించింది. ఇటు బంతితో, అటు బ్యాట్‌తో విఫలమైన టీమ్ఇండియా ఈ మ్యాచ్‌లో గెలుపు ఆశలను దాదాపు వదులుకున్నట్లే! ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉన్నందున ఇప్పటికైనా గట్టిగా పోరాడితే మ్యాచ్‌ను డ్రాగా ముగించడానికి అవకాశముంది.

9/0తో మూడో రోజు ఆటను ప్రారంభించిన భారత్.. 201 పరుగులకే ఆలౌటైంది. సఫారీ పేసర్ మార్కో యాన్సెన్ (6/48) విజృంభించాడు. 288 పరుగులు వెనుకబడిన భారత్‌ను 'ఫాలోఆన్' ఆడించడానికి అవకాశం ఉన్నా సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ఆడటానికి మొగ్గ చూపింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 26/0 స్కోరుతో నిలిచింది. రికెల్టన్ (13*), మార్క్రమ్ (12*) క్రీజులో ఉన్నారు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మార్క్రమ్‌కు లైఫ్ దొరికింది. సెకెండ్ స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ అతను ఇచ్చిన కాస్త కష్టతరమైన క్యాచ్‌ను అందుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించినా విఫలమయ్యాడు. దక్షిణాఫ్రికా ప్రస్తుతం 314 పరుగుల ఆధిక్యంలో ఉంది.

భారత్ టాప్–7 బ్యాటర్లలో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (58; 97 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే రాణించాడు. ఒకదశలో 95/1తో మెరుగైన స్థితిలో కనిపించిన భారత్.. తర్వాత అనూహ్యంగా వికెట్లు చేజార్చుకుని 122/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కేఎల్ రాహుల్ (22), సాయి సుదర్శన్ (15) విఫలమయ్యారు. ధ్రువ్ జురెల్ (0), రిషభ్ పంత్ (7), రవీంద్ర జడేజా (6), నితీశ్ కుమార్ రెడ్డి (10) ఘోరంగా నిరాశపర్చారు. ఈ క్రమంలో వాషింగ్టన్ సుందర్ (48; 92 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), కుల్‌దీప్ యాదవ్ (19; 134 బంతుల్లో) పోరాడారు. ఈ జోడీ ఎనిమిదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం (208 బంతుల్లో) నెలకొల్పింది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ (6/48) భారత్‌ను దెబ్బకొట్టాడు. సైమన్ హార్మర్ 3, కేశవ్ మహరాజ్ ఒక వికెట్ తీశారు.

# స్మృతి పెళ్లి వాయిదా..

## ఇన్‌స్టాలో పోస్టులు డిలీట్!

భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన వివాహం చివరి నిమిషంలో వాయిదా పడిన సంగతి తెలిసిందే. పెళ్లి వేడుకలు జరుగుతుండగా.. స్మృతి తండ్రి అనారోగ్యానికి గురవడంతో వివాహ సంబరాలను నిలిపివేశారు. అయితే, తాజాగా ఆమె ఇన్‌స్టా ఖాతాలో పెళ్లికి సంబంధించిన పోస్టులు కన్పించకపోవడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది.

తన స్నేహితుడు, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్‌తో ఎంగేజ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ ఇటీవల స్మృతి మంధాన తన ఇన్‌స్టాలో ఓ వీడియోను షేర్ చేసిన సంగతి తెలిసిందే. సహచర క్రికెటర్లతో కలిసి 'సమ్‌జో హో హి గయా' బాలీవుడ్ సాంగ్‌కు స్మృతి మంధాన డ్యాన్స్ చేసింది. ఈ సందర్భంగా తన



వేలికి ఎంగేజ్‌మెంట్ రింగ్ ఉందంటూ చూపించింది. ప్రస్తుతం ఈ వీడియో ఆమె ఇన్‌స్టాలో కన్పించకపోవడంతో నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇక, ఇదే వీడియోను స్మృతి స్నేహితురాళ్లు జెమీమా, శ్రేయాంక కూడా సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడం గమనార్హం. వాస్తవానికి స్మృతిపలాశ్ వివాహం నవంబరు 23 బెంగళూరు వేదికగా జరగాల్సి ఉంది. అయితే, వివాహ వేడుకల్లో పాల్గొంటుండగా స్మృతి తండ్రి అనారోగ్యానికి గురవడంతో వెంటనే ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి పరిస్థితుల్లో తనకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని, అందుకే పెళ్లిని వాయిదా వేయాలని స్మృతి నిర్ణయం తీసుకున్నట్లు ఆమె మేనేజర్ ప్రకటించారు. ఇదిలా ఉండగా.. పలాశ్ కూడా అనారోగ్యానికి గురయ్యారు. ఇన్ఫెక్షన్, ఎసిడిటీతో బాధపడటంతో ఆసుపత్రిలో చేరిన అతడు చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు.

# కుర్రాడిలా..

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ కుర్రాడిని తలపిస్తున్నాడు. మైదానంలో దిగితే గోల్స్ పండగే అన్నట్లుగా ఆడుతున్నాడీ సాకర్ వెటరన్. నలభై ఏళ్ల వయసులో అతడు చిరుతలా గోల్స్ వర్షం కురిపిస్తున్నాడు. సౌదీ అరేబియా క్లబ్ అల్ నస్రీ తరఫున చెలరేగిపోతున్న రొనాల్డో తాజాగా కళ్లు చెదిరే బైస్కిల్ కిక్ కొట్టాడు. సహచరుడు ఫార్వర్డ్ చేసిన బంతిని గాల్లోకి లేచి కుడికాలితో అమాంతం ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. ప్రస్తుతం అతడి సూపర్ గోల్ ఇంటర్నెట్‌లో వైరలవుతోంది. మూడేళ్ల క్రితం ఫిఫా వరల్డ్ కప్ తర్వాత అల్ నస్రీకి మారిన రొనాల్డో ఆ క్లబ్ గెలుపు గుర్రంగా అవతరించాడు. సౌదీ క్లబ్ విజయాల్లో కీలకం అవుతున్న ఈ ఫార్వర్డ్ ఆటగాడు.. నవంబర్ 23 ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మరోసారి తన మ్యాజిక్ చూపించాడు. రియాద్ వేదికగా 'అల్ అవ్వాల్' జట్టు డిఫెన్స్‌ను ఛేదించిన రొనాల్డో.. బైస్కిల్ కిక్ కొట్టాడు. అనంతరం తనదైన స్టయిల్లో సెలబ్రేట్ చేసుకున్నాడీ స్టార్ ప్లేయర్. అతడలా గోల్ చేయడంతో స్టాండ్స్‌లోని అభిమానులు ఉర్రూతలూగిపోయారు. టీవీ ప్రజెంటర్ అయితే ఆ బైస్కిల్ గోల్‌కు ఫిదా అయిపోయాడు.



ఈ రోజు రాత్రి ఇంతకంటే గొప్ప విషయం మరొకటి ఉండదు. నా సహచరుడు రొనాల్డో మరో అద్భుతమైన బైస్కిల్ కిక్ సాధించాడు. అతడికి ఇప్పుడు 40. ఈ వయసులో కుర్రాడిలా రొనాల్డో చేసిన గోల్ నమ్మశక్యం కాదు అని పియెర్స్ మోర్గాన్ అన్నాడు. రొనాల్డో చేసిన ఈ గోల్ వచ్చే ఏడాది ఫిఫా పుస్కాస్ అవార్డుకు నామినేట్ అయ్యే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు. ఈ బైస్కిల్ గోల్‌తో రొనాల్డో వెయ్యి క్లబ్‌కు చేరువయ్యాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 954 గోల్స్ ఉన్నాయి. ఇప్పటికే ఐదుసార్లు 'బాలన్ డీ ఓర్' అవార్డులు అందుకున్న ఈ దిగ్గజం.. వచ్చే ఏడాది ఫిఫా వరల్డ్ కప్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు.

# ఫోకస్ యువతరంగం




## గొప్ప అవకాశం యువ ఎఐ

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో, ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ ప్రారంభించిన కృత్రిమ మేధస్సు (ఎఐ) కోర్సు యువతకు ఎంతో ఉపయోగకరం. 'యువ ఎఐ ఫర్ ఆల్' పేరుతో ప్రారంభమైన ఈ కోర్సు పూర్తిగా ఉచితం. 'ఇండియన్ ఎఐ మిషన్'లో ఒక భాగం. దేశంలో సుమారు 1 కోటి మందికి ఎఐలో ప్రాథమిక జ్ఞానం (బేసిక్ స్కిల్స్) ఇవ్వడమే ఈ కోర్సు లక్ష్యం. ఈ కోర్సు నిడివి సుమారు 4.5 గంటలు. సులభ భాషలో, మన దేశానికి అనువైన ఉదాహరణలతో నేర్పిస్తారు. ఇందులో, ఎఐ అంటే ఏమిటి, అది ఎలా పని చేస్తుంది, విద్య, సృజనాత్మకత, వృత్తుల్లో ఎఐ ప్రభావం, భద్రతగా, బాధ్యతతో ఎఐ టూల్స్ వాడటం, భారతదేశంలో ఎఐ వాస్తవ వినియోగాలు, భవిష్యత్‌లో ఎఐ అవకాశాలు ఏ విధంగా ఉంటాయి వంటి ఆరు చిన్న మాడ్యూల్స్ ఇందులో ఉన్నాయి. ఈ కోర్సుకు ఎలాంటి ఫీజులు వసూలు చేయరు. కోర్సు పూర్తయిన తర్వాత భారత ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ కూడా లభిస్తుంది. కాగా ఈ కోర్సును 'ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్' (FutureSkills Prime), ఐగాట్ కర్మయోగి (iGOT Karmayogi) ఇతర పెద్ద ఎడ్యుకేషనల్ టెక్ (ఎడిటెక్) వేదికలు అందిస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు అనే తేడాలు లేకుండా, ఎఐ విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంలో ఈ కోర్సు కీలక భూమిక పోషిస్తుంది. ఎక్కువ మంది యువతకు, సాధారణ పౌరులకు కూడా టెక్నాలజీసాక్షరత ఇవ్వడానికి ఇది ఉపయోగపడుతుంది. ఎఐని ఎలా సురక్షితంగా, బాధ్యతగా వాడాలో నేర్పిస్తారు కాబట్టి, తప్పుదారి పట్టే అవకాశాలు తక్కువ. భవిష్యత్ ప్రపంచంలో అవకాశాల కోసం యువతను సంసిద్ధులను చేయడంలో ఈ కోర్సు ప్రధాన భూమిక పోషించవచ్చు. అంతేగాక, వివిధ సంస్థలు, స్టార్టప్‌లు, సృజనాత్మక రంగాలు కూడా ఈ కోర్సు ద్వారా ప్రయోజనం పొందవచ్చు.

కోర్సును నేర్చుకోవడానికి మీరు ఎంచుకున్న లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లోకి (ఉదా: FutureSkills Prime లేదా iGOT Karmayogi) వెళ్లండి, ఎన్‌లోల్ (Enrol) బటన్ క్లిక్ చేసి, మీ జిమెయిల్ (Gmail) లేదా లింక్‌డిన్ (LinkedIn) లాగిన్ ఉపయోగించండి. పేరు, విద్య, వృత్తి వంటి వ్యక్తిగత వివరాలు అందచేసిన తర్వాత కోర్సును ప్రారంభించవచ్చు. కోర్సు అనంతరం సర్టిఫికెట్ కూడా పొందవచ్చు. ఏ విధంగా చూసినా 'యువ ఎఐ ఫర్ ఆల్' పథకం ప్రజలకు, ప్రత్యేకించి యువతకు ఒక గొప్ప అవకాశం. ఖర్చు లేకుండా, కొద్దిసేపులోనే ఎఐలో ప్రాథమిక జ్ఞానం పొందాలనేవారికి ఇది చాలా ఉపయోగకరం.

ఈ కార్యక్రమం పూర్తి స్థాయిలో ప్రయోజనం అందరికీ చేరాలంటే గ్రామీణ భారతం వైపు దృష్టి మరింత బలపడాలి. పట్టణాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాలు ఉండటం వల్ల కోర్సు వేగంగా విస్తరిస్తోంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్, పరికరాల లభ్యత, డిజిటల్ అవగాహన కొరత వంటి అసలు సమస్యలు దూరం చేయకుండా ఎఐ అందరికీ అన్న లక్ష్యం నెరవేరదు. విద్యాసంస్థలు, స్థానిక ప్రభుత్వాలు, గ్రామస్థాయి వనరులతో భాగస్వామ్యం పెంపొందిస్తే, ఈ కార్యక్రమం అసలు అర్థంలో 'ఆల్' (అందరికీ) చేరే అవకాశం ఉంటుంది. డిజిటల్ ప్రపంచంలో గోప్యతా సమస్యలు, తప్పుడు సమాచార వ్యాప్తి, సాంకేతిక దుర్వినియోగం వంటి సవాళ్లు పెరిగిన నేపథ్యంలో, ఈ కోర్సు నైతిక, బాధ్యతాయుత ఎఐ వినియోగంపై కూడా మంచి అవగాహన కల్పిస్తుంది. భవిష్యత్తు ఉద్యోగాలు, పరిశ్రమలు, ఆవిష్కరణలన్నీ ఎఐ ఆధారంగా మారుతున్న సమయంలో, టెక్నాలజీరెడీ కొత్త తరాన్ని సిద్ధం చేయడం అత్యంత కీలకం. ఈ కార్యక్రమం ఆ దిశలో సమయోచితంగా ముందడుగు వేస్తోంది. అయితే, దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతున్నా, గ్రామీణ ప్రజలు, పేద వర్గాలు, డిజిటల్ యాక్సెస్ లేమితో ఉన్న ప్రాంతాలు ఇందులో నిజంగా భాగస్వాములవుతున్నారా? అన్నది ప్రశ్నార్థకమే.

## ప్రపంచానికి చెప్పులు తొడిగిన మనిషి..



ఈరోజు మనమంతా ఎన్నో రకాల చెప్పులు వేసుకుంటున్నామంటే, అందుకు కారకుడు జాన్ ఎర్నెస్ట్ మ్యాట్జెలిగర్. ఒక గొప్ప ఆవిష్కర్తను దురదృష్టవశాత్తు ఈ సమాజం సులభంగా మరచిపోయింది. చెప్పుల పరిశ్రమకు కొత్త దారులు వేసిన అతను నిరుపేదగా, ఎలాంటి గుర్తింపు లేకుండా, కేవలం 37 ఏళ్లకే చనిపోయాడు. కానీ, అతని ఆవిష్కరణను మనం ప్రతి రోజూ.. ప్రతి అడుగులోనూ మోస్తునే ఉన్నాం. 1880 దశకాలలో ఒక జత చెప్పుల ధర చాలా ఎక్కువగా ఉండేది. ఒక సాధారణ కుటుంబం వారం సంపాదనకంటే కూడా ఆ ధర ఎక్కువ. జంతు చర్మం లభించక పోవడమో, మోచీలు అత్యాశాపరులుకావడమో కారణం కాదు. 'లాస్టింగ్' అని పిలిచే ఒక కీలక దశను యాంత్రీకరించడం అసాధ్యమని భావించడం వల్ల. చెప్పు పైభాగం (అప్పర్ పార్ట్)ను అడుగు (సోల్)తో ఖచ్చితంగా కలపడం అనేది ఆ రోజుల్లో అత్యంత నైపుణ్యమున్నవారే చేయగలిగేవారు. ఈ పనికి యంత్రాన్ని కనుగొడానికి ఎంతో మంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ సమయంలోనే వచ్చాడు జాన్. 1852లో సురినామ్‌లో జన్మించిన అతను చిన్నతనం నుంచి యంత్రాల మధ్యే పెరిగాడు. 21 ఏళ్ల వయసులోనే అమెరికా చెప్పుల రాజధాని అయిన మాసచుసెట్స్‌లోని లిన్ నగరానికి వలస వెళ్లాడు. 'లాస్టింగ్'కు యంత్రాన్ని కనుగొనే ప్రయత్నాలు ఆరంభించాడు. అందరూ అసాధ్యం అన్న సమస్యను, ఒక నల్లజాతీయుడైన వలసదారుడు పరిష్కరించలేడన్న అహంభావం విపరీతంగా ఉన్న కాలంలో, అతను నిశ్శబ్దంగా తన ప్రయత్నాలను కొనసాగించాడు. ఉదయం ఫ్యాక్టరీలో పది గంటలు పని .. రాత్రి సమయాల్లో బతకానికి అత్యవసరంగా మారిన ఇంగ్లీషు భాష అభ్యాసం. చిన్న గదిలో, గుడ్డి దీపం వెలుగులోనే డ్రాయింగ్, మెకానికల్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన పుస్తకాలు చదివేవాడు. ఒకటికాదు.. రెండు కాదు.. ఆరు సంవత్సరాలు కష్టపడ్డాడు. చివరికి అనుకున్నది సాధించాడు. లాస్టింగ్ యంత్రాన్ని కనిపెట్టాడు. 1883 మార్చి 20న అతనికి పేటెంట్ దక్కింది. అతను ఆవిష్కరించిన యంత్రం చరిత్ర సృష్టించింది. కార్మికులకు ఎలాంటి అలసట లేకుండా చెప్పుల ఉత్పత్తి కొన్ని వందల రెట్లు పెరగడం ఆరోజుల్లో ఓ అద్భుతం. ఫలితంగా చెప్పుల ఉత్పత్తి పెరిగింది. ధరలు తగ్గియి. మొదటిసారిగా కార్మికులకు, పేద కుటుంబాలకు మంచి చెప్పులు అందుబాటులోకి వచ్చాయి. పిల్లల పాదాలకు రక్షణ లభించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచమే మారిపోయింది. కానీ, యంత్రాన్ని విస్తరించడానికి అతను తన హక్కులను పెట్టుబడిదార్లకు అమ్మాల్సి వచ్చింది. నామమాత్రపు ధరకు హక్కులు కొన్నవారు పరిశ్రమలు నడిపారు. సంపన్నులయ్యారు. జాన్ మాత్రం పేదరికంలోనే ఉండిపోయాడు. క్షయ వ్యాధితో బాధపడుతూ, వైద్య చికిత్స కూడా చేయించుకోలేక, 1889లో 37 ఏళ్లకే కన్నుమూశాడు. జాన్ చనిపోయిన 102 ఏళ్లకుగానీ ఈ ప్రపంచానికి అతను గుర్తుకురాలేదు. 1991లో, అతన్ని నేషనల్ ఇన్వెంటర్స్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చారు. ఒక సత్యాన్ని ఎవరూ చెరపలేరన్న మాట నిజమైంది.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# యువతతోనే సమాజ మార్పు

### పెరుగుతున్న యువ కమ్యూనిస్టుల అవసరం
### జనసేవాదళ్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యువతతోనే సమాజంలో మార్పు వస్తుందని, నానాటికీ యువ కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. సోమవారం రామవరంలో జనసేవాదళ్ శిక్షణా శిబిరాన్ని సాబీర్‌పాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు ఆలోచనలో నుంచి పుట్టిందే జనసేవాదళ్ అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతవసంత ఉత్సవాల సందర్భంగా భారీ బహిరంగ సభ, కవాతు విజయవంతం చేయడానికి భద్రాద్రి జిల్లా నుండి మూడు వేల మంది జనసేవాదళ్ దళంగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ కార్యక్రమాలు, బహిరంగ సభలు, శాంతి భద్రతల నిర్వహణ జన సేవాదళ్ బాధ్యతలే అని ఆయన గుర్తు చేశారు. చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీ దేవిపల్లి మండలాలకు చెందిన యువత శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, మునిగడప వెంకటేశ్వర్లు, కె రత్నకుమారి, యాంద్ర మహేష్, మునిగడప పద్మ, మంద నిర్మల తదితరులు పాల్గొన్నారు. జాతీయస్థాయి శిక్షకులు మురళీ, జిల్లా శిక్షకులు శ్రీనివాస్ శిక్షణా తరగతులు నిర్వహించారు.

# సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి సిద్ధం

### సిపిఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యులకు సిపిఐ అభ్యర్థులు పోటీలో ఉంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. సోమవారం సిపిఐ కార్మిక భవనంలో జిల్లా కార్యవర్గ, ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో వేములవాడ, సిరిసిల్ల ప్రాంతంలో ఎమ్మెల్యే, సర్పంచులు, వార్డు సభ్యులకు పోటీ చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కి ఉందన్నారు. అభ్యర్థులు సిద్ధంగా ఉండాలని అన్నారు. సిపిఐ పార్టీ అభ్యర్థులకు ప్రజలు,కార్మిక లోకం మద్దతు తెలిపాలని కోరారు. డిసెంబర్ 26న ఖమ్మం జిల్లాలో నిర్వహించే శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని డిసెంబర్ 23న సిరిసిల్ల నుండి వేములవాడ లక్ష్మీ పురం వరకు 100 బైకులతో ర్యాలీ నిర్వహించుటకు చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, కెవి అనసూర్య, తీపి రెడ్డి తిరుపతిరెడ్డి, మంద అనిల్, సామనపల్లి మల్లేశం, వద్దేపల్లి లక్ష్మణ్, కూర రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఆందోళనలు

### సింగరేణి జెఎసి కార్మిక సంఘాల పిలుపు
### 26న సింగరేణి వ్యాప్తంగా నిరసనలు




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కార్మిక సంఘాల జెఎసి నాయకులు తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న గనులు, ఓసిపిలపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు. 26న కలెక్టర్లకు వినతిపత్రాలు అందిస్తామని, అదే రోజు జిఎం కార్యాలయాల ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కరోనా సమయంలో 42 కార్మిక చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు అనుకూలంగా 4 కోడ్‌లను ఏకపక్షంగా తీసుకువచ్చారని ఆరోపించారు. దీనివల్ల 8 గంటల పని దినం 12 గంటలకు మారుతుందని, సమ్మె హక్కు కాలరాస్తారని మండిపడ్డారు. గుర్తింపు సంఘానికి 51 శాతం ఓట్లు ఉండాలనే నిబంధన పెట్టి యూనియన్లను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, టిబిజికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్రెడ్డి, కార్యదర్శి పానగంటి సత్తయ్య, ఐఎన్‌టియుసి నాయకులు జెట్టి శంకర్రావు, ఏనుగు రవీందర్రెడ్డి, సిఐటియు అధ్యక్షుడు రాజారెడ్డి, సదానందం, ముస్కె సమ్మయ్య, ఎస్‌కె బాజీసైదా, పొగాకు రమేష్, గడ్డం మహిపాల్‌రెడ్డి, వెంగళ కుమారస్వామి, తొంగల రమేష్, గరిగె స్వామి, తిరుపతిరాజు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని సింగరేణి జెఎసి కార్మిక సంఘాలు ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, టిబిజికెఎస్ నాయకులు డిమాండ్ చేశారు. భారత పారిశ్రామిక రంగాన్ని, పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగించడానికి, భారత కార్మిక రంగాన్ని రెక్కలు తెగిన పక్షులుగా మార్చి, దోపిడీ శక్తులకు ఎదురులేకుండా చేయడానికి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న రక్షణ కవచాలైన 29 కార్మిక చట్టాలను చట్ట స్వభావం లేని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని కార్మిక సంఘాలన్నీ ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నాయని సింగరేణి కార్మిక సంఘాల నాయకులు కొరిమి రాజ్‌కుమార్, టి.రాజారెడ్డి, దాస్, మాదాసు రాంమూర్తి పేర్కొన్నారు సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ కుట్రని ముందే గుర్తించిన కార్మిక సంఘాలన్నీ పది సంవత్సరాలుగా అనేక పోరాటాలు, సమ్మెలు చేసినా దిగిరాని కేంద్ర ప్రభుత్వం, ఏకపక్షంగా తన మంద బలంతో నవంబర్ 21 నుంచి దేశంలో అమలు చేయడానికి నిస్సిగ్గుగా నిర్ణయం తీసుకుందని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలు నవంబర్ 26న రాష్ట్రంలో, దేశంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ప్రధాన జాతీయ కార్మిక సంఘాలు నిర్ణయించాయని వారు తెలిపారు. సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు కోరారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కార్మిక సంఘాలతో సంప్రదింపులు లేకుండా చర్చించకుండా కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చవద్దని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు సయ్యద్ సోహేల్, ఆకునూరి శంకరయ్య, ఆజీంపాషా, మడ్డి కిరణ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ అధ్యక్షుడు ఎంఎ.గౌస్, తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలి

### 29న అన్ని వామపక్ష, అఖిలపక్ష ప్రజాసంఘాల నిరసన
### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ కర్రె గుట్టల్లో కేంద్రప్రభుత్వం మారణ హోమం సృష్టించి ఆదివాసీ గిరిజన ప్రజలను చంపుతుందని, వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కోరారు. సోమవారం గోదావరిఖనిలోని సెరి ఫంక్షన్ హాల్‌లో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయడంతో పాటు బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో సదానందం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మార్చి 2026లోపు దేశంలో మావోయిస్టులను లేకుండా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, ఆదివాసీ గిరిజన ప్రజలను మారణ హోమం సృష్టించి చంపుతుందని ఆయన విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టలో మావోయిస్టులను చంపుతూ ఆదివాసి ప్రజలను కేంద్ర బలగాలను రంగంలోకి దింపి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మావోయిస్టులు ఈ దేశ ప్రజలని, వారు ఎక్కడ నుండో రాలేదని, ఎక్కడైతే అణిచివేత ఉంటుందో అక్కడి ప్రజల రక్షణ కోసం, వారి హక్కుల సాధన కోసం మావోయిస్టులు ఉంటూ ప్రజల అణిచివేత కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని, ఆరునెలల పాటు కాల్పులు విరమణ చేశామని మావోయిస్టులు కేంద్ర ప్రభుత్వంకు లేఖ రాశారని, సిపిఐ కూడా కేంద్ర ప్రభుత్వంకు లేఖ రాయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఐనా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేసేది లేదని 2026 మార్చి లోపు మావోయిస్టులను అంతం చేయడమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని ఆయన ప్రకటించడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కార్పోరేట్ కంపెనీలకు ఖనిజ సంపదను దోచి పెట్టడానికే ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మారణహోమం సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురిచేయడం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 29 గోదావరిఖనిలో అన్ని వామపక్ష పార్టీలు అఖిలపక్ష పార్టీలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో వామపక్ష పార్టీలు ప్రజాసంఘాల నాయకులు కె.విశ్వనాథ్, ఇ.నరేష్, వేల్పుల కుమారస్వామి, మదన కుమారస్వామి, ఏలేశ్వరం వెంకటేష్, గౌతం గోవర్ధన్, కె.కనకరాజ్, భిక్షపతి, మర్కా పూరి సూర్య, శనిగరపు చంద్రశేఖర్, ముడిమడుగుల మల్లన్న, రేణుకుంట్ల ప్రీతం, వై.లెనిన్, రాజేశం, దుర్గయ్య, నరసయ్య, కరీం, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** కరీంనగర్ జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బంది పెడుతున్న రైస్‌మిల్లర్ల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మి కిరణ్‌కు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో రైతులు పండించిన పంట అకాల వర్షాలకు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారని, మిగిలిన చేతికి వచ్చిన పంటను విక్రయిస్తామని రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే రైస్‌మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రైస్‌మిల్లర్లు ధాన్యం కొనమంటే ప్రభుత్వం కేటాయించిన కోటా అయిపోయిందని సాకులు చెబుతున్నారన్నారు. అధికారులు స్పందించి జిల్లావ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బంది పెడుతున్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, కె.సురేందర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## మంత్రి తుమ్మలను కలిసిన ఏసిపి వసుంధర

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కల్లూరు ఏసిపిగా బాధ్యతలు స్వీకరించిన వసుంధర యాదవ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఏసిపి వసుంధర యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏసిపితో పాటు కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు.



# పాల్వంచ ప్రజల రుణం తీర్చుకుంటా

త్వరలో పూర్తి హామీలు నేరవేరుతాయి
ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** అసెంబ్లీ ఎన్నికలలో అత్యధిక మెజారిటీ ఇచ్చిన పాల్వంచను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకొంటానని ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక మున్సిపల్ డివిజన్ కార్యాలయంలో ఇందిరమ్మ చీరలను మహిళా సంఘ సభ్యులకు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన బతుకమ్మ చీరలతో పోల్చితే ప్రస్తుత ఇందిరమ్మ చీరలు నాణ్యమైనవిగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం మహిళా గ్రూపు సభ్యులకు మాత్రమే ఇవ్వాలని అనుకున్నా కానీ, 18 సంవత్సరాలు నిండిన అందరు మహిళలకు పంపిణీ చేస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నదని అన్నారు. దీనిలో భాగంగానే వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నదన్నారు. దీనితో మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర బడ్జెట్ తక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని, త్వరలోనే పెండింగ్‌లో ఉన్నటువంటి మహిళలకు రూ.2,500లు. కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, పించన్ పెంపుదల తదితర పథకాలు అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పోరేషన్ కమిషనర్ కె.సుజాత, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, రాష్ట్ర డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఒ కుదుముల విజయ భాస్కర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా నాయకులు వి. పద్మజ, వైఎస్.గిరి, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, కాంగ్రెస్ నాయకులు కొండం వెంకన్నగౌడ్, ఐకెపి ఎపిఎం సైదాబీ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ చరిత్రలో మైలురాయిగా ఖమ్మం సభ

సిపిఐ ప్రచార బస్సు జాతకు ఘన స్వాగతం
పశ్యపద్మ, దండి సురేష్



**ప్రజాపక్షం/కూసుమంచి:** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ బాసరలో ప్రారంభమైన ప్రచార బస్సు జాత బృందం సోమవారం ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో బస్సు జాత బృందానికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కూసుమంచి మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోయే 100 సంవత్సరాల ఉత్సవాలను విజయవంతం చేయడం ద్వారా కమ్యూనిస్టులు లేరని ప్రచారం చేసేవారికి కనువిప్పు కలిగించాలని సూచించారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి లౌకికవాదులు కమ్యూనిస్టు పార్టీల నాయకులు కలిసి రావాలన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతూ ఆదివాసులను జైల్లో పెడుతున్నారని, మావోయిస్టులను హతమారుస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం సభ దేశ చరిత్రలోనే ఒక మైలురాయిగా మిగిలిపోనుందని తెలిపారు. పోరాటాలతోనే పాలకుల ఆరాచకాలను తిప్పకొట్టడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలోనే కాక అనేక ప్రజా ఉద్యమాలు కార్మిక కర్షక ప్రజా పోరాటాలు సమరశీల ఉద్యమాల్లో సిపిఐ కీలక పాత్ర పోషించిందని అన్నారు. నిరుద్యోగులు కార్మికులు విద్యార్థుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకు పోరాడిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల ఖిల్లా అని అన్నారు. ఈ కార్యక్రమంలో బస్సు జాతా బృందం నాయకులు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, కేతరాజు ఉప్పలయ్య, నరేంద్ర ప్రసాద్, ఆర్ఎల్ రవి, పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా నాయకులు కొండపర్తి గోవిందరావు, ఏనుగు వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, చెరుకుపల్లి భాస్కర్, పుచ్చకాయల కమలాకర్, గుండెపంగు మల్లేష్, ఉపేందర్, కూసుమంచి మండల కార్యదర్శి భూక్యా నరసింహ, సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, మండల నాయకులు పాండురంగ చారి, భూక్యా ప్రశాంత్, భూక్య శ్రీకాంత్ పాల్గొన్నారు.



## ప్రమీలరాణికి మంత్రి తుమ్మల నివాళి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ జిల్లా నాయకులు మిక్కిలినేని నరేంద్ర మాతృమూర్తి మిక్కిలినేని ప్రమీలరాణి మృతికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించారు. సోమవారం ఖమ్మం నగరంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్‌లో ప్రమీల రాణి దశదిన కర్మలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు ఏనుగు గాంధీ, నానబాల రామకృష్ణ, టిఎన్‌జీవోస్ నాయకులు, వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు.



## ఫ్రూట్ మర్చంట్ సంక్షేమానికి కృషి

ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల యుగంధర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఫ్రూట్ మర్చంట్ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. ఖమ్మం హోల్‌సేల్ ఫ్రూట్ మర్చంట్ వెల్ఫేర్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలో త్వరలోనే ఫ్రూట్ మర్చంట్ చిరకాల కల నెరవేరబోతుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా కృషి చేసి ఫ్రూట్ మర్చంట్స్‌కు ఖానాపురం ఇండస్ట్రియల్ ఏరియాలో మూడున్నర ఎకరాల స్థలం కేటాయించారని సంక్రాంతి కంటే ముందే నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్ షౌకత్ అలీ, ఫ్రూట్ మర్చంట్ యూనియన్ అధ్యక్షులు ఎస్‌కె జానిమియా, జనరల్ సెక్రటరీ ఎ. శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు జి. శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కె అబ్దుల్ నబీ, సెక్రటరీ ఎన్. వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండి ఉస్మాన్ అలీ, అడ్వైజర్ ఎ. మల్లికార్జునరావు, సభ్యులు ఎస్‌కె ఖాసీం, ఎస్‌కె కరీం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం :** ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి ప్రమావదశాత్తు కల్వర్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. దుమ్ముగూడెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నందులు చెలక గ్రామాని చెందిన సోయం రాజాబాబు(26)సోమవారం మధ్యాహ్నం లక్ష్మీనగరం ఎస్‌బిఐ బ్యాంకు వద్దకు వచ్చి ఇంటికి వెళ్తుండగా బుర్రవేముల గ్రామం సమీపంలో రాజాబాబు నడుపుతున్న వాహనం ప్రమాదవ శాత్తు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలైయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే రాజాబాబుని దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యాధికారి రాజబాబు మరణించినట్లు నిర్ధారించారు. ప్రమాద ఘటనపై సర్కిల ఇన్స్‌పెక్టర్ వెంకటప్పయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

మండల పరిధిలోని బైరాగుల పాడు గ్రామ ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బైరాగుల పాడు గ్రామానికి చెందిన కొప్పుల రాజేశ్వరి (40) ఈనెల 23వ తేది సాయంత్ర 6 గంటల సమయంలో రోడ్డుదాటుతుండగా చిన నల్లబల్లి గ్రామానికి చెందిన పూసం రాజేష్, ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తతో వేగంగా నడుపుతూ రోడ్డు దాటుతున్న రాజేశ్వరిని ఢీకొట్టడంతో ఆమె తీవ్ర గాయాల పాలైంది. కుటుంబసభ్యులు ఆమెను భద్రాచలం ఏరియా ఆసుపత్రి తరలించి వైద్యం అందిస్తుండగా ఆమె మృతి చెందింది. ప్రమాద ఘటనపై ఎస్సై గణేష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నగుబాటావుతున్న నాణ్యత

నిర్మాణంలోనే కూలిన వంతెన పిల్లర్
ఇంజనీరింగ్ నిర్లక్ష్యానికి పరాకాష్ట



**ప్రజాపక్షం/ఖమ్మం :** నిర్మాణాల్లో నాణ్యత నగుబాటవుతుంది. అధికారుల పర్యవేక్షణా లోపం, ఇంజనీరింగ్ అధికారుల మామూళ్ల మత్తు వెరసి కోట్లాది రూపాయలు వెచ్చించిన నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతున్నాయి. ఖమ్మం జిల్లాలో నిర్మాణంలోనే కూలిన ఒక వంతెన పిల్లర్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కూలిన వంతెన పిల్లర్ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు డివిజనల్ స్థాయి ఇంజనీరింగ్ అధికారి పడరాని పాట్లు పడుతున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్వగ్రామం వద్ద నిర్మిస్తున్న వంతెన కావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాలలక్ష్మీపురం, సిరిపురం గ్రామాల మధ్య వైరా నదిపై రూ.5కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు. వైరా నదిలో పిల్లర్లు నిర్మిస్తున్న సమయంలో నాణ్యత లేకుండా పిల్లర్లు వేయడంతో నిర్మాణంలోనే పిల్లర్ కుప్పకూలింది. పిల్లర్ కుప్పకూలడంతో అనుమానం రాకుండా కూలిన పిల్లర్‌ను జెసిబితో మట్టి పోసి తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా కాంట్రాక్టర్లతో కుమ్మకైన ఇంజనీరింగ్ అధికారుల వల్లనే నాణ్యత లోపంతో వంతెన నిర్మాణం జరుగుతుందని పిల్లర్‌కు వాడాల్సిన మోతాదులో ఇనుప చువ్వలు వాడలేదని పునాది కూడా సరిగ్గా లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో ఇంజనీరింగ్ అధికారుల పనితీరుతో ఇప్పుడు మొత్తం జరుగుతున్న నిర్మాణాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం నాడు పిల్లర్ కూలిన సమయం నుంచి ఓ ఇంజనీరింగ్ అధికారి మీడియాకు ఫోన్లు చేసి బేరసారాలకు దిగడం వార్త ఆపాలంటూ ఒత్తిడి చేయడం చూస్తుంటే ఆ గుత్తేదారులకు ఎంత అండగా నిలుస్తున్నాడో అవగతమవుతుంది. జిల్లాలో ఎక్కువ మంది గుత్తేదారులు జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులకు, రాజకీయ నాయకులకు అత్యంత సన్నిహితులు కావడంతో గుత్తేదారుల వద్ద నాణ్యత గురించి ప్రశ్నించే అవకాశం లేదని మేము ఏమి మాట్లాడిన ప్రజాప్రతినిధుల వద్ద నుంచి ఫోన్లు వస్తున్నాయని ఓ నిజాయితీ కలిగిన ఇంజనీరింగ్ అధికారి వాపోయాడు. ఈ డివిజనల్ ఇంజనీరింగ్ అధికారి పర్యవేక్షణలో సాగుతున్న నిర్మాణాలన్నింటిని పునఃపరిశీలన చేయాలని లక్ష్మీపురం, సిరిపురం మధ్య నిర్మిస్తున్న మిగతా పిల్లర్ల నాణ్యతను కూడా ఉన్నతాధికారులు పరీక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్వగ్రామం వద్దే పిల్లర్ కూలిన ఘటనకు సంబంధించి ఉన్నతాధికారులు, అటు గుత్తేదారుపైన, ఇటు ఇంజనీరింగ్ అధికారులపైన ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

## రూ.25లక్షల విలువ చేసే
# గంజాయి స్వాధీనం



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రైల్వే స్టేషన్ సమీపంలో ఇరువురు వ్యక్తుల నుంచి రూ.25లక్షల విలువ చేసే 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం వన్‌టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. సిఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం వన్‌టౌన్ ఎస్ఐ మౌలానా ఆధ్వర్యంలో సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఖమ్మం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆటో స్టాండ్ వెనక ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తూ పారిపోతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించినట్లు సిఐ తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన పుష్కర్ పరిచ్చర్, సంతోష్ పైకా వీరిరువురు ఒడిశాలోని సందీప్‌కుమార్ బుయ వద్ద గంజాయిని తక్కువ ధరకు కొని రైలు మార్గం ద్వారా ప్రయాణించి పూణేలో నివాసం ఉండే అతుల్ సదాశివ్ అవాద్‌కు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. వీరు రెండు సంచులలో 50 కేజీల గంజాయిని తీసుకుని ఆదివారం పలాస వద్ద కోణార్క్ ట్రైన్ ఎక్కి పూణే వెళ్తున్నారని ఈ క్రమంలో ఖమ్మం సమీపంలో రైల్వే పోలీసులు వీరు ప్రయాణిస్తున్న ట్రైన్ బోగీలను తనిఖీ చేస్తుండగా పట్టుబడతామనే భయంతో వీరిరువురు ట్రైన్ దిగారన్నారు. వీరి వద్ద నుండి 25 ప్యాకెట్లలో ఉన్న 50.137 కేజీల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. దాని విలువ రూ. 25,06,880 ఉంటుందని తెలిపారు. పుష్కర్ పరిచ్చర్ పై 2023లో నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీసులు గంజాయి కేసులో జైలుకు పంపినట్లు సిఐ తెలిపారు. ఇరువురు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు సిఐ కరుణాకర్ తెలిపారు

# వెంటనే నాలుగు కోడ్‌లను రద్దుచేయాలి

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి
వై. రాంగోపాల్




**ప్రజాపక్షం/మణుగూరు :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం పివి కాలనీ ఎఐటియుసి కేఎల్ మహేంద్ర భవన్ లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్నటువంటి 29 కార్మిక చట్టాలను కాలరాసి, వాటి స్థానంలో నాలుగు కోడ్లను ప్రవేశపెట్టిందని దీనివల్ల కార్మిక వర్గం అంతా తీవ్ర నష్టాన్ని, హక్కులను కోల్పోతున్నారని అన్నారు. ముఖ్యంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానం, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ రంగ సంస్థల మనుగడ, కార్మిక సంక్షేమం దెబ్బతింటాయని అన్నారు. కార్మిక సంఘాల ఏర్పాటు, సమ్మె హక్కు, ధర్నాలు, నిరసనలు తెలియజేసే హక్కులు హరించకపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందని, దీనిని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు వ్యతిరేకించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, శ్రమ దోపిడి జరిగే అవకాశాన్ని బహుమతిగా ఇచ్చినట్లు అయిందని అన్నారు. సింగరేణిలో కూడా ఈ కోడ్ ల వలన కార్మిక వర్గం తమ హక్కులను నష్టపోతుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, తిరిగి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 25వ తారీకున సింగరేణి వ్యాప్తంగా అన్ని మైన్స్ మరియు డిపార్ట్మెంట్ల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేయాలని, మరియు నవంబర్ 26వ తేదీ జిల్లా కలెక్టరేట్ల వద్ద మధ్యాహ్నం 11 గంటలకు వినతి పత్రాలు అందజేయాలని, అదే రోజు నవంబర్ 26 తిరిగి సాయంత్రం 3 గంటలకు సింగరేణి ఏరియాలోని అన్ని జిఎం ఆఫీసుల ముందు నిరసనలు తెలియజేయాలని పోరాట కార్యక్రమాలకు పిలుపునిస్తున్నామని అన్నారు. ఈ నిరసన మరియు పోరాట కార్యక్రమాలకు కార్మిక వర్గం అంతా ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.రాం నరసయ్య, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, పీకే ఓసీ2 పిట్ సెక్రటరీ శనిగరపు కుమారస్వామి ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, కౌన్సిల్ మెంబర్స్, పిట్ కమిటీ, మైన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## చాంబర్ నూతన పాలకవర్గానికి సన్మానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చాంబర్ ఆఫ్ కామర్స్‌కు నూతనంగా ఎన్నికైన పాలక వర్గాన్ని ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుమ్మడివెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చాంబర్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కురువెళ్ల ప్రవీణ్, సోమా నరేష్, కోశాధికారి తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసి మెంబర్లు రాయపూడి రవికుమార్, వంగవీటి హరీష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అనుబంధ శాఖల నుండి ఎన్నికైన ఆర్యవైశ్య అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి, ఈసి మెంబర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చాంబర్‌లో గెలిచిన ఆర్యవైశ్య నాయకులంతా ఐక్యతను చాటి చాంబర్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. భద్రాద్రి బ్యాంక్ ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, చాంబర్ మాజీ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, కొప్పు నరేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి సీతారామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి గోళ్ల రాధాకృష్ణమూర్తి, వాసవి క్లబ్ గవర్నర్ కొత్తా వెంకటేశ్వరరావు, పలువురు ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రఘునాథపాలెం మండలానికి చెందిన వెంకటేశ్వర్లు తమకు 2009లో సర్వే నెం.218లో 75 గజాల స్థలం కేటాయించారని క్షేత్ర స్థాయిలో తనకు కేటాయించిన జాగాను చూపించడం లేదని తనకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి, గుదిమళ్ల గ్రామ ప్రజలు ఇటీవల ఏదులాపురం మున్సిపాలిటీలో తమ గ్రామాలను విలీనం చేశారని, అత్యధికంగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉంటారని ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలపై దుష్పరిణామాలు ఎదురవుతాయని దానిని రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం రెవెన్యూ గ్రామానికి చెందిన బాలయ్య గ్రామంలో కెజిబివి ఎదురుగా గ్రామ కంఠ భూమి అన్యాక్రాంతమవుతుందని దానిని కాపాడాలని కోరుతూ దరఖాస్తు చేశారు. తల్లాడ మండలం తెలగవరం గ్రామానికి చెందిన భూక్యా తులివ్య తనకు గ్రామంలో ఉన్న 23 కుంటల భూమి డంపింగ్ యార్డ్ క్రింద పోయిందని దానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరుతూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పించాలి -అవగాహన కార్యక్రమంలో కలెక్టర్**

చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పించేందుకు రూపొందించిన చేనేత లక్ష్మి పొదుపు స్కీంను ప్రజలందరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం చేనేత లక్ష్మి పథకంపై జిల్లా అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హ్యాండ్లూమ్స్ ఏడి, టెస్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు చేనేత లక్ష్మి పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఇఒ దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, మేనేజర్ సంతోష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ జరీనా, ప్రతినిధులు ఎల్లాస్వామి పాల్గొన్నారు.



## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

సిఐ ఉస్మాన్ షరీఫ్

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా ప్రజలు సహకారం అందించాలని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని పువ్వాడ నగర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసుల కర్తవ్యమన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## మంత్రి కొండా సురేఖను ఆహ్వానించిన డిప్యూటీ సిఎం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** సురేఖమ్మ.. నా కొడుకు ఎంగేజ్‌మెంట్‌కు తప్పక రావాలంటూ తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రి కొండా సురేఖను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం మంత్రి కొండా సురేఖ జూబ్లీహిల్స్ నివాసానికి తన సతీమణి మల్లు నందినితో వచ్చిన డిప్యూటీ సీఎం కొండా సురేఖను సాదారంగా ఆహ్వానించారు. ఈనెల 26న హైదరాబాద్‌లో జరుగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య నిశ్చితార్థానికి మంత్రి సురేఖ కుటుంబాన్ని స్వంగా కలిసి ఆహ్వానించారు.

## గ్రామాలలో పత్తి దళారుల దందా!



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లాలో పత్తి దళారుల దందా కొనసాగుతుంది. కానీ సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం వలన దళారులు గ్రామాలలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు తూకంలో మోసం చేస్తూ రైతులకు శాపంగా మారుతుంది. ప్రభుత్వం పెట్టిన రేటు కన్నా తక్కువ రేటుతో పత్తిని కొనుగోలు చేస్తూ దళారులు రైతులను మోసం చేస్తున్నారు. ప్రతి రోజు గ్రామాలలో దళారులు అక్రమ కాంటాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన పత్తి మార్కెట్లలో రైతులు పత్తిని అమ్ముకోకుండా రైతులకు అడ్డుపడి దళారులు రైతుల వద్ద పత్తిని ఇష్టమొచ్చిన రేటుకు కొంటూ ప్రతి రోజు ఒక లోడు నుండి దాదాపు 5 నుండి 6 లోడ్‌ల పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఇలా గ్రామాలలో దళారుల దందా జోరుగా సాగుతుంది. ఇప్పటి వరకు కూడా మార్కెట్ నుండి అధికారులు రాకపోవం వల్లనే దళారులు గ్రామాలలో ఇష్టం వచ్చినట్లు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా రైతులను మోసం చేయకుండా దళారులపై అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా దళారుల వద్ద నున్న కాంటా బాట్లను కూడా వారి వద్ద నుండి తీసుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.

## ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు అర్జీలను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులను ప్రజలు అందించిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో గృహ నిర్మాణ, మున్సిపల్, రెవెన్యూ, డి ఆర్ డి ఓ, వ్యవసాయ, ఉపాధి కల్పన, ఇతర శాఖలకు సంబంధించి స్వీకరించిన 159 సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ,పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు: కలెక్టర్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ద్వారా వడ్డీలేని రుణాలు మంజూరు చేయడం రుగుతోందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఏప్రిల్ 2024 నుండి మార్చి 2025 వరకు జిల్లాలో మొత్తం 6037 స్వయం సహాయక సంఘాలకు రూ.221.73 కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. .అలాగే మంగళవారం 6107 మహిళా సంఘాల సభ్యులకు 3.20.కోట్లు వడ్డీ లేని రుణాలు అందించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలకు భారీ స్థాయిలో ఆర్థిక సహకారం అందించబడిందని కలెక్టర్ తెలిపారు. ఈ వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమం మంగళవారం మొగుళ్లపల్లి మండల కేంద్రం లోని ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై రుణాల పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు.మహిళా సంఘ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి కార్యక్రమాలు, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చేసుకొని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమ ఏర్పాటు, సభ నిర్వహణ, మహిళల హాజరు తదితర అంశాలపై సంబంధిత అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు.

## సెంట్రల్ జోన్ నూతన డిసిపిగా బాధ్యతలు చేపట్టిన దారా కవిత



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ నూతన డీసీపీగా దారా కవిత కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ పరిధి లోని అధికారులు సిబ్బంది నూతన డీసీపీగా మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేసారు. డీసీపీ కవిత హైదరాబాద్ సైబర్ విభాగం పని చేస్తూ బదిలీపై సెంట్రల్ జోన్ డీసీపీగా నియమించబడ్డారు.

# నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి





**ప్రజాపక్షం/ములుగు:** ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణిలతో కలిసి సిఎస్ఆర్ నిధులతో రాంకీ ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్ వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన సామాజిక నీటి శుద్ధి కేంద్రంను, ఉచిత వైద్య శిభిరంను ప్రారంభించారు. కోటక్ మహీంద్ర వారి సహకారంతో 175 మందికి ఉచిత శిక్షణ ధృవీకరణ పత్రం, ఉచిత కుట్టు మిషన్లు, ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కురేందుల శంకర్, 8 మంది ఇతరులకు 9 యూనిట్లు పాడి గేదెలను ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం జంగాలపల్లి గ్రామంలో రూ.20కోట్ల నిధులతో జంగాలపల్లి నుండి గాంధీనగర్ రహదారి 0/0 నుండి 17/0, 19/5 ...24/030 వరకు రోడ్డు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి తుల రవి, ఏపిఎం శ్రీనివాస్, రాంకీ ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్, కోటక్ మహేంద్ర ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### చీరలను పంపిణీ

కన్నాయిగూడెం మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకెజి ద్వారా 102 సంఘాలకు రూ.6కోట్ల 47లక్షల 55వేల రుణాల పంపిణీ చెక్కును మంత్రి సీతక్క సోమవారం అందించారు. అనంతరం కన్నాయిగూడెం మండల పరిధిలోని 16 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, రేగ కళ్యాణి, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు, మండల ప్రత్యేకాధికారి, తహసీల్దారు, ఎంపిడిఓ, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, కళ్యాణలక్ష్మి, లబ్దిదారులు, ఉన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి డివిజన్ లలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని,రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.సోమవారం నగర మేయర్ గుండు సుధారాణి గారితో కలిసి 62 డివిజన్ సోమిడిలో సుమారు 1.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.గ్రామీణ వాతారణంలో ఉన్న కాజీపేట ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.ప్రధాన సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని,జరుగుతున్న అభివృద్ధికి ప్రజలు తమ సహకారాన్ని అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు జక్కుల రవీందర్,సయ్యద్ విజయశ్రీ రాజాలి, ఇతర ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,అధికారులు పాల్గొన్నారు.

## తక్షణం కార్మికులకు నష్టం చేసే కోడ్‌లను రద్దు

### ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** దేశ సంపదను కార్పోరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నూతనంగా నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్ తెలిపారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఏఐటీయూసీ కొమురయ్య స్మారక భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ, అనేక సంవత్సరాలుగా కార్మిక సంఘాలు పోరాడి సాధించుకు

2౨9 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజించి అమలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక సంఘాల ప్రమేయం లేకుండానే కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను ఏర్పాటు చేయడం యావత్ కార్మిక లోకానికి తీరని నష్టమని అన్నారు. బీహార్ ఎన్నికల్లో బిజెపి కూటం గెలవడంతో రెక్కలొచ్చిన పక్షులాగా ఈ కార్మిక చట్టాలను దేశ కార్మికులపై రుద్దిందని అన్నారు. ఇటీవల కాలంలో ఎల్ఐసి కి సంబంధించిన 32,000 కోట్ల ఎల్ఐసి డబ్బులను ఆదాని కంపెనీలో పెట్టుబడి పెట్టడం కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. సింగరేణి ప్రావిడెంట్ పండ్ సైతం దేశంలో ఉన్న బొగ్గు బ్లాక్ లన్ని ఆదాని, అంబానీలకు కట్టబెట్టిందని, ఈ నూతన కోడ్ ల వల్ల కార్మికులు కోర్టులకు వెళ్లే అవకాశం లేదని కార్మికులు సమ్మె చేసి తన హక్కులను సర్వం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సమస్యలపై కార్మికుల ప్రశ్నించడానికి ఆస్కారం లేకుండా కార్మికుల యొక్క హక్కులైన బేర సారాలను కూడా కోల్పోతున్నారని అన్నారు. సింగరేణి వ్యాప్తంగా 26 న జిల్లా కలెక్టర్, ముందు ధర్నా నిర్వహించి, సాయంత్రం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా ఉంటుందని, కార్మిక వర్గం 26న జరిగే ఆందోళన పోరాటాలలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, ఏఐటీయూసీ సిపిఐ నాయకులు సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాథరాజు సతీష్, జోసఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి కావ్య, ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన ఇనగాల



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యను, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని నూతనంగా ఎన్నికైన హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి నూతన డిసిసి అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. హన్మకొండ, వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పార్టీ పటిష్టానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## తెలంగాణ మహిళలకు పెద్దన్న సిఎం

### ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళి నాయక్



**ప్రజాపక్షం/గూడూరు:** తెలంగాణ మహిళలకు పెద్దన్న సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరలను అందిస్తున్నారని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. సోమవారం గూడూరు మండల కేంద్రంలో ఉదయశ్రీ మండల సమైఖ్య అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళ శక్తి చీరల పంపిణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్బంగా డాక్టర్ మురళినాయక్ మాట్లాడుతూ రాష్ట్ర మహిళలందరికి ఒక అన్నగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి మంది ఆడబడ్డలకు ఇందిరమ్మ చీరలను పంచుతున్నాడని అన్నారు. మీకు ఇచ్చె నాణ్యమైన చీరలతో మాకు గౌరవం పెరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.గత ప్రభుత్వంలో బతకమ్మ పేరుతో నాసీరకం చీరలు ఇచ్చారని అయితే సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం మంచి నాణ్యత కలిగిన చీరల్నిస్తున్నాడని అన్నారు. మహిళలపై నిజమైన ప్రేమ ఎవరికి ఉన్నదో మీరే గుర్తుపెట్టుకోవాలని అన్నారు.ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యంమని ప్రధాన మంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని అన్నారు.ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో 4500 ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళ ల పేరు మీదనే మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు.ప్రతి పేద వాడు సన్న బియ్యం తీంటున్నారని అన్నారు. ప్రతి నేల 6 కీలోల సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా ఇస్తున్నామని మహిళా సంఘాల ద్వారా ఆర్టిసి సంస్థకు అద్దె బస్సులు ఇప్పించడం పెట్రోల్ బంక్‌లు నిర్వరణ ఇందిరా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు చేసి పాఠశాలలో బాలికలకు తెరిచిన వెంటనే స్కూల్ డ్రెస్సులు ఇవన్నీ కూడా ఇస్తున్నామని గుర్తు చేశారు. ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న పథకాలను ప్రజలు గమనించాలని వారు అన్నారు. ఈకార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి తాహశిల్దార్ నాగభవాని ఎంపిడివో సత్యనారాయణ అబ్దుల్ మాలిక్ శ్రీనువాస్ శ్రీకాంత్ ఉమయశ్రీ మయూరి, విజయ, వీరయ్య కుమారస్వామి వెంకటయ్య వీరస్వామి జ్యోతి పర్వీన్ ఆశ రోషమ్మ జ్యోతి కోటి మహిళ సంఘూల సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## నూతన ప్రోహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** మండల కేంద్రంలోని టిటిఎస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రోహిబిషన్ , ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం ఎక్సైజ్ స్టేషన్ సీఐ దుర్గాభవాని నిశాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.తదనంతరం ఈ స్టేషన్ పరిధిలో వచ్చే ప్రాంతాలను అధికారాలను అడిగి తెలుసుకుని డ్రగ్స్, గంజాయి, గుడుంబా వంటివి లేకుండా నిర్మూలించాలని ఎక్సైజ్ అధికారులకు సూచనలు చేశారు.హసన్ పర్తి టౌన్ లో ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటుకు చేసేందుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావులకు కృతజ్ఞతలుతెలుపారు.తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారని, విద్యార్థులు, యువత మత్తును వదిలి మైదానాల్లోకి రావాలని, గంజాయి, మత్తుపదార్థాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలన్నారు. తాను అడిషనల్ డీసీపీ, నిజామాబాద్ సీపీగా ఉన్నప్పుడు ప్రత్యేక టీమ్స్ వేసి మత్తు పదార్థాల నివారణకు కృషి చేశామని చెప్పారు. మత్తు పదార్థాల నివారణకై ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ టీంను ఏర్పాటు చేసిందని, ఎక్సైజ్ అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలని అన్నారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల కోసం ఎక్సైజ్ శాఖ కీలకంగా పనిచేస్తోంది. ప్రభుత్వ పథకాలను, చట్టాలను ప్రజలకు చేరవేయడంలో ఎక్సైజ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొనాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, తంగెళ్ళపల్లి తిరుపతి, ప్రభాకర్ గౌడ్, హసన్ పర్తి, పోరెడ్డి. మహేందర్ రెడ్డి, మహేష్ గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం షురూ!

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం నాగారం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు నమ్మకమే తమ బలమని వరి కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా అవినతి, ఇబ్బంది లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరిగేలా కమిటీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. రైతులు వేచి చూడకుండా వెంటనే టోకెన్లు జారీ చేసి త్వరితగతిన ధాన్యం కొలిచేందుకు సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రైతులకు న్యాయమైన ధర అందించే దిశగా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రాపాక కిరణ్, బక్కి అశోక్, చెన్న కేశవులు, నర్సంపేట కోర్టు ఏజిబి అడ్వకేట్ బండి శివకుమార్, కోల లక్ష్మ ణ్, నాగారం గ్రామ కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# ఎవరి ఎత్తులు వారివే!

### సర్పంచ్ పదవి కోసం పోటా పోటీ
### రిజర్వేషన్ల ఖరార్‌తో ఆశవాహుల హల్‌చల్
### గెలుపు గుర్రాలపై పార్టీల ఆరా

**ప్రజాపక్షం/జనగామ:** గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఆశావాహులు ఎవరి ఎత్తుల్లో వారున్నారు. సర్పంచ్ పదవి దక్కించుకోవడం కోసం పోటీ పడుతున్నారు. తమకంటే తమకే అని నాయకుల చుట్టు తిరగడమే కాకుండా డబ్బు ఖర్చుపై లెక్కలు చెబుతున్నారు. ఇక పార్టీలు సైతం గెలుపు గుర్రాలపై ఆరా తీస్తున్నాయి. నలుగురైదుగురు పోటీ పడితే మండల స్థాయిలోనే సర్దిచెప్పడం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామాల్లో రాజకీయ పట్టు పెరగాలంటే సర్పంచ్ పదవియే కీలకం కావడంతో దానిని దక్కించుకోవడం కోసం ఎవరి ఎత్తులు వారు వేస్తున్నారు. ఇక పార్టీల మార్పుపై సైతం మొదలైంది. జనగామ జిల్లాలో 280 గ్రామ పంచాయితీలు, 2వేల 534 వార్డులు ఉన్నాయి. వీటి రిజర్వేషన్ ఆదివారమే పూర్తయ్యింది. 125 సర్పంచ్ స్థానాలు మహిళలకు రిజర్వ్ చేయబడ్డాయి. మిగిలిన 155 జనరల్‌కు రిజర్వ్ చేశారు. ఇందులో ఎస్టీలకు 58 సర్పంచ్‌లు, ఎస్సీలకు 54 సర్పంచ్‌లు, బిసిలకు 45, జనరల్ కేటగిరిలో 123 పంచాయితీలు రిజర్వ్ చేయబడ్డాయి. మండలాల వారిగా సైతం రిజర్వేషన్లు పూర్తి చేశారు. తండాలను గ్రామ పంచాయితీలుగా చేయడంతో ఎక్కువ పంచాయితీలు ఎస్టీలకు దక్కాయి. రిజర్వేషన్లు పూర్తి కావడంతోనే గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

### పోటా..పోటీ

గ్రామ పంచాయతీ పదవి కోసం పోటీ పెరిగింది. ఇటీవల 42 శాతం బీసీ రిజర్వేష్ల ప్రకారం రిజర్వ్ చేయగా ఎవరికి అనుకూలంగా లేకపోవడంతో నిరాశపడ్డారు. ఇప్పుడు రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఎన్నికల నిబంధన ప్రకారం రిజర్వ్ చేశారు. దీనితో పోటీ పెరిగింది. జిల్లాలో అతి ఎక్కువ పంచాయతీలు ఉన్న రఘునాథపల్లి మండలాన్ని పరిశీలిస్తే..ఇక్కడ అతి పెద్ద గ్రామాలుగా ఉన్న రఘునాథపల్లి, ఖిలాషాపురం, కంచెనపల్లి గ్రామాలు ఎస్సీ మహిళకు రిజర్వ్ చేయబడ్డాయి. భాంజీపేట, మండెలగూడెం, పదమటిగూడెం, కోమల్ల, కర్చపల్లి, నిడిగొండ, శ్రీమన్నారాయణపురం లాంటి గ్రామాలు జనరల్‌కు రిజర్వ్ చేయబడ్డాయి. ఈ గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉండనుంది.

పెద్ద పంచాయతీలు, జనరల్ కేటగిరిలో ఉన్న పంచాయితీల్లో పోటీ ఉంది. ఇక్కడ ఎక్కువ మంది పోటీ పడడడంతో పాటు రాజకీయ పార్టీలకు అతీతంగా స్వతంత్రులు సైతం ఎక్కువగానే పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇలా రఘునాథపల్లి మండలంలోనే కాకుండా అన్ని మండలాలు, అన్ని గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉందని చెప్పాలి.

**గెలుపు గుర్రాలపై పార్టీల ఆరా**

ఒక వైపు పోటీ తీవ్రంగా ఉంటే మరో వైపు పార్టీలు గెలుపు గుర్రాలపై ఆరా తీస్తున్నాయ. సర్పంచ్ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరగాల్సి ఉండగా అలాంటిది ఏమీ ఉండదు. రాజకీయ పార్టీల నాయకులే పోటీ పడడమే కాకుండా ఆ పార్టీ వారే తమ అభ్యర్థులను బరిలోకి దింపుతారు. గ్రామాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, వామపక్ష పార్టీల బలాలు సైతం ఉన్నాయి. అధికారంలో ఉండడం మూలంగా ఎక్కువ శాతం సర్పంచ్‌లను దక్కించుకోవాలనే ఆలోచనలో ఆ పార్టీ ఉంది. ఏదీ ఏమైనా గ్రామాల్లో రచ్చబండ చర్చలు మొదలు కాగా ఆశావాహులు హల్‌చల్ చేస్తూ ఎంత డబ్బైయిని పెట్టడానికి సిద్దంగా ఉన్నామంటున్నారు.

# రీల్

## 'రెబల్ సాబ్' సాంగ్ విడుదల




రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రూపొందుతున్న 'రాజా సాబ్'. హారర్ కామెడీ జానర్‌లో 'రాజా సాబ్'ను తెరకెక్కిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9న 'రాజా సాబ్' సినిమా వరల్డ్ వైడ్‌గా థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా మ్యూజిక్ ప్రమోషన్స్ తో ఈ సెలబ్రేషన్స్‌ను బిగిన్ చేశారు. 'రాజా సాబ్' సినిమా ఫస్ట్ సాంగ్ 'రెబల్ సాబ్'ను హైదరాబాద్‌లో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ రెబల్ ఫ్యాన్స్ 'రాజా సాబ్' సినిమా కోసం ఎంత ఆకలిగా ఉన్నారో మాకు తెలుసు. ఈ సినిమా మీకు విందుభోజనంలా ఉంటుంది. ఈ సినిమాకు ప్రభాస్ గారు యాక్షన్ ఎపిసోడ్స్ చేస్తున్నప్పుడు, పాటలు చేస్తున్నప్పుడు, ఎంటర్ టైన్ మెంట్ ఎపిసోడ్స్ చేస్తున్నప్పుడు సెట్‌లోనే ఉన్నా. ఆ సీన్స్ అన్నీ అదిరిపోతాయి. విదేశాల్లో పాటలు చిత్రీకరించినప్పుడు గడ్డకట్టే చలిలో కూడా ప్రభాస్ డ్యాన్సులు చేశారు అని అన్నారు. ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'రాజా సాబ్' రిలీజ్ కోసం మీ కంటే ఎక్కువగా మేము వెయిట్ చేస్తున్నాం. జనవరి 9న సినిమా వస్తుందా లేదా అనే సందేహాలు కొందరిలో ఉన్నాయి. కానీ ఖచ్చితంగా జనవరి 9న మా సినిమాను ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయబోతున్నాం. గ్లోబల్‌గా అత్యధిక థియేటర్స్‌లో లార్జెస్ట్ రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నాం. ప్రభాస్‌ని గ్రూప్ ఆఫ్ డ్యాన్సర్స్‌తో కలిసి చూసి చాలా రోజులైంది. దాదాపు 12 ఏళ్ల తర్వాత ప్రభాస్ ఇలాంటి పాట చేశారంటే అది కేవలం మన కోసమే అని అన్నారు.

## 'ఇంద్రావతి' టీజర్ లాంచ్




కొత్తదనానికి పెద్దపీట వేస్తూ, సీనియర్ నటుల అనుభవాన్ని జోడిస్తూ దర్శకనిర్మాత నంది వెంకట్ రెడ్డి ఓ సస్పెన్స్ థ్రిల్లర్‌ను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. శ్రీ శివసాయి ఫిలమ్స్ బ్యానర్‌పై నంది వెంకట్ రెడ్డి స్వయంగా దర్శకత్వంనిర్మాణం చేస్తున్న చిత్రం 'ఇంద్రావతి'. మూరంరెడ్డి వెంకటేశ్వర్లు, వడ్ల సిద్ధార్థ, యందూరి నిహారిక చౌదరి, ఈది సుష్మ కథానాయకులుగా నటిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ నటులు సుమన్, లంకెల అశోక్ రెడ్డి, ఘర్షణ శ్రీనివాస్, టార్జాన్, దిల్ రమేష్, చిత్రం శీను, అర్చన, ధనుంజయ, నగేష్ తదితరులు కీలక పాత్రల్లో కనువిందు చేస్తున్నారు. హైదరాబాద్లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్లో ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్తో పాటు టీజర్ను ఆవిష్కరించారు. చీఫ్ గెస్ట్గా హాజరైన దర్శకనిర్మాత సంజీవ్ కుమార్ మేగోటి మాట్లాడుతూ టీజర్ అద్భుతంగా ఉంది. సినిమా క్వాలిటీగా తెరకెక్కుతోంది. నంది వెంకట్ రెడ్డి గతంలో తీసిన 'తారకేశ్వరి' సినిమా పాటలను మా అన్విక ఆడియో ద్వారా విడుదల చేశాం. చిన్న సినిమాలతో ప్రారంభమైన శ్రీ శివసాయి ఫిలమ్స్ బ్యానర్ ఇప్పుడు పెద్ద స్థాయికి చేరాలి. మొత్తం చిత్ర యూనిట్ ఒక కుటుంబంలా కలిసికట్టుగా పనిచేస్తోంది. 'ఇంద్రావతి' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్! అని హృదయపూర్వకంగా ఆకాంక్షలు తెలిపారు.

## ఫిబ్రవరి 13న 'స్వయంభు' విడుదల



కార్తికేయ–2తో దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొందిన నిఖిల్, ఇప్పుడు తన ప్రతిష్టాత్మక 20వ చిత్రం 'స్వయంభు'తో ప్రేక్షకులను ఆకర్షించబోతున్నాడు. ఈ హిస్టారికల్ యాక్షన్ ఎపిక్‌కి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మించారు. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. రెండు సంవత్సరాల ప్రయాణం, 170 రోజుల ఇంటెన్స్ షూటింగ్ తర్వాత ఈ మహత్తర చిత్రీకరణ పూర్తి చేసిందని టీం ప్రకటించింది. భారతదేశపు వైభవమైన చరిత్రను, మహోన్నతతను సెలబ్రేట్ చేస్తూ రూపొందుతున్న 'స్వయంభు' చిత్రం ఈ మహాశివరాత్రి ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.' మన భారత దేశ చరిత్రకి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అవి రాజుల కథలో యుద్ధ గాథలో కాదు. మన సంస్కృతికి పునాదులు. ఆ చరిత్రలో చెప్పని ఒక గొప్ప వీరుడి కథే ఈ స్వయంభు' వీడియోలో నిఖిల్ తన గుర్రం 'మారుతి'ని పరిచయం చేస్తూ, ఈ మాగ్నమ్ ఓపస్‌ను సాకారం చేసిన టెక్నీషియన్ బృందాన్ని అభినందించారు.ఈ పాత్ర కోసం నిఖిల్ పూర్తిగా ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవ్వడంతో పాటు ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. కథనానికి ప్రామాణికతను ఇవ్వడానికి హిందీ వెర్షన్‌కు ఆయన స్వయంగా డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రంలో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. విజువల్ మాస్ట్రో కెకె సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, స్టార్ కంపోజర్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్ను ఎం.ప్రభాహరన్, రవీంద్ర వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది.

## ఐబొమ్మ బంద్‌తో పెరిగిన కలెక్షన్స్

'రాజు వెడ్స్ రాంబాయి' నిర్మాతల ధీమా



'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా మేము ఊహించినదాని కంటే పెద్ద విజయాన్ని సాధిస్తోంది. కొన్ని సినిమాలకు కలెక్షన్స్ చెప్పలేం. కానీ ఈ సినిమాకు మాత్రం కలెక్షన్స్ చెప్పాలని అనిపించింది. ఇప్పటిదాకా మొత్తం 7.28 కోట్ల రూపాయల కలెక్షన్స్ రాగా, కేవలం నైజాం నుంచే 5 కోట్ల 2లక్షలు వసూలు అయ్యాయి. నిన్న ఒక్కరోజు 2 కోట్ల 17 లక్షలు కలెక్షన్స్ వచ్చాయి. తెలంగాణ స్టేట్‌లోని మల్టీప్లెక్స్‌ల కంటే సింగిల్ స్క్రీన్స్ నుంచే ఎక్కువ కలెక్షన్స్ వచ్చాయి అని వెడ్స్ రాంబాయి సినిమా నిర్మాతలు, పంపిణీదారులు బన్నీ వాస్ అన్నారు. ఏపీలో మొదటి రెండు రోజులు డల్‌గా ఉన్నాయి, నిన్న కలెక్షన్స్ బాగున్నాయి, వైజాగ్ 10 లక్షలు, ఈస్ట్ నుంచి 9 లక్షలు వచ్చాయి. కృష్ణా 12 లక్షలు, గుంటూరు 13 లక్షలు కలెక్ట్ చేసింది. సీడెడ్ కలెక్షన్స్ డీసెంట్‌గా ఉన్నాయి. లిటిల్ హార్ట్స్‌కు కూడా ఇలాగే కలెక్షన్స్ వచ్చాయి. ఇటీవల సినిమాలకు నైజాంతో చూస్తే ఏపీలో కలెక్షన్స్ తగ్గుతూ వస్తున్నాయి. ఐ బొమ్మ క్లోజ్ అవడం వల్ల మా మూవీ కలెక్షన్స్ పెరిగాయి. 99 రూపాయల రేట్ పెట్టడం వల్ల ప్లస్ అయ్యింది. కొందరు డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ మొదట్లో ఒప్పుకోలేదు కానీ ఇప్పుడు 70 పర్సెంట్ అంతా ఈ రేటుకు అంగీకారానికి వచ్చారు అన్నారు.

డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ.. 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా చూస్తూ అమ్మాయిలు ఎమోషన్ కు గురవుతున్నారు. మేము పెట్టిన పెట్టుబడికి నాలుగు రెట్ల లాభాన్ని ఈ మూవీ ఇస్తుందని ఆశిస్తున్నాం. ఏపీతో చూస్తే నైజాంలో కలెక్షన్స్ ఎక్కువగా ఉన్నాయి. మా టీమ్ ఆల్రెడీ థియేటర్స్ విజిట్ చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో మొత్తం టీమ్ అంతా థియేటర్స్ విజిట్‌కు వెళ్తాం. ప్రేక్షకుల రెస్పాన్స్ చూసి స్క్రీన్స్ యాడ్ చేశాం. 99 రూపాయల టికెట్ రేట్ పెట్టడం, ఐ బొమ్మ క్లోజ్ కావడం మా సినిమాకు కలిసి వచ్చింది. ఐ బొమ్మలో పైరసీ మూవీస్ చూసేవాళ్లు ఎక్కువగా బీ, సీ సెంటర్స్ వాళ్లే. ఇప్పుడు ఆ సైట్ క్లోజ్ కావడం వల్ల వాళ్లు థియేటర్స్‌కు రావడం పెరిగింది. టికెట్ రేట్ 99గా ఫిక్స్ చేసుకోకుంటే సింగిల్ స్క్రీన్స్ క్లోజ్ చేసుకోవాల్సిందే. ఇప్పుడు పరిస్థితులు అలా ఉన్నాయి అన్నారు.

## 'త్రికాల' పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి

ప్రస్తుతం మైథలాజికల్ టచ్ ఉన్న పాయింట్‌తో వచ్చే చిత్రాలకు మంచి డిమాండ్ ఉంటోంది. ఆడియెన్స్ కూడా ఈ ఫిక్షనల్ జానర్ చిత్రాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలోనే రిత్విక్ వేట్సా సమర్పణలో రాధిక, శ్రీనివాస్ నిర్మాతలుగా శ్రీ సాయిదీప్ చాట్లా, వెంకట్ రమేష్ దాడి సహ నిర్మాతలుగా 'త్రికాల' సినిమాను మణి తెల్లగూటి తెరకెక్కిస్తున్నారు. శ్రద్దా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి అవంచ, ఆమని, ప్రభాకర్, అంబటి అర్జున్, రౌడీ రోహిణి వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు.ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మాస్టర్ మహేంద్రన్ చేసిన యాక్షన్ సీక్వెన్స్, నటుడు అజయ్ విశ్వరూపం, సినిమాలోని డైలాగ్స్, శ్రద్దా దాస్ మేకోవర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ట్రైలర్‌తోనే సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయింది. ఒక్క ట్రైలర్‌తోనే ఏకంగా నార్త్ ఇండియాలోనూ 'త్రికాల' బిజినెస్ జరిగిపోయింది. ప్రస్తుతం అన్ని చోట్లా 'త్రికాల' మీద మంచి డిమాండ్ ఏర్పడింది.ఈ చిత్రానికి అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాలకు మ్యూజిక్ అందించిన నేషనల్ అవార్డ్ విన్నర్ హర్ష వర్దన్ రామేశ్వర్ మ్యూజిక్ అందించడం విశేషం. ప్రస్తుతం స్పిరిట్, పూరివిజయ్ సేతుపతి లాంటి పాన్ ఇండియా సినిమాలు చేస్తున్న హర్ష వర్దన్ రామేశ్వర్ 'త్రికాల' కథ నచ్చి ఈ సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నారు. ఇందులో ఆయన సౌండింగ్ స్పెషల్ ట్రాక్షన్ గా ఉండబోతోంది. 'త్రికాల'కు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ప్రస్తుతం పూర్తి అయ్యాయి. ఒక్కో పాటను రిలీజ్ చేస్తూ సినిమాపై మరింత బజ్ను క్రియేట్ చేయాలని టీం ప్రయత్నిస్తోంది. డిసెంబర్‌లో సినిమా రిలీజ్ కానుంది. శ్రద్దా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి అవంచ, ఆమని, ప్రభాకర్, అంబటి అర్జున్, రౌడీ రోహిణి, తనికెళ్ల భరణి, సాయి దీనా నటిస్తున్నారు.



## డిసెంబరు 25న 'పతంగ్' విడుదల

న్యూ టాలెంట్‌ను ఎంకరైజ్ చేయడంలో ఎప్పుడూ ముందుండే సురేష్ ప్రొడక్షన్స్ అధినేత, ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు తాజాగా 'పతంగ్' చిత్ర టీమ్‌తో చేతులు కలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేష్ బాబు సమర్పణలో ఈ చిత్రం డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రంను ప్రత్యేక్షంగా వీక్షించి, చిత్ర టీమ్ను ప్రశంసించిన ఆయన 'పతంగ్' చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తన సమర్పణలో చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. పతంగుల పోటీతో రాబోతున్న ఈ కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. 'మా చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్, అభిరుచి గల నిర్మాత డి.సురేష్‌బాబు సమర్పణలో రిలీజ్ కానుండటం ఆనందంగా ఉంది. ఈ సినిమా థియేటర్లో యూత్‌ఫెస్టివల్‌లా వుంటుంది. కొత్తవాళ్లతో చేసిన మా సినిమా కొత్తగా వుండటంతో పాటు చాలా పెద్ద సినిమా క్వాలిటీతో వుంటుంది అన్నారు. ఎంతో కలర్‌ఫుల్‌గా ఉండే ఈ సినిమాకు కథే హీరో. తప్పకుండా మా పతంగ్ చిత్రం అన్నివర్గాల వారిని అలరిస్తుందనే నమ్మకం వుంది. కొత్త కంటెంట్‌ను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం వుంది. డిసెంబరు 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని తెలిపారు



## పూరి-విజయ్ సేతుపతి షూటింగ్ పూర్తి

తమిళ నటుడు హీరో విజయ్ సేతుపతి, డైరెక్టర్ పూరి జగన్నాథ్ క్రేజీ కాంబినేషన్లో మోస్ట్ ఎవైటెడ్ పాన్ఇండియా ప్రాజెక్ట్



పూరిసేతుపతి షూటింగ్ పూర్తయింది. ఇంటెన్స్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్గా ప్రారంభమైన ఈ చిత్రం చిత్రీకరణ చివరి రోజు పూరి, విజయ్ సేతుపతి, చార్మీ కౌర్ మధ్య ఎమోషనల్ మూమెంట్స్‌కి సంబధించిన వీడియోను టీం విడుదల చేసింది. ఈ చిత్రాన్ని జెబి మోషన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మొత్తం షూటింగ్ పూర్తయినందున, చిత్ర బృందం ప్రమోషన్లను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో విడుదలకు సిద్ధమవుతున్నందున ఈ సిమిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ త్వరలో రిలీజ్ చేయనున్నారు.

## ట్రంప్ ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షలు, సవరణలు జరిగాయని ట్రంప్ చెప్పారు. యూరోపియన్ యూనియన్ దేశాలు కొన్ని సవరణలు ప్రతిపాదించాయి. వీటిల్లో ప్రధానమైనది ఉక్రేన్‌కు అమెరికా సెక్యూరిటీ గ్యారంటీ. ఈ మార్పులను ఇంకా పరిశీలించాల్సి ఉందని, మార్పులు చేసిన ప్రణాళిక ఇంకా తమ చేతికి అందవలసి ఉందని రష్యా ప్రకటించింది. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ–ట్రంప్ మధ్య సూటీ పోటీ మాటల యుద్ధం కూడా జరుగుతోంది. ఈ ఒప్పందం కుదురుతుందని, ఈ చర్చల్లో పెద్ద పురోగతి సాధించామని ట్రంప్ చెబుతూ ఎంతో ఆశాభావం వ్యక్తం చేశారు. 'మీరు కళ్ళతో చూసేవరకూ ఏదీ నమ్మలేరు, కానీ చాలా మంచి పరిణామాలు సంభవించబోతున్నాయి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల మధ్య జెలెన్‌స్కీ స్పందిస్తూ, ఉక్రేన్ భూభాగాన్ని రష్యాకు స్వాధీనం చేయడమే అతిపెద్ద, అతి ప్రధానమైన సమస్యగా కూర్చుందని నిర్వేదన వ్యక్తం చేశారు. స్వీడన్‌లో జరిగిన ఒక సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెలెన్‌స్కీ మాట్లాడుతూ, రష్యా అధ్యక్షుడు పుతిన్ తమ దగ్గర నుండి అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూభాగానికి చట్టబద్ధత ఇవ్వాలని అడుగుతున్నారని విమర్శించారు. ఉక్రేన్ దేశ ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించి దానిని ధ్వంసం చేసి చట్టబద్ధత ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. గతవారంలో ట్రంప్ ప్రణాళికను తెరమీదకు తీసుకురాగానే యూరోపియన్ యూనియన్ దేశాలు తీవ్రంగా విమర్శించాయి.

## రైళ్ల రియల్ టైమ్ పర్యవేక్షణ త్వరలో సాకారమౌతుంది

ఇరిసెట్ 68వ వార్షికోత్సవాలలో ఇస్రో చైర్మన్ డాక్టర నారాయణన్




ప్రజాపక్షం/హైదరాబాద్: సాంకేతిక పురోగతితో పాటు భారత రైల్వే నెట్‌వర్క్‌లోని అన్ని రైళ్లకు సంబంధించిన రియల్ టైమ్ పర్యవేక్షణ త్వరలో సాకారమవుతుందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ డాక్టర్ వి నారాయణన్ తెలిపారు. ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (ఇరిసెట్) తన 68వ వార్షికోత్సవాలను సోమవారం తార్నాకలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించింది. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిధిగా వచ్చిన ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ టెక్నాలజీ శిక్షణలో ప్రత్యేకత కలిగిన ఇండియన్ రైల్వేస్ ప్రముఖ కేంద్రీకృత శిక్షణ సంస్థ ఇరిసెట్ ఉత్సవాలలో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. భారత రైల్వేలు, ఇస్రో అనేక సారూప్యతలపై ఉమ్మడిగా దృష్టిసారించాయని ఇస్రోచైర్మన్ తెలియజేశారు. రైళ్లను సురక్షితంగా నడపడానికి, కమ్యూనికేషన్ చాలా అవసరమన్నారు. అవసరమైన కమ్యూనికేషన్‌ను అందించే అనేక ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించిందన్నారు. భారతదేశం చంద్రునిపై ఉత్తమ కెమెరాను కలిగి ఉండటం, చంద్రుని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన మొదటి దేశం కావడం మనకు గర్వకారణమన్నారు. అనేక సాంకేతిక పురోగతుల అమలు కోసం ఇస్రో మరియు భారత రైల్వేల మధ్య అనేక సహకారాలు ఉంటాయని ఆయన చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. భారతీయ రైల్వేలలో సిగ్నలింగ్ మరియు టెలికమ్యూనికేషన్ ఆస్తులపై విశ్వసనీయతను మెరుగుపరచడంలో కార్మిక శక్తి బహుళ నైపుణ్యాభివృద్ధి, నైపుణ్యాలను అందించడంపై చొరవ తీసుకోవాలని సంస్థను కోరారు. ఉత్పాదకతను మెరుగుపరచడానికి మరియు రైలు కార్యకలాపాలలో భద్రతను పెంచడానికి శిక్షణ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవడంపై గల ఆవశ్యకతను ఆయన తెలియజేశారు. సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. భారత రైల్వే అంతటా కవాచ్ విస్తరణను వేగంగా అమలు చేయడంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సి.ఓ.ఈ) కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. ప్రధాన విజయాలలో ఈఐ – కవాచ్ ఇంటర్‌ఫేస్‌ల క్రియాత్మక పరీక్ష, యూనివర్సల్ బ్రేకింగ్ అల్గోరిథం అభివృద్ధి, వెర్షన్ 4.0కి తాజాగా ఉన్న కవాచ్ ల్యాబ్‌ల పరికరాల అప్‌గ్రేడ్ విస్తృతమైన ఫీల్డ్ ట్రయల్స్, జాతీయ జ్ఞాన నిర్వహణ పోర్టల్ సృష్టి మరియు తదుపరి తరం పరిశోధన మరియు ఇంటర్ ఆపరేబిలిటీ కోసం అవగాహన ఒప్పందాలు ఉన్నాయి. రైల్వే బోర్డు ఆదేశాల ప్రకారం ఇరిసెట్ బహుళ కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, హెల్పర్ల కోసం సవరించిన పాఠ్యాంశాలను ప్రవేశపెట్టింది మరియు ఇంజనీరింగ్ కళాశాలలతో 18 అవగాహన ఒప్పందాలు, రైల్వేరంగ నైపుణ్యాభివృద్ధి కోసం ప్రభుత్వ ఐఐటి లతో పైలట్ సహకారాల ద్వారా పరిశ్రమ భాగస్వామ్యాలను బలోపేతం చేసిందన్నారు. రైల్వే బోర్డు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్ కుమార్ ఈ సమావేశంలో వర్చువల్‌గా ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు అదనపు సభ్యులు (సిగ్నల్) రాజేష్ కుమార్ పాండే, రైల్వే బోర్డు అదనపు సభ్యులు (టెలికాం) శైలేష్ గుప్తా, ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర సీనియర్ అధికారులు, అధ్యాపకులు, ట్రైనీలు కూడా పాల్గొన్నారు.

## ధర్మేంద్ర కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

బాలీవుడ్ ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ 'ఓ యుగం ముగిసింది' అని సుదీర్ఘ పోస్టు షేర్ చేశారు. ధర్మేంద్ర ఈ ఉదయం తుదిశ్వాస విడిచారని అంత్యక్రియలకు ముంబయిలోని పవన్ హాన్స్ శ్మశానవాటికలో ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ధర్మేంద్ర పార్థివదేహాన్ని అంబులెన్స్‌లో శ్మశానవాటికకు తరలించారు. ధర్మేంద్ర సతీమణి హేమమాలిని కుమార్తె ఇషా దేవోల్, బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్, ఇతర ప్రముఖులు శ్మశానవాటిక లోపలికి వెళ్లి అంతిమ వీడ్కోలు పలికారు. కాగా, ఇటీవల ఆనారోగ్యం కారణంగా ధర్మేంద్రను కుటుంబ సభ్యులు పలుమార్లు ఆసుపత్రిలో చేర్పించారు. రీసెంట్‌గా ఈ నెల 10న మరోసారి హాస్పిటల్‌లో చేరడంతో ఆయన ఆరోగ్యం మరింత క్షిణించిందని ప్రచారం సాగింది. ఆ తర్వాత ఆయన డిశ్చార్చి అయ్యారు. ఇంటి నుంచే చికిత్స అందించారు. ఈ క్రమంలో మరోసారి తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన సోమవారం కన్నుమూశారు. 1935లో డిసెంబర్ 8న పంజాబ్‌లో జన్మించిన ధర్మేంద్ర, 1960లో 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే'తో నటుడిగా అరంగేట్రం చేశారు. అలా దాదాపు 60ఏళ్లకు పైగా భారతీయ సినిమాలో ధర్మేంద్ర ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆయన కెరీర్‌లో 300+ సినిమాల్లో నటించి లెజెండరీ నటుడిగా గుర్తింపు పొందారు. 1997లో ధర్మేంగ్ర ఫిల్మ్‌ఫేర్ అచీవ్‌మెంట్ అవార్డ్ అందుకోగా, సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2012లో ఆయనను పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించింది. ధర్మేంద్ర చివరిసారిగా 'తేరీ బాటన్ మే ఐసా ఉల్జా జియా'లో షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కనిపించారు. అందులో షాహిద్ తాతగా నటించారు. అంతేకాకుండా రణవీర్ సింగ్, అలియా భట్ నటించిన బ్లాక్ బస్టర్ 'రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ'లో కూడా ఆయన నటించారు. ఈ నటుడు తదుపరి శ్రీరామ్ రాఘవన్ 'ఇక్కీస్'లో కనిపించనున్నారు. ఈ సినిమా డిసెంబర్ 25న విడుదల కానుంది. చిన్నవయసులోనే పరమవీర చక్ర పురస్కారాన్ని అందుకున్న సెకండ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. అందులో ధర్మేంద్ర అరుణ్ తండ్రిగా కనపడనున్నారు.

## క్లిష్ట రాజకీయ స్థితిలో భారత్

(మొదటి పేజీ తరువాయి)



ఎన్‌డిఎ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో బయలుదేరిన సిపిఐ జాతా సోమవారం సూర్యాపేట జిల్లా నుంచి ఖమ్మం సరిహద్దు నాయకన్ గూడెం వద్ద జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లా సరిహద్దుల వద్ద సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, పుచ్చకాయల కమలాకర్ తదితరులు ఘన స్వాగతం పలికారు. వందలాది మోటార్ సైకిళ్లతో ప్రారంభమైన ర్యాలీ కూసుమంచి, పాన్నెకల్, వరంగల్ క్రాస్ రోడ్డు, పెద్దతండా, నాయుడుపేట, బైపాస్ రోడ్డు మీదుగా ఖమ్మంకు చేరుకుంది. ఖమ్మంలో ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సభలో పశ్య పద్మ మాట్లాడుతూ కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాటాలతోనే ప్రజల హక్కులు సాధించబడ్డాయన్నారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్ర త్యాగాలమయమని అనేక మంది పేదల అభ్యున్నతి కోసం, కార్మిక హక్కుల కోసం భూమి, భుక్తి, విముక్తి పోరాటాల్లో అశువులు బాశారని, స్వాతంత్ర్యానికి పూర్వమే దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని ఆమె తెలిపారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని ఇప్పుడు దేశభక్తి గురించి నీతులు వల్లేవేస్తున్న ఏ ఒక్కరూ నాటి స్వాతంత్ర్య పోరాటంలో లేరని వారి పాత్ర శూన్యమన్నారు. స్వాతంత్ర్య అనంతరం కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధాన్ని విధించారని నిర్బంధాలను సైతం లెక్కచేయక ప్రజల హక్కుల కోసం పోరాడిందన్నారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఈరోజు ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాల వెనక కమ్యూనిస్టు పార్టీ త్యాగాలు, పోరాటాలు ఉన్నాయని కమ్యూనిస్టులతోనే హక్కులు సాధించబడ్డాయని ఆమె తెలిపారు. భారత దేశ నడిబొడ్డున స్వాతంత్ర్య రాజుగా ప్రకటించుకున్న నిజాం రాజు మీర్ ఉస్మాన్‌అలీఖాన్ పట్ల నాటి పాలకులు సానుకూలంగా ఉంటే నిజాం రాచరికానికి వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిందన్నారు. నిర్బంధాలను సైతం లెక్కచేయక జరిగిన పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారని ఆమె తెలిపారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహిస్తున్నామని లక్షలాది మందితో నిర్వహించే ఈ సభ భవిష్యత్తు రాజకీయాలకు వేదిక కానుందన్నారు.

ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జాతాకు నేతృత్వం వహిస్తున్న వలీఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య, నరేంద్ర, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జాని మియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అక్షరమే ఆయుధంగా వెలువడుతున్న "ప్రజాపక్షం" దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రభుత్వ అధికారులు
సూర్యాపేట జిల్లా

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com